సాహిత్య

# ప్రస్థానం

అక్టోబర్ 2009

వెల రూ. 10



సాహితీ స్రవంతి



త్రిపురనేని గోపీచంద్

(1910 సెప్టెంబర్ 8 - 1962 నవంబర్ 2)

సాహిత్య ప్రస్థానం
సంపుటి : 8 | అక్టోబర్ 2009 | సంచిక : 47

# విషాదంలో విపరీత పోకడలు

ప్రజల మద్దతుతో రెండో సారి ముఖ్యమంత్రిగా ఎన్నికైన డా.వై.ఎస్.రాజశేఖరరెడ్డి హెలికాప్టర్ ప్రమాదంలో దుర్మరణం పాలవడం పట్ల ప్రతివారూ సంతాపం తెలిపారు. సాహిత్య ప్రస్థానం కూడా ఇందుకు ప్రగాఢ సంతాపం ప్రకటించింది. ఆయన విషాదాంతంతో పాటు ఆ ప్రమాదం గురించి తెలియడంలో జాప్యం ఉత్కంఠకు తర్వాత మరింత బాధాకరమైంది. అయితే తదుపరి పరిణామాలు మరింత బాధాకరంగా వున్నాయి.

............................

వైఎస్ స్థానంలో ఆర్థిక మంత్రి కె.రోశయ్య ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. కాని ఆయన మంత్రివర్గ సభ్యులతో సహా చాలా మంది వైఎస్ జగన్ ను వెనువెంటనే ఆయన స్థానే రాష్ట్ర సారథిని చేయాలని పట్టుబడుతుండడంతో అనిశ్చిత పరిస్థితి ఏర్పడింది. కాంగ్రెస్ అధిష్టానవర్గం ఈ సమస్యపై స్పష్టమైన వైఖరిని ఖరారు చేయకపోవడంతో అనిశ్చిత పరిస్థితి కొనసాగుతుండడం అవాంఛనీయం. మరో వైపున రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభం, ఆరోగ్య సమస్యలు చుట్టుముడుతున్నాయి. ఎవరికి ఏ పదవి ఇవ్వాలనేది అధికార పార్టీ అంతర్గత వ్యవహారమైనప్పటికీ దాన్ని ఖచ్చితంగా త్వరితంగా తేల్చకపోతే రాష్ట్ర ప్రజలకు నష్టం కలుగుతుంది.

............................

వైఎస్ మరణానంతరం సహజంగానే అందరి నుంచి ప్రగాఢ సంతాపం వ్యక్తమైంది. అయితే కొంతమంది విప్లవ ముద్రాంకితులైన రచయితలు, విమర్శకులు కనీస రాజకీయ స్పృహ లేకుండా ఆయనపై భజన కీర్తనలు ఆలపించడం విమర్శలకు కారణమైంది. తర్వాత విరసం రచయిత ఒకరిని సస్పెండ్ చేయగా ఆయన క్షమాపణలు చెప్పుకోవలసి వచ్చింది. అలాటి అనుబంధాలు కలిగిన ఒక సీనియర్ పాత్రికేయుడు, ఒక ఎన్జీవో బాధ్యురాలు కూడా తమ వ్యాసాలలో మాటలు అపార్థం కలిగించాయని వివరణ రాసుకున్నారు. ఇవన్నీ చాలక ఒకానొక 'విప్లవ కవి' శ్రీకాకుళం పోరాటాన్ని ఉద్దేశించి ఒకప్పుడు తాను రాసిన బాణీని వైఎస్‌కు వర్తింప చేస్తూ కొత్త పాటకట్టడం తీవ్ర ఆక్షేపణలకు దారితీసింది గాని ఆయన తన చర్యనే సమర్థించుకున్నారు. మొత్తంపైన వాగాడంబరులు చాలామంది కీలకసమయంలో పాలక పక్షానికి స్తోత్ర కారులుగా తయారవడం విపరీతంగా కనిపించినా చరిత్రలో కొత్త కాదు. ఇలాటి పోకడలను ప్రగతిశీల సాంస్కృతిక శక్తులు ఎన్నటికీ ఆమోదించవు. ప్రగతిశీల వాదులుగా చలామణి అయ్యేవారిపైన కూడా పాలకవర్గాల ప్రభావం ప్రలోభాలు ఎంత తీవ్రంగా వుండేదీ తెలుసుకోవడానికి ఇలాటి సందర్భాలు దోహదపడతాయి.

**బొమ్మలు : చంద్ర, శేఖర్, శివాజి, లక్ష్మీనారాయణ, వెంకటేష్**

## ఈ సంచికలో...


| | |
|---|---|
| నోటి ముందటి కూడు (కథ) | 2 |
| కవిత | 8 |
| కొండేపూడి నిర్మల సాహితీ సౌరభాలు | 9 |
| కవిత | 13 |
| కవిత | 14 |
| శ్రీరంగం నారాయణ బాబు, శ్రీశ్రీ సాహిత్యం- సారూప్యత | 15 |
| కవిత | 19 |
| బస్సు ప్రయాణమూ కవిత్వమే! | 20 |
| స్మోక్‌లెస్ కోల్ (కథ) | 22 |
| కవిత | 25 |
| గురజాడ బాటే గురువు జాడగా శ్రీశ్రీ | 26 |
| కవిత | 31 |
| ఇప్పుడు ఎందరు 'గిరాంమూర్తి'లు కావాలో? | 32 |
| ఇతివృత్తం: మహాత్ముడే! | 33 |
| అమానుష సంస్కృతిలో అమ్మాయిల హాహాకారాలు | 36 |
| గురజాడ అడుగుజాడ | 38 |
| డైరీ | 39 |
| కొత్త పుస్తకాలు | 45 |


సంపాదకవర్గం

తెలకపల్లి రవి (సంపాదకుడు)
కె.ఆనందాచారి
ఎ.సత్యభాస్కర్
వీరప్రసాద్
ఎం.నరహరి

కె. లక్ష్మయ్య, మేనేజర్

చిరునామా

సాహిత్య ప్రస్థానం
ఎం.హెచ్.భవన్, ప్లాట్ నెం. 21/1, అజామాబాద్, ఆర్‌టిసి కళ్యాణమండపం దగ్గర, హైదరాబాద్-500 020,
ఫోన్ : 27660013, 9490099059
ఫ్యాక్స్, 040-27635136,
ఇ.మెయిల్ : Prasthanam_ss@yahoo.co.in

# నోటి ముందటి కూడు

◆ కథ




**శిరంశెట్టి కాంతారావు**

***మే**కపాలను, పెంటికలను కలిపి మెత్తగా పిసికి పాతగుడ్డ పీలికలకు పట్టించి ఉన్న నాలుగు తల్లిమేకల రొమ్ములకు 'పాతలు' వెయ్యసాగాడు పన్నెండేండ్ల ఉపేంద్ర.*

*అప్పుడే పొద్దుటి పుంటకల్లు ఒడుపుకొచ్చిన సత్తెన్నగౌడ బుస, బుస మని పొంగుతున్న కల్లు కావడిని తాటికమ్మల ఇంటి సూరుకింద చుట్టుకుమళ్లల్లో దించి, బుడ్డగోచి పెట్టుకుని గోలెం దగ్గర స్నానం చెయ్యసాగాడు.*

ఎల్లవ్వ బిర్ర బిర్రమని చప్పడవుతుంటే రోటిలో గోంగూర తొక్కు నూరుతుంది. పొయ్యిమీద కుతుఫ్, కుతఫ్ మని ఉడుకుతున్న కంట్రోల్ బియ్యపు అత్తెసరు అన్నం ముక్కవాసన వస్తుంది.

ఊరికి ఆవల దిక్కునున్న మిట్టమీద నుండి మందను తోలుకొస్తున్న అడివయ్య "ఏందే సత్తెయ్య మామా! మీ ఉప్పలిగాడు పాతలేసుట్ల మా గొల్లోల్ల పోరల్లను మించిపోయిండుగాదె"! స్నానం చేసి వల్లు తూడ్చుకుంటున్న సత్తెన్నతో తడిక మీదుగా తొంగిచూస్తూ అన్నాడు.

"ఎట్లనో బతకనీయే అల్లుడా ! నీ దర్మాన ఆడుగూడ పాతలెయ్య నేర్వబట్టే ఇంట్ల జర చాయే నీళ్ల మందం నాల్గుపాల సుక్కలు ఎల్లుతున్నై" తూడ్చుకున్న తువ్వాలను దులిపి పక్కనే ఉన్న దండెంమీద ఆరేస్తూ అన్నాడు సత్తెన్న.

అడివయ్య మేకల మంద గబ గబా వెళ్లి పోతుండడంతో పొయ్యి మీద్ది, పొయ్యిమీదే ఇంత అన్నాన్ని, రోట్లో నూరుతున్న తొక్కులో నుండి ఇంత తొక్కునూ మోదుగాకుల విస్తట్లో వేసి, అప్పుడే పిండుకొచ్చిన అన్నం గుడ్డలో చద్దిగట్టి కొడుకుచేతికందించింది ఎల్లవ్వ.

తల్లి అందించిన అన్నం మూటను, బస్తా తుంపులో కుట్టి ఉంచిన నీళ్ల సీసానూ వంకీకర్రకు తగిలించుకున్న ఉపేంద్ర మేకల్ని ఇద్చుకుని అడివయ్య మందను కలువబోయాడు.

సత్తెన్న ఎల్లవ్వలది మానుకోట పక్కనున్న తాళ్లపూసపల్లి. వాళ్లకు ఓ కూతురు, ఓ కొడుకు. ఆడపిల్లే పెద్దది. పేరు చంద్రకళ. పదహారేళ్లకే పోయిన శ్రావణంలో పెండ్లి చేశారు. ఇక కొడుకు ఉపేంద్రను బడిమానిపించి మేకలు కాయబెట్టారు.

సత్తెన్నకు నలభై నాలుగేండ్లు. మనిషి సన్నగా, ఎర్రగా ఉంటాడు. కాని ఎర్రటి అతని వంటి మీద పక్కటెముకల మీద ముస్తాదు ఒరుసుకుపోయి ఇంతింత పొడవున నల్లగా కాయలు కాశాయి. తలమీద పల్చబారిపోయిన జుట్టుతో పాటు గడ్డం, మీసాలు కూడా సగం, సగం నెరిసిపోయాయి. చుట్టతాగీ తాగీ పెదాలు నల్లబడి బండబారినట్లు కన్పిస్తుంటాయి.

సత్తెన్నకు మొదటి నుండీ కులవృత్తిగా వస్తున్న కల్లుగీయడం తప్ప వేరే పని తెలియదు. ఎల్లవ్వ భర్తకన్నా ఆరేండ్లు చిన్నది. మనిషి కొంచెం మందంగా, నల్లగా వుంటుంది. నవ్వు ముఖం. కలుపుగోలుతనం ఉన్న మనిషి. ఎప్పుడు చూసినా చీరగోచీ పెట్టుకునే ఉంటుంది. తను భర్త ఒడుపుకొచ్చిన కల్లును ఊళ్లో ఆసాములకు వొడికలు పోయంగా




October 2009_30_09_2009_4.pmd 2 10/1/2002, 8:42 PM

మిగిలిన కల్లును మానుకోటకు తీసుకెళ్లి అమ్ముకొస్తుంది.

మొత్తం మీద ఆలుమగలు ఎంత కష్టం చేసినా పొట్టా, బట్టకు మాత్రం ఇబ్బంది లేకుండా జరిగిపోతున్నప్పటికీ బిడ్డ పెండ్లికి రామిరెడ్డి పటేలు దగ్గర వడ్డీకి తెచ్చిన ఇరవై వేలకు వడ్డీ కట్టడమే కష్టమైపోతుంటే, ఇక అసలు తీరే మార్గమేంటో అర్థంకాక ప్రతిరోజూ బాధపడుతూ వుంటారు.

ఓల్టేజ్ తక్కువైన వీధిదీపాలు సుంకుబోసుకుంటున్న ఎర్రజొన్న కంకుల్లా స్థంభాలకు వేళ్లాడుతున్నాయి.

ఊరంతా అప్పుడప్పుడే సంధ్య చీకట్లగొంగట్లోకి ముడుచుకుంటుంది. ఆ మసక చీకట్లో మానుకోట నుండి ఆటోదిగి ఇంటికొచ్చిన బిడ్డను చూసిన ఎల్లవ్వ కంగారుపడిపోతూ “ఏంది బిడ్డా! పొద్దుబొయ్య వచ్చినౌ! అల్లుడురాలే?’ అంటూ బిడ్డను దగ్గరగా తీసుకుని గుండెల్లో పొదుపుకుంది.



తొలకరి చినుకుల స్పర్శలో విప్పారుతూ మట్టివాసనలు పరిమళించే నేల తల్లి వాసనలా ఆ తల్లి వంటి చెమట వాసనను ఆస్వాదిస్తూ పులకించిపోయిన చంద్రకళ గుండె తటాకం ఉప్పొంగి కళ్ల తూముల గుండా జారి చెక్కిళ్ల పీఠ భూములను తడుపుతూ ఎదమాగాణంలోకి ఇంకిపోతుంటే మరింత ఆర్తిగా తల్లిని అల్లుకుపోయింది.

అమ్మంటే ఆత్మకదా ! ఆ ఆత్మతో తాదాత్మ్యం చెందడమనేది ఏ ప్రాణికైనా ప్రాకృత ధర్మం కదా? ఆ తాదాత్మ్యంలోనే తన అత్తింటి కొత్త బతుకును అమ్మ ముందు ఆరబోసుకుంది చంద్రకళ.

“ఈ బతుకులుపాడుగాను బొక్కలర్గ కష్టం చేసినా ఒక్కపైసా మర్లబడకపాయె. మీదికెల్లి ఉద్దెర్లు, సద్దెర్లు తెచ్చుడైతుంది. మల్లగిస్మంటి ఔసరాలు ఎట్లెల్లదీయాలి?” పొద్దున్నే తాళ్లల్లోకి పొయ్యొచ్చిన పెనిమిటికి అన్నం పళ్లెం చేతికిచ్చిన ఎల్లవ్వ బిడ్డ చెప్పిన విషయాన్ని భర్తకు వివరించింది.

విషయం విన్న సత్తెన్న “మరేం చేద్దామంటవే? అసలే ఆనల్లేక ఇయ్యేడు తాళ్లుగూడ సక్కంగా పారట్లేదు. రాంరెడ్డి పటేల్నే అడుగుదామంటే పిల్ల పెండ్లికి తీసుకున్న బాకీ అట్లనే నిలబడిపాయె. వచ్చిన పావుల బేడ గూడా మిత్తికింద ఆల్లకే గడుతుంటిమీ” అన్నాడు నిస్సహాయంగా.

“ఐనా, నాకు తెల్వకడుగుతా...కాలంగింత ఒరుపుగుంటే పిలగానికి సోయిలేకపోయినా, అయ్యవ్వలకైనా జరంత ఉండొద్దా? ఆడపిల్ల నిచ్చిన కాడ ఒప్పుకున్నదేదో ఇయ్యాలగాకుంటే, రేపిస్తంగాని ఎగ్గొడ్తమా? దీపాలి కట్నం కింద పిలగానికి సైకల్కొనిస్తమన్నది నిబద్దే. గాని గాసైకల్కొనిస్తేనే అల్లున్ని తోలిస్తంగాని, లేకుంటే లేదని పోరినొక్కదాన్ని తోలిస్తరా !? ఆల్లు మనుసులా? మనుబోతులా?” కడుపులో వేదన మత్తడి దాటిన వరదలా బయటకు దూకుతుంటే.... అల్లుని మీద, అతని తల్లిదండ్రుల మీదా నిప్పులు చెరిగింది ఎల్లవ్వ.

‘గిప్పుడా మాటలెందుగ్గాని, ఈగండమెట్ల గడ్సుద్దో జర జూడుమల్ల” అన్నంకుత్తుక పట్టడంతో మంచినీళ్ల చెంబెత్తి గట, గట తాగుతూ అన్నాడు సత్తెన్న.

ఇంతలో.........

“నాయినా ! నాయినా !” ఏదో బరువు మోస్తున్న వానితీరుగా అడవి నుండి మేకలు తోలుకొచ్చిన ఉపేంద్ర వాకిట్లో నుండి కేకమీద కేక వేయసాగాడు.

‘ఏంట్రా ఉప్పలీ! పొద్దుబోయిందేంది బిడ్డా !” అనుకుంటూ పళ్లెంలో చెయ్యి కడిగి తువ్వాలుకు తూడ్చుకుంటూ గబగబా బయటకు నడిచాడు సత్తెన్నగౌడు.

తండ్రిని చూస్తూనే ‘నాయినా! మన వూరిమేక ఈనిందే. రెండు మర్కపిల్లల్ని పెట్టింది. వాట్ని మోసుకుంటూ వచ్చేతలికి జర పొద్దుపోయింది”. రెండు భుజాల మీద వున్న రెండు మేక పిల్లల్ని కిందికి దించి ఆయాసం తీర్చుకుంటూ చెప్పాడు ఉపేంద్ర.

తమ్ముని మాటలు విని బయటికొచ్చిన చంద్రకళను చూసిన ఉపేంద్ర “అక్కెప్పుడొచ్చింది?” అంటూ చంద్రకళ దగ్గరకు నడిచి చెయ్యిపట్టుకుంటూ సంతోషాన్ని ప్రకటించాడు.

‘పొద్దు మింకినంకనే వొచ్చిన తమ్ముడా!” అంటూ తమ్ముణ్ని దగ్గరకు తీసుకుని తండ్రివైపు చూస్తూ “నాయినా ! జోడు మర్కపిల్లల్లో పాలు మర్సినంక నాకో మర్క పిల్ల ఇయ్యాల్నే” కళ్లు మిల మిలా చిలికిస్తూ గారాబంగా అంది.

కూతురు మాటలకు పెద్దగా నవ్వుకుంటూ “ఓర్నియవ్వ ! గందుకే అన్నరు, ఆడిపోరి ఆశకు ఆనపపాదు ఎదుగుదుకూ అంతుండదని. పెండ్లై నిండా నాల్గునెల్లైందో లేదో? అప్పుడే దీనికింత వుశారొచ్చింది!” భార్య వైపు చిలిపిగా చూస్తూ అన్నాడు సత్తెన్న.

“ఫో... నాయినా ! నువ్వెప్పుడూ గిట్లనే మాట్లాడ్తవేగాని..” అంటూ సిగ్గుతో ముఖం దాచుకుంటూ తూనీగలా తుర్రుమంటూ ఇంట్లోకి పరుగుతీసింది చంద్రకళ.

ఇంట్లోకి ఉరుకుతున్న బిడ్డను చూసుకుని సంతోషంగా నవ్వుకున్నారు సత్తెన్న, ఎల్లవ్వలిద్దరూ.

◆ ◆ ◆

సత్తెన్న ముస్తాదులో నుండి ఒక్కో కత్తి తీసుకుని నెర్సు చెక్క మీద పదునుపెట్టుకుంటున్నాడు. ఎల్లవ్వ గోలెం దగ్గర కల్లు ముంతల్లో మడ్డి కడిగి పారబోస్తుంది.



October 2009_30_09_2009_4.pmd 3 10/1/2002, 8:42 PM

చంద్రకళ బొట్టుపెట్టె ముందు పెట్టుకుని తలదువ్వుకుంటుంది...

ఉపేంద్ర అరికాల్లో విరిగిన ముల్లును పిన్నీసుతో కుట్టి, సిమ్మెటతో బయటకు గుంజాలని తెగ ప్రయత్నిస్తున్నాడు.

ముసలి బైరయ్య జంగిలిగొడ్లు విడవండని వీధిలో చేరి కేకలు వేస్తున్నాడు.

చాకళ్లు ఊరు తిరిగే వేళ అవుతుంది.

కత్తులు నూరడం అయిపోయాక ఎక్కడివక్కడ సర్దుకుని "గట్లబైటికి బొయ్యి పొగాకన్న దెచ్చుకుందాం" అనుకుంటూ బయలుదేరాడు సత్తెన్న.



బయటకు బోతున్న భర్తను గమనించిన ఎల్లవ్వ "యాడికి బోతున్నవే? మరి అల్లుని సంగతేం జేసినౌ? దీపాలికి కొత్తల్లుడు రాకపోతే నల్గుర్ల ఇజ్జతుంటదా? పైసలే ఊళ్లెయాడ దొరకవుగాని ఎట్లనన్న జేసి మెల్లగా రాంరెడ్డి పటేల్‌కాణ్నే అడుక్కురా" అంటూ సలహా చెప్పింది.

'హ్హా ఎన్నిసార్లు చెప్తవ్ తియ్! రేపు, ఎల్లుండి పటేలింట్ల ఏందో దావతుందంట. ఇంటి నిండా సుట్టాలొస్తుంద్రు. చెట్లకు పారిన కల్లంతా ఇంటికి తీస్కరమ్మని జీతగాని పొరనితో నిన్ననే మతలబ్ జేసిండు. గా కల్లు కొంచబోయినప్పుడు అడుగుతలే. కాకుంటే పాతబాకి తీర్చకుంట మల్ల కొత్తబాకి అడిగితే ఏమంటడో ఏమో?" వెనుకా, ముందులాడుతూ అన్నాడు సత్తెన్న భార్యతో.

"ఏమంటడు? నాతాన పైసలు మోదుగొకుల్లెక్కతోర్లాలు గట్టి అటుకుమీన ఆరేసినగాని కొంచబొమ్మంటడా? మన ఆపద, అక్కర తెలియజెప్పుకుని కాల్లు–గడ్డం పట్టుకుని ఎట్లనో గట్ల ఔసరం ఎల్లదీసుకోవాలెగాని" జీవితం నేర్పిన పాఠాలకు రాటుదేలిన ఎల్లవ్వ మగనికి తెలియజేసింది.

అప్పటిదాకా బయటకు పోదామనుకున్న వాడల్లా భార్య మాటలతో మనసు మరల్చుకుని ఇంట్లోకొచ్చి నులకమంచం మీద కూర్చుంటూ "గట్లనే అడుగుతగాని, గాఁజీడిగింజలాడ బెట్టినవో ఇటుబట్టకరాపో...జీడికట్లులేక కల్లుల చీమలుబడుతున్నె" అన్నాడు సత్తెన్న.

"దేవునర్రల దొంతిలబెట్టినగాని తెస్తుండూ" అంటూ లేచింది ఎల్లవ్వ.

◆ ◆ ◆

'ఏవమ్మె ! నిన్నే, గీ ముస్తాదుల గీసకత్తి లేదేంది?" రోజూ చీకటితో లేచి తాళ్లల్లోకి వెళ్లే సత్తన్నకు ఆఁరోజు తెల్లగా, తెల్లవారిందాకా మెలక రాకపోవడంతో దిగ్గునలేచి తాళ్లల్లోకి పొయ్యేందుకు హడావిడిగా తయారవుతూ వాకిట్లో కసువు ఊడుస్తున్న ఎల్లవ్వను పిలవసాగాడు.

పెనిమిటి పిలుపుకు ఊడుస్తున్న చీపురుకట్టను అక్కడపారేసి ఇంట్లోకొస్తూ "ఏంది? లేస్తలేస్తనే అరివాత అట్లమొత్తుకుంటున్నవ్, గిదేంది? కత్తి గీమూలకే ఉంచుకుని, ఇల్లంతాదోలాడుతున్నవ్" విసుక్కుంటూ తీసిచ్చింది ఎల్లవ్వ.

"ఇయ్యాల రాంరెడ్డి పటేలింట్ల ఏందో దావతుందంట. పొద్దుపొడ్వక ముందల్నే మోరుదెచ్చి ఇంట్లబెట్టిపొమ్మని మొన్ననంగ చెప్పంపిండు. సూడు, సూడుమని ఇయ్యాల్నే పొద్దుగాల మేల్క తలక్కపాయె. గిప్పుడు తాళ్లల్లకు బొయ్యికల్లొడుపుకుని పటేలింటికి బొయ్యేతలికి ఏయాల్తైతదో? ఏంకతో? గాయన జెప్పినట్లు జెయ్యకుంటే నోరుగాయకుంట సుట్టెడు బలగాలను బైలుజేస్తడు" అనుకుంటూ మోకు, ముస్తాదుల్ని తగిలించుకుని ఖాళీ కల్లుకుండల కావడిని భుజానకెత్తుకుని గబగబా తాళ్ల దిక్కు బయలుదేరాడు సత్తెన్న.

"ఏంరా! బిడ్డా! సత్తెన్నా ! గౌండ్లోడు పొద్దటిజాం కల్లు దెచ్చేదెప్పుడ్రా?! పెండ్లం మబ్బాల్నే పక్కమీంచి లేవనియ్యలే? ఇంట్లోకి సుట్టపోల్లొస్తుంద్రురా కొడకా! జర పొద్దుగాల్నే మోరుదించి పొమ్మని రెండ్రోజులకిందనే జీతగాని పోరగానితో చెప్పంపితిగాద్రా?!

ఊల్లెగౌండ్లనందర్ని గాదని నాచెలకల తాళ్లన్ని నీకే ఇస్తున్నాగాదు. గందుకే మీకు జర మస్తి బెరిగిందిరా. కడుపు నిండా తిండి తీట వెుగడని ఊకెనో అన్నారు. నా తాళ్లు మీకువతనైపాయె. కడుపు నిండ బువ్వదొరికినంక ఇంకదొరేంది? వాని పీకుడేంది గదురా?!" ఎదుటి మనిషంటే ఏమాత్రం నదురూ, బెదురూ లేని పటేలు సత్తెన్న భయపడ్డట్టుగానే నోటికొచ్చినట్టు మాట్లాడసాగాడు...బంకుల్లోకూర్చుని.

పటేలు మాటలకు వంట్లో నెత్తురు నీరైపోతుంటే ఏమీ మాట్లాడలేక కావడిదించి "గిప్పుడేమన్న అంటే ఇంకింత రెచ్చిపోతాడు. అసలే పైసలు గూడ అడగాల్నాయె" అనుకుంటూ తన్లోతానే ఆలోచన చేసుకుని నిశ్శబ్దంగా చేతులు కట్టుకుని మూలకు ఒదిగినిలబడ్డాడు సత్తెన్న.

"ఎన్ని మాటలన్నా శరంలేకుంట ఇంక గట్లనే నిలబడితివేంద్రో?" తాగుతున్న పొరచుట్టను బయటకు తీసి దానికున్న నుసిని రాలుస్తూ... అన్నాడు పటేలు.

"మీతోని జరంత పని బడిందయ్యా..!" గొంతులో ఏవో అవమానపు పల్లేరుగింజలు అడ్డుపడుతున్నంత బాధగా అన్నాడు సత్తెన్న.

"ఏం పని?" మళ్లీ చుట్టను నోట్లో పెట్టుకుని ముని పళ్లతో వత్తిపడుతూ అన్నాడు పటేలు.

"దీపాలి పండుగకు కొత్తల్లున్ని తోలుకొచ్చేడిదుంది. ఆనికి దీపాలి కట్నం కింద సైకల్ బెట్టేదుంది. చేతిల పావుల పైసలు కూడా లేవు. ఎట్లనోగట్ల మీరే జర సర్దుబాటు చెయ్యాల...ఒక్క మూడేలు సాలు" ప్రాధేయపడుతూ అడిగాడు సత్తెన్న.



October 2009_30_09_2009_4.pmd 4 10/1/2002, 8:42 PM

''పైసలా!; అయ్యెట్లుంటైరో ! మా ఇంటిగ్గాడ కొత్తల్లుడొచ్చేదుందిగాదు. మార్కెట్లకు ఏందో కొత్త మోడలు కారొచ్చింది. కొనివ్వాల్నని గా వారంకిందనే పిల్లతోని ఫోన్ గొట్టిచ్చిండు. ఒకటా రెండా ఏడు లచ్చలు తయ్యారు జేసేతలికి దేవుల్లుకన్పిచ్చింద్రంటే నమ్ము. ఇయ్యాల్నే వస్తుంద్రు. గందుకే నిన్ను పొద్గాల మోరుదెమ్మన్న" నోట్లో చుట్టను విసిరిపారేసి, పక్కనే ఉన్న చెంబులో నీళ్లతో పుక్కిలిస్తూ...అన్నాడు పటేలు.

"గట్లంటెట్లా? బాంచన్ ! ఒక్క మూడేలేగా నేనడిగింది. సైకల్‌తోపాటు బిడ్డకు, అల్లునికి బట్ట గుడ్డలు గూడ తెచ్చేదుంది" ముడుచుకున్న చేతుల్ని మరింత బిగిస్తూ అన్నాడు సత్తెన్న.

''ఏంద్రో!? అల్లునికోసం అంతపావురపడుతున్నౌ? అల్లుడు పండ్గకు రాకపోతే, పండగ ఆగిపోతాదిరా!" తనకంట్లో దూల ముంచుకుని, ఎదుటికంట్లో నలుసు తీయబోయినట్లు మాట్లాడసాగాడు పటేలు.



పటేలు మాటలు చివుక్కుమంటూ గుండెల్లో పొడుస్తున్నా తన్నుకాదన్నట్లు నిల్చుండిపోయాడు సత్తెన్న.

''ఔన్రారీ! మర్సేపోయిన. మీ ఉప్పలిగాడు మంచి ఉశారున్నడ్రో. మొన్న నేను బాడువ పొలానికి పోతుంటే మేడికుంట కట్టకు మేకలు మేపుతుండు. పచ్చనాకు దొర్కనిగీ కర్వు రోజుల్లగూడ మేకల్నిట్ల పిత్తబలిసేటట్టు మేపుతుండుగాదురా!" ఆ మేకలను చూసినప్పటి నుండి వాటిని ఎట్లా కాజెయ్యాలా? అని పాచికలేస్తూ అన్నాడు పటేలు.

ఏడాదిపాటుగా గొల్లోల్ల అడివయ్యకు ఆడికబింకిపోస్తే ఒక్క మర్కపిల్ల ఇచ్చిండు. దానికితోడు మా ఇంటిదాని మెడమీద ఉన్న ఇంత బంగారం తీసేసి ఇంకో నాల్గు మర్కపిల్లల్నిగొని సద్వుకుంటున్న పోరన్ని బడిబందుబెట్టిచ్చి గా మేకపిల్లలెమ్మటి తోలిస్తున్న" ఎంత కష్టపడితే ఆ నాలుగు మేకలూ ఎదిగొచ్చాయో వివరించాడు సత్తెన్న.

"ఏదో నన్నడగాలని పైసలగుడుతున్నవేగాని నీకేంద్రో? ఎప్పుడంటే అప్పుడు ఓ పోతునో, మర్కనో బర్కుతవ్ వొందిలి ఎల్లదీస్కుంటవే." వాకిలి ముందు నుండి పోతున్న వాళ్లను పారజూస్తూ అన్నాడు పటేలు.

మాకున్నది ఒక పోరి, పోరడు. ఎట్లనో మీ దర్మాన పోరి పెండ్లైతే సేసినం. పోరనికే ఏం లేదు. గా తాటికమ్మల పాకదిప్ప శారెడు భూమి లేకపాయె. ఏదో కొన్నాళ్లపాటు అట్లనే కష్టపడితే అప్పో, సప్పోదీరంగా పావులో బేడో ఎనకబడితే ఇంతభూమి దీసుకుని పోరనికి ఇంత తొవ్వజూపిద్దామని ఆశ బడుతున్నం." పటేలు వంకరబుద్ధి తెలిసీ తన మనసులోని మర్మాన్నంతా విప్పి చెప్పాడు సత్తెన్న.

సత్తెన్న మాటలు విన్న పటేలు అంతరంగం వేపాకులు నమిలినట్టుగా మారిపోతుంటే "వారీ సత్తిగా! గింత ఆలోచన జేసేటోడికాడ పైసల్లేవంటే ఎవలన్న నమ్ముతార్రా?! నాతాన పైసల్లేవన్నా ఇనకుంటా నాబుర్రంత కుమ్మరి పురుగుతొల్సినట్టు తొల్వబడితివేంద్రా హోలే!" బుస్సున కోపం తెచ్చుకుంటూ సత్తెన్న మీదికి ఇంతెత్తున లేచిండు పటేలు.

సత్తెన్న నోరు తెరిచి ఏదో అనబోతున్నంతలోనే, కూసం మీదున్న పాము లెక్కమెరిసి పోతున్న కొత్తకారొకటి చప్పుడు లేకుండావచ్చి పటేలు వాకిట్లో ఆగింది. ఆగిన కార్లో నుండి పటేలు బిడ్డా, అల్లుడు సుతారంగా కిందికి దిగారు.

వాళ్లను చూడ్డంతోటే పటేలు ముఖంలో సంతోషం మేఘాలు కమ్ముకొస్తుంటే నోరు తెరిచి నవ్వుకుంటూ వాళ్లకెదురెల్లి "పైనం మంచిగసాగిందా?" అంటూ బిడ్డను దగ్గరికి తీసుకుని "ఏంది బిడ్డా ! గిట్ల సన్నబడ్డవేంది?" అంటూ ఇంట్లోకి తోడుకునిపోతూ సత్తెన్న వంక చూసి "వారి సత్తెన్నా! గా కార్ల ఉన్న సామాన్లన్ని ఇంట్లకు దేరా!" అన్నాడు.

అదంతా చోద్యం జూస్తున్నట్టు జూస్తున్న సత్తెన్న పటేలు మాటలతో తేరుకుని కార్లో సామానంతా మోసుకుంటూ తన బిడ్డా, అల్లున్ని తలుచుకుని ''తూ...ఏం బతుకులో? పాడుబతుకులు" అనుకున్నాడు.

పటేలు ఇంటి లోపల అల్లుడు, బిడ్డలతో మాట్లాడుతూ కూర్చున్నాడు.

అంతలో...

అట్ల ముచ్చెట్లతోనే వాళ్ల కడుపు నింపుతారా, లేకుంటే వాళ్లను నాస్తా చేయనిస్తారా?" అప్పుడే తయారైన పెసర గారెలు, నాటుకోడికూరా తీసుకొస్తూ అంది పటేలు భార్య.

బయటకూర్చున్న సత్తెన్నకు వళ్లంతా చెమటలు పట్టి చిత, చితలాడసాగింది. పొద్దుటి నుండి కడుపులోకి ఏమీ లేకపోవడంతో కళ్లు తిరుగుతున్నట్టవుతుంటే "పటేలెప్పుడు బయటికొస్తడో, జల్ది బయటికొస్తే బాగుండు. గా పైసలు సంగతి పక్కా జేసుకుని పోదును" అనుకున్నాడు.

చాలా సేపటి తరువాత బయటికొచ్చిన పటేలు "ఏంద్రా సత్తెన్నా ! నువ్వింక ఇంటికి బోలే?!" సత్తెన్న ఎందుకున్నాడో తెలిసినా, తెలియనట్టే అడిగాడు.

"దీపాలి పండ్గ, మా అల్లుడు, సైకలు, పైసలు" అడిగిందే మళ్లీ, మళ్లీ అడగాల్సి రావడంతో నంగి నంగిగా అన్నాడు సత్తెన్న.

"ఓర్నీ! హౌలే! నీ దిమాఖ్ పన్జేయట్లేదార్రా? పైసలు దొర్కవని ఇందానే చెప్పినగాదు. ఆఁ మర్చిపోయిన, రేపాదివారం డొంకమైసమ్మ గుడితాన అల్లుని కారుకు జర యాటపిల్ల తొటి ఎర్రజేయించేదుంది. అట్లనే పండ్గనాడు అల్లుని దోస్తులొస్తుంద్రు. ఆల్లకు పెద్ద దావతియ్యాలె.



October 2009_30_09_2009_4.pmd 5 10/1/2002, 8:42 PM

ఇంటికిబొయ్యేటప్పుడు జర యాదికుంచుకుని ఆ గొల్లోల్ల అడివయ్య కాడికి బొయ్యి నా పేరుజెప్పి ఓ నాలుగు యాటలుగావాల్నని చెప్పు" అంటూ సత్తెన్నకు పని పురమాయించిన పటేలు "చెట్ల కల్లుగీసుకుని బతికే గౌండ్లోనికి ఎంత తెల్వి? నా చెట్లకు పారిన కల్లమ్ముకుని నాల్గు మేక పిల్లలు సంపాదించి ఎంతెంత ఆలోచన జేస్తుండు!? మేకల్ని పెంపుజేసి నాబాకీ దీరుస్తడంట! ఇస్మంటోల్లంత నాతాన బాకీలు దీస్కొనుడు బందుజేస్తే ఇంగ నా మాట వినేదెవలు? మీదికెల్లి పోరనికి ఇంత భూమి కొంటడంట! ఇట్లనే ఊల్లె ఉన్న లేబర్ కొడుకులంతా తెల్వి మీరిచేస్లు, చెల్కలు కొనుడు మొదలుపెడితే నా భూములు కౌలుకు పట్టేదెవరు? ఈ గౌండ్లోన్ని ఇట్లనే ఒదిలిపెడితే ఈన్ని జూసి ఇంకొకడు, ఆన్ని జూసి ఇంకొకడు అట్లనే తయారైతరు. ఈడు ఏనుకోక ముందే ఈని మేకలు మొత్తం నూకెయ్యకుంటే రేపు మన చేతులుండదు" అంటూ ఏదో పథకం వెయ్యసాగాడు.

'ఇన్ని కర్సుల్ల నాది గూడ ఓకర్సనుకోండ్రి, పైసలు మాత్రం జర సూడుండ్రి!" అన్నాడు సత్తెన్న.

"వొచ్చిన కాన్నుంచి జూస్తున్న, అల్లుడల్లుడని ఒకటే పడిచస్తున్నవేంద్రో? అసలు నాకు తెల్వకడుగుత, సెట్లుగీసుకుని బత్కేటోనికి సైకలెందుక్రా! తాల్లుగీసేటోల్లంతా ఎన్కటి సంది సైకల్ల మీదనే సెట్లకాడికి బోయిండ్రా? అంత పల్వతనంగాకుంటే. ఐనా గయ్యన్ని నాకెందుగ్గాని ఓ పన్జెయ్యి రా!" అంటూ మాట్లాడేదాపి ఏదో పనున్నట్టు ఇంట్లోకెళ్లాడు పటేలు.



పది నిమిషాలు ఇంట్లో అటూ ఇటూ తారట్లాడి బయటకొస్తున్న పటేలును చూస్తూనే "ఏందో చెప్పబొయ్య ఆగిపోతిరి పటేలా!" అంటూ ఆత్రంగా అడుగుతున్న సత్తెన్న గొంతులో ఏది కోరుకున్నాడో అదే కనిపించింది పటేలుకి.

"నాతాన పైసలైతే లేవుగాని, పాత సైకలొకటుంది ఏదో రేటు జేసి కొంచబొయ్యి బాగుచేయించి అల్లునికిచ్చుకోపో... గట్ల జేసినవంటే నీ మాటా దక్కుద్ది, మీదికెల్లి పైసలు గూడ తగ్గుతై" అంటూ సత్తెన్నకు పాత సైకిల్ అంటగట్టే ప్రయత్నం మొదలుపెట్టాడు.

పటేలు మాటలతో కొంత ఆలోచనలో పడిపోయిన సత్తెన్న "గీ ముచ్చట మా ఇంటిదాన్తో మాట్లాడి జెప్త పటేలా!" అంటూ లేచి కావడి బద్దను భుజం మీదకెత్తుకున్నాడు.

మొగనికి ఎదురొచ్చిన ఎల్లవ్వ అతని భుజం మీది కావడి బద్దను అందుకుని చూరులో చెక్కుతూ "పటేలేమన్నాడు?" ఏం వార్త మోసుకొచ్చాడన్న ఆతృతలో అడిగింది.

"ఏం జెప్పమంటవ్? గా పటేలింట్ల ఎంత సక్కదనంగుంది! ఆల్ల అల్లునిగాడి అప్పుడే దీసిన ఎన్న ముద్దలెక్క మెర్సిపోతుంది. పండగకు అల్లుడేగాదు, అల్లుని దోస్తులు గూడా వస్తరంట. మా రాజులకత గట్లుంటది. మన మున్నమెందుకు? కొత్తల్లునికి ముస్టి సైకలు కొనిద్దామంటే గింత తండ్లాటైతాండె! పటేలు బిడ్డ మొకం జూస్తుంటే ఎంత తేటగుంది. గదే మన బిడ్డ మొగంజూడు ఎట్లుందో? మసిబారినదీపం బుడ్డిలెక్క" అనుకున్న సత్తెన్న "పటేలు తాన పైసలైతే దొర్కవంట గాని, పాత సైకలుంది కొంచబొమ్మంటుండు" అంటూ పటేలింట్లో జరిగిందంతా వివరించాడు సత్తెన్న.

"అల్లునికి పాత సైకలిస్తే వొప్పుతడా? పటేలిప్పుడట్లనే అంటడుగాని, అటెంక బరాబర్ కొత్త సైకలంత గుంజుతడు" గత అనుభవాలు కళ్లముందు కదలాడుతుంటే వివరించింది ఎల్లవ్వ.

"ఇంగనువేగట్లంటే నేనేం జెప్పాలా? గియ్యన్ని గాకుంటే పటేలింట్ల దావతుంది గదా, దానికి యాటలుగావాల్నంట, గా గొల్లోల్ల అడివయ్యకు చెప్పమన్నడు. ఇంగ ఆనికి జెప్పేదేంది? మనమేకలే ఇద్దాం తియ్యి. దాంతోటి అల్లుని సైకలొస్తది, పటేలు పాతబాకీ తీరుద్ది" సత్తెన్న మేకలు కాజెయ్యడానికి పటేలు పన్నిన ఉచ్చులో జింక పిల్లలా పడిపోతూ అన్నాడు సత్తెన్న.

మగని మాటలు విన్న ఎల్లవ్వ తెల్లబోయి చూసన్తా "అయ్యో గట్ల మాట్లాడబడ్తివేంది? గా మేకల మీద ఎన్ని ఆసెలు బెట్టుకున్నం. నాలుగైదేండ్లపాటు ఒక్క పిల్లను కూడ అమ్మకుంట మందను పెంపుజేసి పోరనికింత భూవసర్తి చేద్దామనుకుంటిమిగాదు? గిప్పుడే అమ్మితే ఏమొస్తది? కాకుంటే సేతుల పైసలున్నప్పుడు సైకలు కొనిస్తమని అల్లున్నే కాలో, గడ్డమో పట్టుకుని బతిమాల్దాంతియ్యి" మేకలను అమ్మటం ఏ మాత్రం ఇష్టం లేనట్లుగా మాట్లాడింది.

ఆ పక్కనే మంచంలో పడుకుని తల్లిదండ్రుల మాటలు విన్న చంద్రకళ చటుక్కున లేచి 'గట్లైతే నేనుగూడ ఇయ్యాల్నే మా అత్తింటికిబోత తియ్యుండ్రి. గా, సైకలు లేకుంటబోతె నన్ను బత్కనిస్తరా? అంటూ సంచీలో బట్టలు సర్దుకోసాగింది...

బిడ్డ చేతిలో సంచి గుంజుకుని భార్యవైపు తిరిగి 'ఏంది? మన బిడ్డకంటే గా మేకలెక్కువనా? మన పానాలు సల్లగుంటె సాలు. ఇయ్యాలబోయిన మేకల్ని మల్ల సంపాదించుకుంటం. రేపు కొడుకు కోసం కూడ బెట్టేటందుకు ఇయ్యాల బిడ్డనేడ్పిద్దామా?! ఆని జాత్కమెట్లుందో?" ఎట్లాగైనా ఇక మేకలమ్మక తప్పదనే నిర్ణయానికొచ్చిన సత్తెన్న భార్యకు నచ్చజెప్పే ప్రయత్నం మొదలుపెట్టాడు.

తల్లిదండ్రుల తండ్లాట గమనించిన ఉపేంద్ర "నీయమ్మ! ఏందే గీ దానికి గింత సేపు సొంబాయిస్తుండ్రు? గా వూరి మేక రెండు పిల్లల్నించి మిగిల్నవాటిని తీసెయ్యుండ్రి. బావకు పాత సైకలెందుకు,



October 2009_30_09_2009_4.pmd 6 10/1/2002, 8:42 PM

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి డా॥ వై.యస్. రాజశేఖర్ రెడ్డి సెప్టెంబర్ 2న జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు.

వారి మృతికి సాహిత్య ప్రస్థానం ప్రగాఢ సంతాపం ప్రకటిస్తున్నది.



కొత్త సైకలే కొనియ్యుండ్రి. నేను మేపే మేపుడుకు ఆర్నెల్లల్ల ఆమీర్క పిల్లలెదిగొస్తై" అంటూ గలగలా మాట్లాడాడు.

కొడుకు మాటలు విన్న ఎల్లవ్వ కళ్లల్లోనుండి జల, జల నీళ్లు దుమికి పడుతుంటే కొడుకు బుగ్గలుపునికి మెటికలు విరుస్తూ "నా నాయన బంగారు కొండ! అక్కంటే పానం బెడ్తడు" అంటూ దగ్గరకు తీసుకుని ముద్దులాడ సాగింది....

మరునాడు పొద్దున్నే పటేలింటికి పోయిన సత్తెన్న ఎవరియో ఎందుకు పటేలా? నా మేకలే ఇస్తతీస్కోండ్రి" అంటూ తనంతట తానే బేరం పెట్టాడు.

"గదేండ్రి బిడ్డా! గా మేకల మీద ఎన్నో ఆశలు పెట్టుకున్నవ్ గాద్రా! వాటి మీదనే నా బాకీ దీర్వాల, ఇల్లు గట్టల, నీ కొడుక్కు ఇంత భూమి సంపాదించాలా, గిప్పుడే అమ్మితే ఎట్టరా?" పటేలంటున్న మాటలకు కడుపు మరిగిపోతున్నా మాట్లాడలేక తలవంచుకు నిల్చున్నాడు సత్తెన్న.

మేకలకు ఐదు వేలు ధరకట్టి మూడు వేలు పాతబాకీ కింద జమవేసుకుని, రెండు వేలు సత్తెన్న చేతిలోపెట్టి మళ్లీ అందులో నుండి పాత సైకిల్‌కింద వెయ్యి రూపాయలు వెనక్కి తీసుకున్నాడు. మిగిలిన వెయ్యి రూపాయల్లో ఐదు వందలు పెట్టి సైకిల్ బాగు చేయించే సరికి సత్తెన్న చేతిలో మిగిలింది ఐదు వందలు మాత్రమే.

ఆ రోజు దీపావళి పండుగ.

పటేలు అల్లుడు పట్టణం నుండి వచ్చిన స్నేహితులను తీసుకుని కొత్తకారులో మామగారి మామిడి తోటలో షికారుకెళ్లాడు.

వాళ్లందరికీ అక్కడే పార్టీ ఏర్పాటు చేయించాడు రామిరెడ్డి పటేలు.

ఆ రోజు చెట్లకు పారిన కల్లు మొత్తం పటేలు మామిడి తోటలోనే దించి వస్తున్న సత్తెన్న చేతికి వెయ్యి రూపాయలిచ్చి "జర మీ అల్లున్ని సైకల్ తీసుకుని మానుకోటకు బొయ్యి నాలుగు ఫుల్‌బాటిళ్లు తెమ్మనకపోతివి" అంటూ పనొప్ప జెప్పాడు.

అప్పటికే పటేలు అల్లుడు అతని దోస్తులు కల్లుతాక్కుంటూ యాటకూర తింటూ మజా చేసుకుంటూ ఏవేవో పాటలు పాడుకుంటూ చిందులు వేస్తున్నారు.

చెట్లకు ఒడిసిన కల్లంతా మామిడి తోటలోనే దించి వస్తూ.... వస్తూ.. రాజయ్య సేట్ దుకాణంలో నాలుగు పెద్ద కొకొకోలా సీసాలు తీసుకుని ఇల్లు చేరిన సత్తెన్న అల్లుని చేతికి డబ్బులిచ్చి మానుకోట పోయి పటేలుకి మందుబాటిళ్లు తెమ్మన్నాడు.

సైకిల్ మోజులోపడి 'తెస్తా' అంటూ మానుకోట దారిపట్టాడు సత్తెన్న అల్లుడు.

ఊళ్లో ఉన్న ఖాసిం సాహెబ్ దుకాణంలో కొనుక్కొచ్చిన తెల్లకోడి కూర, బొబ్బరి గారెలు వండి అల్లుని కోసం ఎదురు చూస్తూ కూర్చున్నారు సత్తెన్న ఇంటివాళ్లంతా.

తాను ప్రాణాలకు తెగించి దించిన కల్లు, తమ ప్రాణంతో సమానంగా పెంచుకున్న మేకలు తమకు కాకుండా పోవడానికి ఎక్కణ్నుండో వచ్చిన తెల్లకోళ్లు, కోకాకోలాలు మాత్రమే తమకు దక్కడానికి మద్యమన్న మర్మమేంటో అర్థంగాక మూసుకున్న సత్తెన్న కళ్ల ముందు పాతలు వేసిన మేకలు, ఆకలితో నక నక లాడుతున్న వాటి పిల్లలూ కన్పించడంతో అసలు రహస్యమేదో బోధపడినట్లు కళ్లు విప్పి చూసేసరికి "సత్తెన్న మామా! మీ అల్లునికి మానుకోటబోయ్యొస్తుంటే లారీ టక్కరైంది. సైకలు పనికిరాకుంట నుజ్జు నుజ్జైంది. మీ అల్లునికేమో రెండు కాల్లు ఇరిగినై. పోలీసోలొచ్చి గార్మెంటు దవఖానాకు కొంచబోయిండ్రు" అంటూ పాల సాయబు కన్పించే సరికి ఉలిక్కిపడుతూ లేచి నిల్చున్నాడు సత్తెన్న.

వెంటనే సత్తెన్న కుటుంబమంతా ఆలగోడు, బాలగోడుగా ఏడ్చుకుంటూ మానుకోట బాటపట్టారు.

సత్తెన్న అల్లుడు బాగై ఇంటికొచ్చే సరికి పటేలు దగ్గర కొత్తగా మళ్లీ ఓ ఏడు వేలు అప్పు అయ్యింది.

పనికి రాకుండా అయిన పాత సైకిల్ పాత ఇనుపకొట్టుకు పోవడానికా అన్నట్టు ఇంటిముందు ఓ మూలకు కుప్పబడిఉంది.

■



October 2009_30_09_2009_4.pmd 7 10/1/2002, 8:42 PM

## కవిత

# భేతాళ ప్రశ్న

**సిరికి స్వామినాయుడు**

వాడెవడో గానీ...
చిరుగుల దేహం చింపిరిజుట్టు
బతుకును మోస్తున్నట్టు
భుజం మీద వాడెత్తు గోనెసంచీ
పంటపొలంలో నేలేరుకున్నట్టు
కరెన్సీకట్టలు మింగిన కొండచిలువరోడ్డు మీద
చిత్తుకాగితాలేరుకుంటూ– వాడు
చూస్తుంటే... శవాన్ని భుజాన మోస్తూ సాగే
పట్టు వదలని విక్రమార్కుడిలాగున్నాడు!

పేదల కన్నీళ్ళు తాగి
తెగబలసిన అంత మహానగరమూ
వాడి చిట్టిపాదాలకు దాసోహమంటుంది
బతుకాకాశం మీద
పసిరెక్కలతో కొట్టుకుంటున్న పిట్టపిల్లై– వాడు
అంతటి ఎండలో ఓ చెమటబొట్టై రాలిపోతాడు
అక్షరాల ఒడికి దూరమై... వాడు
అల్లంతదూరం నుంచే– చదువుల తోటలో ఎగిరే
సీతాకోకచిలుకల్ని చూస్తాడు
గోరుముద్దలు కుడిపే తల్లుల్ని చూస్తాడు
కొసరి ముద్దాడే తండ్రుల్ని జూస్తాడు
తన తల్లెవరో... తండ్రెవరో...
క్షణకాలం చిప్పిల్లిన కన్నీరు
గుండె తీరాన్ని కోతపెడుతుంది
దిగులు దుమ్ము దులిపేసుకొని
బతుకునొక తాటిబురికిని జేసి తన్నుకుపోతూ
పోగొట్టుకుంటున్న బాల్యాన్ని వెతుక్కుంటూ పోతాడా...
వెనకాల ఓ కుక్కపిల్ల ఆక్రందన
అనంత భూగోళం వేసే ఆకలికేకలా!
పట్నం కుళాయి కార్చే కన్నీరు తాగి
ఓ రెస్టారెంట్ చెత్తకుండీని ఒక విస్తరిజేసి
కుక్కపిల్లతో కలసి కడుపునింపుకుంటాడు!

ఋతువులన్నీ శిశిరమే అయినపుడు
వాడి బతుకులో కలలేముంటాయి!
వాకిట్లో ముగ్గు మీద రాలిపడ్డ చినుకులా
చెరిగిపోయిన జీవితానికేమంత ఆశలుంటాయి?
వాడ్ని మీటితే– తెగి మూగవోయిన తీగచప్పుడు
నులివెచ్చని స్పర్శ తగిలితే చాలు– వాడు
మంచుకొండై కరగిపోతాడు
సమాజ పద్మవ్యూహాన్ని ఛేదిస్తూ
అలుపెరుగని పోరాటం చేస్తూనే ఉంటాడు
బతుకుమెడలో గొలుసుకట్టి లాక్కుపోతుంటాడు!

అయినా... ఆకలి మహా చెడ్డది
కోరలు చాచి వాడ్ని కాల్చుకు తింటుంది
తెగింపో... తెంపరితనమో– మొలకెత్తుతుంది

# చందమామరావే....

**ఈతకోట సుబ్బారావు**

ఇక్కడ రికాణాలేదు
చందమామలో జలశోధన
కోణంగిలాంటి కాళ్లతో
మెలికలు తిరిగిన మైతాల్పుతో
ఫ్లోరైడ్ వాసనేస్తున్న రక్తం
నేలపైన నెగటివ్ మనిషి
నెర్రెలు బారిన చవిటి పర్రలు
నేల చరిత్రకు చిరునామా
నేలనేలంతా నెగళ్ల సెగై పోతుంటే
చంద్రకాంత శిలలపై పరిశోధన
కొత్తకొత్తగా చెదపురుగుల పుట్టగా
రోగాల గుట్టలు పెరుగుతున్న వేళ
చికిత్సల పరామర్శలేదు
చంద్రధూళిపై జిజ్ఞాస సరే
పిడికెడు మట్టిని పిండి
కన్నీటి కారణాల్ని ఆరాతియ్
దోసెడు నీళ్ల తోడుకొని
కాలుష్య రసాయనాల్ని వేరుచెయ్
ఇదిగో మా వూళ్లో తప్పుతున్న
రాతికొండ జాతి చెప్పకుండా
రెక్కలు కట్టుకొని ఎగిరిపోతేయెలా?
మనిషిలో డబ్బు జబ్బు తగ్గకముందే
చంద్రలోకమెళ్ళి వస్తేనేం?
నేలపైన మానసిక వికలాంగులకి
విరుగుడు మందు కనిపెట్టకుండానే
శశిలో జీవరాశిని శోధించి
భూమికేం ఉపకారం చేస్తావ్?
పేగుతాడుకి వూయలకట్టి వూరేగే
పసిగుడ్డు గుండెలో బెజ్జానికి
వైద్యం కనుగొనడం మానేసి
జాబిల్లిపైన ప్రేమగీతం పాడతావా?
దాహాలెన్ని రకాలో తెలీదు కాని
కల్తీ విత్తులకి ఆత్మహత్యలదాహం
బోరింగ్ చావులకి పసిపిల్లల దాహం
భూకంపాలకి కట్టినిళ్ల దాహం
తూరుపు తుఫానులకి మాత్రం
మత్స్యకారుల తూలిపడవల దాహం
దాహాలదారుణాల కథ తేల్చకుండానే
మీకు గ్రహాల పరిగ్రహాల దాహం
ఇంట్లో ఉట్టికూడ కట్టలేదు
నువ్వేమో ఆకాశానికి పాకేశావ్
నేలపైన కూసింతైనా మక్కువలేని
నా ప్రియమైన శాస్త్రవేత్తా!
గూడంతా అమాస చేసుకున్న జక్కవకి
జాబిల్లికేసి చూసే హక్కెక్కడిది?



October 2009_30_09_2009_4.pmd 8 10/1/2002, 8:42 PM

**పరిశీలన**

# కొండేపూడి నిర్మల సాహితీ సౌరభాలు

**ఆచార్య డి.కృష్ణకుమారి**



***స్త్రీ స్పర్శ సుఖాన్ని పూర్వ కవులు 'హరిచందన చిగుళ్లరసం, చంద్రకిరణాల కొనలరసం పూసినట్లుగా, శరీరం బయటా లోపలా ప్రతిధాతువును అమృతంతో మైపూత పూసినట్లుగా, దుఃఖంతో ఉడికిపోయిన ప్రాణానికి హాయిగొల్పినట్లుగా వర్ణించారు. స్త్రీ వాద రచయిత్రులు/కవయిత్రులు పురుష స్పర్శను క్షణ క్షణ సంఘర్షణాత్మక శత్రు స్పర్శగా భావించేసినంతగా 'స్పర్శానురాగాన్ని' ఆలపించేయలేకపోయారు. ఒకింత ఓదార్పు స్పర్శను మాత్రం ఆకాంక్షించారు.***

జెండర్, మాతృత్వం, పితృస్వామ్యం, లైంగికత అనే ప్రధానమైన స్త్రీ సమస్యల చుట్టూ సాలెగూడులా అల్లుకున్న ప్రతి సూక్ష్మాంశాన్ని అనుసంధానించుకుంటూ స్త్రీవాద సాహిత్యం కాలంతోపాటు ఎదుగుతూ వచ్చింది. స్త్రీ ఎదుగుతున్నంత మేర మనిషిగా గుర్తించాలనే ధోరణిని పెంచి పోషించింది. ఈ స్త్రీ స్పృహే స్త్రీవాద రచయిత్రులందరికీ ప్రధాన వస్తువు అయినా నవ్యంగా పదునుగా వాస్తవికంగా శక్తిమంతంగా విన్యసింపచేయడంలోనే ఆ రచయిత ప్రత్యేకత గుర్తింపుకు వస్తుంది.

ఉదాహరణకు ఒకటిరెంటిని గూర్చి ఆలోచించి చూస్తే స్త్రీ స్పర్శ సుఖాన్ని పూర్వ కవులు 'హరిచందన చిగుళ్లరసం, చంద్రకిరణాల కొనలరసం పూసినట్లుగా, శరీరం బయటా లోపలా ప్రతిధాతువును అమృతంతో మైపూత పూసినట్లుగా, దుఃఖంతో ఉడికిపోయిన ప్రాణానికి హాయిగొల్పినట్లుగా వర్ణించారు. స్త్రీ వాద రచయిత్రులు/కవయిత్రులు పురుష స్పర్శను క్షణ క్షణ సంఘర్షణాత్మక శత్రు స్పర్శగా భావించేసినంతగా 'స్పర్శానురాగాన్ని' ఆలపింపచేయలేకపోయారు. ఒకింత ఓదార్పు స్పర్శను మాత్రం ఆకాంక్షించారు.

పెద్ద మనిషి అవడాన్ని ఒక స్త్రీవాద కవయిత్రి 'రహస్తంత్రి' అని అంతరార్థంగా నిర్వచిస్తే మరొకరు 'రుధిరమందారం'గా భావించేవారు. ఇంకొకరు 'ఎరుపుతోనే సంపూర్ణ స్త్రీ'గా అన్పింపచేశారు.

ఈ రెంటిని బట్టి వస్తువును నవ్యంగా కన్పింపచేయడంలోనే ఉంటుంది కవి కల్పనాశక్తి. అంతా అని అది వారి వారి అనుభూతిని బట్టి, అప్పటి చిత్తస్థాయిని బట్టి, కాలాన్ని బట్టి సందర్భాన్ని బట్టి ధ్యేయాన్ని బట్టి విభిన్నంగా అభివ్యక్తం అవుతుంది అని స్పష్టం అవుతుంది.

**కవయిత్రి సాహితీ ప్రపంచం**

స్త్రీ వాద దృక్పథాన్ని ఎప్పటికప్పుడూ పటిష్ట పరుచుకుంటున్న రచయిత్రుల్లో 'కొండేపూడి నిర్మల' ఒకరు. వస్తు వైవిధ్యంలో, వ్యక్తీకరణ నైపుణ్యంలో, భాషా ప్రయోగంలో ఈమె వంతు పాత్ర ఈమెదే.

'కుటుంబం, రాజ్యం, చరిత్ర ఎన్నో విధాలుగా స్త్రీలను ఎమోషనల్ బ్లాక్ మెయిల్ చేసి అణచివేస్తూ అణచివేత ప్రయత్నాలే ఆత్మీయ సంబంధాలుగా భ్రమపెట్టే వాటిని బద్దలు కొట్టడం' తన బాధ్యత అనుకునే రచయిత ఈమె.

'ఎందరికి కష్టం అన్పించినా నమ్మిన మంచిని పచ్చి నిజాల్ని తెల్పే తత్వం' ఈమెది. ఎపుడూ 'మనసులోపల ముసురుపట్టి ఉండే ఈమె కవితా ప్రపంచమే వేరు. ఇంటర్మీడియట్ చదువుకునే రోజులనాటి నుంచే తన భావావేశాన్ని (సంబరం/దుఃఖం) కవిత్వీకరించుకోవడం ఈమె మనస్సుకు నచ్చిన మార్గం.

పుస్తకపఠనం, వడ్డాది పాపయ్య బొమ్మల నమూనా చిత్రీకరణ, నటన ఆనాటి అభిరుచులు. సెటైర్స్ రాయడం, సాహిత్య విమర్శలు, వ్యాసాలు రాయడం, సభలూ సమావేశాల్లో పాల్గొనడం ఈనాటి అభిరుచులు. 'వాళ్ల ఆరుగురు' అనే నాటికలో రాజేశ్వరి పాత్రధారి ఈమె.

ఈమె డిగ్రీ చదువుకుంటూనే ఆలిండియా రేడియోలోనూ, ఆంధ్రజ్యోతిలోనూ పనిచెయ్యడం ప్రారంభించారు.



October 2009_30_09_2009_4.pmd 9 10/1/2002, 8:42 PM

1972ల నాటి నుంచి అంటే, 20వ ఏట నుంచే ఈమె కవి. ఈమె మొదటి కథ 'మువ్వ మూగబోయింది'. ఇది ఆకాశవాణిలో ముద్రితం. జయశ్రీలో ఈమె మొదటి కవిత అచ్చుపండిందట.

వయస్సువారీ అనుభావాల్ని బట్టి భావపరంపరల వికాసదశలు ఈమె రచనల్లో ప్రతిబింబిస్తుంటాయి. పత్రికా విలేఖరి వృత్తి, 'తొలినాళ్ల నాటి దేశభక్తి, స్నేహం, పేదరికం' అనే అంశాలగిరిని దాటించి 'ఇంకేవో ఆలోచనలబరిలోకి దింపింది.

అవసరమైన విషయాల్లో 'క్రమశిక్షణా రాహిత్యం, నిర్బంధం మీద ఉండే విపరీతమైన ఆసక్తి, మొండితనం' ఆమెను కవయిత్రిగా మలచిన అంశాలు. తనను తాను ఎప్పటికప్పుడు పరిశీలించుకుంటూ అంచెలంచెలుగా స్త్రీ మానసిక శారీరక అనుభూతుల్ని పుష్టిమంతంగా కవిత్వీకరించుకుంటూ ఎదిగిన రచయిత్రి ఈమె. ఈ దశలో 'వాక్యానికి చేసే ముస్తాబును తగ్గించి వస్తుగాఢత, వాస్తవికత మీద చూపు' నిలిపి కవితానిర్మాణ శక్తిని కూడదీసుకున్న కవయిత్రి కొండేపూడి నిర్మల.

ఈ ప్రాపంచిక వెతలకూ కతలకూ ఆడమగా ప్రసక్తికన్నా 'కన్నీరు నిజం నిట్టూర్పు నిజం' అనే దాని మీదే ఆమె గురి అంతా.

సామాజిక కుటుంబ సంబంధితాంశాల సూక్ష్మ పరిశీలనం, చుట్టూ జరిగే సంఘటనల పర్యవేక్షణలతో స్త్రీగా తన స్పందనను కాలానుసారంగా మలచుకుంది. సజీవమైన నేపథ్యాలను సాహిత్యరూపం పొందించడంలో నేర్పరితనం సాధించింది. అందువల్లే ఈమె సాహిత్యంలో రచయితకూ రచనకూ ఆత్మీయతానుబంధం ఉన్నట్లన్పిస్తుంది.

స్త్రీ అణచివేత, హక్కులు, పరాధీనత, హింస అనే విషయాలు అటుంచి ప్రపంచీకరణ విషవలయంలో చిక్కుకుపోతున్న మహిళను చైతన్యపరచవలసిన అవసరాన్ని ఇతర ప్రజా సమస్యల్ని గుర్తించిన కవయిత్రుల్లో ఈమె ఒకరు. వృత్తి వ్యావృత్తి ఒకటే అవడం వల్ల వారం వారం 'ఆత్మ లేని అక్షరాలు రాయడం' ఆమెకు రుచించని విషయం. (అడపాదడపా భాషా ప్రయోగాల్లో వీటి క్రీనీడలు ప్రసరించకపోలేదు.)

**స్త్రీ అణచివేత, హక్కులు, పరాధీనత, హింస అనే విషయాలు అటుంచి ప్రపంచీకరణ విషవలయంలో చిక్కుకుపోతున్న మహిళను చైతన్యపరచవలసిన అవసరాన్ని ఇతర ప్రజా సమస్యల్ని గుర్తించిన కవయిత్రుల్లో ఈమె ఒకరు. వృత్తి వ్యావృత్తి ఒకటే అవడం వల్ల వారం వారం 'ఆత్మ లేని అక్షరాలు రాయడం' ఆమెకు రుచించని విషయం.**

తెలుగు యూనివర్శిటీ వారి అంబేద్కర్ ట్రాన్స్‌లేటింగ్ టీములోనూ సార్వత్రిక విశ్వవిద్యాలయం వారి ఆడియో లెసన్స్ కార్యక్రమంలోనూ, ఇటీవలి ఎఫ్‌ఎమ్ రేడియో కార్యక్రమాలలోనూ ఈమె భాగస్వామ్యం ఉంది.

ఇంగ్లీషు, తమిళం, మలయాళ భాషల్లోకి అనువదించిన ఈమె కవితలు 'క్వెస్ట్ ఇండియన్ లిటరేచర్'లో ప్రచురితాలు.

ఈమె కవితల్లో 'ఓణీ' అనే గేయం 'విప్లవ ఓణీ' అనే ఫక్తు పారడీ పొందింది. 'నరకంలో నాలుగు నిమిషాలు' మొద్దురాచ్చిప్ప అనే కథలు ప్రత్యేక బహుమతి పొందిన కథలు.

(1) ఫ్రీవర్సుఫ్రంటు అవార్డు (1989), కుమారన్ ఆశన్ అవార్డు (1990)లు ఈమె సాహితీ జ్ఞాపికలు.

**నిర్మాణ చాతురి**

ఈమె రచనలు ఈమె వ్యక్తిత్వ గీతికలు. కవిత్వం కథా ప్రక్రియల్లో ఈమె భావజాలం స్పష్టం. ఇప్పటికి సందిగ్ధ సంధ్య, నడిచేగాయాలు, బాధాశప్తనది, మల్టీనేషనల్ ముద్దు అనే కవితా సంపుటాల్ని శత్రుస్పర్శ అనే కథా సంపుటి (అమ్మానాన్నలకు అంకితం)ని, ఈమె వెలువరించారు వీటిల్లో చాలావరకు వివిధ వార మాస పత్రికల్లో అచ్చయినవే. పత్రికల్లో ఇపుడు అచ్చుపడినవి. పడ్తున్నవి మరెన్నో. 1985లకు ముందు రచనలు శిశుప్రాయమైన అముద్రితాలు మరికొన్ని.

ఈమె రచనల్లో ప్రేమ వస్తువు ప్రధానంగా ఉండదు. ప్రేమలో పిరికితనం, హింస, పరాయీకరణ ఉంటుందని ఈమె గట్టి నమ్మకం. ఒక విధంగా చెప్పాలంటే ఈమెకు ప్రేమంటే హడలు. ప్రేమంటే నలుపా తెలుపా? అనేది ఈమెకు చిక్కువీడని ప్రశ్న. ప్రేమికురాలైన స్త్రీకి ప్రతిదశలోను యుద్ధమే జీవితమవుతుందని ఈమె భావన.

(2) కవికి ప్రాణపదమైంది, చెప్పుకోవలసింది, కవిదాచుకునే చోటుదొరికిపోయే చోటు కవిత్వంకాక మరేముంటుంది. అనే తలపులు 'కవిత్వమే ఈమె సర్వస్వం' అని చాటుతున్నాయి. ఈమె భావ సర్వస్వ సారస్యపేటిక ఈ వ్యాసం.

**సంకలనాల నామకరణం**

ఈమె రచనా సంపుటులు, ఈ సంపుటాల్లోని కవితల/ కథల శీర్షికలు కవయిత్రి ఆత్మ సూచకాలు. ఈ నామకరణలు 'నామకార్థంగా' గాక అలవోకగా సార్థకంగా అతికినట్లుంటాయి. సామాన్యంగా కేంద్రీకృత లక్ష్యాంశానికి పతాక వంటి శీర్షికను సంపుటి శీర్షికగా ఉంచే ప్రాచీన సంప్రదాయాన్ని ఈమె పాటించారు. ఈ శీర్షికల మూల ఉద్దేశాలు ఎక్కడో అక్కడ పొదిగి ఉంటుంటాయి.

**సందిగ్ధ సంధ్య (1988)**

'వెలుగు చాలనిది చీకటి చేరనిది' సందిగ్ధ సంధ్య. అప్పటి కవయిత్రి ఎదిగీ ఎదగని మానసిక అస్థిరతకు, సామాజికంగా నిరాశామయంగా ఉన్న సందిగ్ధ దశలో సంధ్యాకాలపు కాంతిరేఖగా ప్రసరించిన స్త్రీవాద సాహిత్యానికి (1980లో స్త్రీ పురుష సంబంధాలను గూర్చిన ఆలోచనలు అప్పుడప్పుడే నలిబిలి చేస్తున్న చారిత్రక పరిణామ దశ) ప్రతీకగా ఈ శీర్షికను నిర్వచించుకోవచ్చు.

**నడిచేగాయాలు (1990)**

ఈమె ఆ బాల్యం నుంచి పరిశీలనలోకి వచ్చిన జీవన నేపథ్యాలన్నీ మనసును గాయపరిచినవే. గాయానికి గాయం కూడిక అవుతూ ఆమె జీవితాన్ని గట్టి పరిచినవే గాని తీసివేతలు ఏమాత్రం లేనివి. వీటి సంఖ్యాబలమే ఈ కవయిత్రిని పెద్ద చేసింది.

బతుకు సర్వం గాయం అయి ఆఖరికి మనిషేగాయంగా మారే స్త్రీలకు ప్రతీక 'నడిచేగాయాలు'. కామక్రిమిరూపంలో వాలి మనిషిని తినే యుద్ధానికి నడుచుకుంటూ వచ్చే గాయాలు ఇవి. గాయపడే మనిషి



October 2009_30_09_2009_4.pmd 10 10/1/2002, 8:42 PM

స్త్రీ. ఈ గాయం నవ్వుతుంది. నగలు పెట్టుకుంటుంది. గాయపరిచే మనిషి పశుప్రాయుడు.

**బాధాశప్తనది (1994)**

గాధాసప్తశతిని స్మరణకు తెచ్చే శీర్షిక ఇది. బాధలు పడీ నిందలపాలవడం స్త్రీకి నిత్యంగా సాగే సజీవమైన క్రియ. బాధల నిందలమయమైన స్త్రీ బతుకు ఎపుడూ ప్రవహించే నది వంటిది అని భావం. 'అంగాలు మారనంత వరకూ ఏ ఇంటి ఇల్లాలికైనా ఆత్మ కథల సారమొక్కటే' అనేది దీని ప్రపంచార్థం. 'బొస్నియో హెర్జిగోవినాలోని ముస్లిం క్రోషియన్ జాతుల్ని నిర్మూలించి తమ ఆధిపత్యం కోసం సెర్బులు స్త్రీలను మాతృమూర్తులను చేసిన చర్య' ఈ శీర్షికకు మూలం. బహిరంగ అకృత్యాలకు సాక్ష్యంగా బోస్నియోలోని రిజ్వినోలినా 'బాధాశప్తనది' అయింది.

**మల్టీ నేషనల్ ముద్దు (2001)**

వస్తువుల్నే రక్తమాంసాలు రాగద్వేషాలు ఉన్న ఆత్మీయులుగా మభ్యపెట్టుకోవడం సృజనాత్మకంగా నేర్పుతున్నాయి బహుళజాతి సంస్థలు. ఇవి జీవ భౌతిక రుచుల్ని దోచేస్తున్నాయి. ముద్దులాంటి తాజ్ అనుభూతిని మల్టీనేషనల్ రాకెట్‌ను హైజాక్ చేస్తూ సాలోచనతో ఉంచిన శీర్షిక ఇది. ఈ వ్యవస్థ 'అందాల వ్యాపారం కోసం అందవిహీనతకూ, మన అనే సంస్కార విహీనతకూ బానిస అవుతుంది. ఈ సామాజిక స్పృహే ఈ సంకలనం కుదురు.


***తొలినాళ్లలో స్త్రీ జీవితం ఏమిటో ఎందుకో అర్థంగాక నిరాశామయంగా ఉండేది.***

***నిండుసున్నలా నన్ను నేనే***
***చుట్టుకున్న మగతలో***
***సగం కాలిన శవంలాంటి జీవితం - అనేది అప్పటి మనోభావన.***


**శత్రుస్పర్శ (1998) (కథల సంపుటి)**

స్త్రీ బ్రతుకు ప్రతిపాదనలోని ప్రతి చేదు అనుభవమూ ఒక శత్రుస్పర్శే. తన శరీరాన్ని మనస్సుని స్పర్శించి హింసించే ప్రతి చర్య ప్రతి మాటా ప్రతి భావం స్త్రీకి శత్రుస్పర్శే. దీనికి మొహమే ఉండనవసరం లేదు. భాష-భావజాలం వాటి వల్ల పాడైన బతుకులు చాలు'. సూక్ష్మాతి సూక్ష్మాంశంలోనూ చైతన్యం రగుల్కొల్పే స్త్రీ స్పృహలసారం ఈ శత్రుస్పర్శ కథా సంపుటి.

వస్తుపరంగా వీటి శీర్షికల తీరు ఇలా ఉంటే భాషాపరంగా వాటిల్లోని శీర్షికలు సంస్కృతాంధ్ర భాషా మిశ్రితమై పద వాక్య రూపాల్లో ఈనాటి భాషా ప్రయోగ వైవిధ్యానికి ప్రతీకలుగా ఉన్నాయి.

1. సంస్కృతం : సందిగ్ధ సంధ్య, బాధాశప్తనది, రహస్తంత్రి, ఉష్ట్ర పక్షి, దీర్ఘ సుమంగళీభవ మొదలగునవి.

2. తెలుగు : నడిచేగాయాలు, తెల్లారకట్టకివతల, కాటిసుంకం, పంటిచిగువున, జాడ, కప్పల తక్కెడ, అతని భార్య, మొద్దురాచ్చిప్ప, ముత్యమంత ముద్దు, ఎద్దుపుండు, పెద్దమ్మాయి, మాటల బండి మొదలగునవి.

3. ఆంగ్లం : సీజనల్‌లవ్, రన్నింగ్ ఎపిసోడ్, రిగ్గింగ్, ఎక్స్ట్రా, డూప్, మదర్ సీరియస్, ఫీనిక్స్ హోమ్‌సిక్, రికార్డింగ్ డాన్సరు, లేడీస్ ఫింగర్స్, లేబర్ రూమ్, డీహ్యూమనైజేషన్ ప్రాజెక్టు మొద॥

4. హిందీ : మేరా భారత్ మహాన్.

5. మిశ్రమం : మాట్లాడు ప్లీజ్, సర్కస్ పిల్ల, మల్టీనేషనల్ ముద్దు, మావాడు నైబర్ ఎన్వీ కానంటున్నాడు ! జీవితం వర్సెస్ ట్రూప్ బజార్ మొదలగునవి.

విషయం, భాష, శైలితో నిమిత్తం లేకుండా పేరు చూడంగానే పూర్వకవిని గుర్తుకు తెప్పించే అనుకరణ శీర్షికలు మరికొన్ని.

1. పురుగులందున పుణ్యపురుగులు వేరయా - (పురుషులందున పుణ్య పురుషులు వేరయా)

2. శుష్క విలాపం - (పుష్పవిలాపం) 3. ఈ బాధకి వాచకం లేదు - (ఐదవ వాచకం)

ఎండ్లూరి సుధాకర్). 4. తెల్లంచు జరీచీర-(జరీచీర రావిశాస్త్రి కథకు కొనసాగింపు కథ)

సమకాలీన సామాజిక సంఘటనలకు పరిమితమైన రచనల శీర్షికలు నిరసన ప్రధానమైనవీ స్ఫూర్తిమంతమైనవీ మరికొన్ని.

1. మెహందీ పిల్లల్ని బడిలో చేర్చేటప్పుడు 'తండ్రి పేరు అడిగినందుకు నిరసన తెలిపే కవిత పేరు 'నాన్నవి కొనాలి కిలో ఎంత?'

2. ఇరవై ఏళ్ల స్త్రీవాద సాహిత్యం అంశంగా తానా సభలో ఓ తెలుగు కవయిత్రి చదివిన సిద్ధాంత వ్యాసాన్ని నిరసిస్తూ రాసిన కవిత 'రిగ్గింగ్'.

3. చలం ఆరు స్త్రీ పాత్రలు ఆధారంగా రూపొందించిన రూపకంలోని రాజేశ్వరి పాత్రను నటించిన స్ఫూర్తితో వెలువడిన కవిత-'లేడీస్ ఫింగర్స్'

4. లక్ష్మీ ప్రసూన వంటి ఎనభై మంది యువతలు కథల స్ఫూర్తి కవిత 'పంటిబిగువన....మొ॥'.

**భావమయ ప్రపంచం :**

చిన్ననాటి నుండి ఈమెను తాకిన గాయాలు మనస్సు చుట్టూ ఆవరించి కలవరపెట్టినపుడు ఆమెకు తోడూ నీడా అయింది సాహితీ వ్యాసంగమే. తొలినాళ్లలో స్త్రీ జీవితం ఏమిటో ఎందుకో అర్థంగాక నిరాశామయంగా ఉండేది.

నిండుసున్నలా నన్ను నేనే
చుట్టుకున్న మగతలో
సగం కాలిన శవంలాంటి జీవితం - అనేది అప్పటి మనోభావన.

లోకాన్ని దర్శించిన కొద్దీ 'యుద్ధాలెప్పుడు రాజ్యాధిపత్యం కోసమే కాదు ఉనికి కోసం ఊపిరి పరిమళం కోసం కూడా' జరుగుతాయని తెలియవచ్చింది. ఆ ఉనికి కోసం పొడకులాడడమే ఈమె తన సాహిత్య గమ్యంగా భావించింది. దీని కేంద్రీకృత వస్తువు స్త్రీ శరీరమే.

తనలో రగిలిన చైతన్య భావాల స్పందనకు
కలల కాగితప్పడవలా తేలుతున్న వేళ
నాకెవరిచ్చారీ మెలకువ............... అనే ప్రశ్న తలెత్తి తన్ను తాను చైతన్య పరుచుకుంది. అందుకే స్త్రీ తనకు తానుగా తెలుసుకునే భావ సముదాయాలు అనుభవించే భావ సంకేతాలు ఈమె సాహిత్యపు ముఖ్యవస్తువులయ్యాయి. వస్తువును 'ఒక వరుసలో ప్రతి పాదించడంలో చేయి తిరిగిన కవయిత్రి ఈమె.




October 2009_30_09_2009_4.pmd 11 10/1/2002, 8:42 PM

సాంఘిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లోని స్త్రీ మూగ వేదనను ఒత్తిడిని కసిని నిస్సంకోచంగా వెల్లడించడం ఈమె రచనా నియమం. వీటి అనుభూతి వ్యక్తీకరణలో సొంత స్వరం విన్పిస్తుంటుంది. స్త్రీ చూపును అటుగాక ఇటూ మళ్లింపచేస్తుంది. ఈ భావనల్లో కొన్ని.

స్త్రీ జీవితంలో పెళ్లి చూపుల తతంగం మయసభలాంటిది. సంస్కారం లేని వ్యక్తుల రాకపోకలు, ఆపై వద్దన్నా విన్పించే మాటల హింసలు ఆమెకు మాత్రం 'చివరంటా చావని నిరాశమీద నిరాశతో వచ్చిన ప్రతి అతిథి కోసం ఎదురుచూస్తూ' ఇంటి బజారులో ఒక అమ్ముడు పోని సరుకులా జీవనం కొనసాగించే స్త్రీ స్థితి ఒక రకం. ఆకాస్త పెళ్లయి తల్లితనం పొందిన స్త్రీ స్థితి మరో రకం. తల్లితనంలోని లొసుగులకు విసిగిపోయి.

'కనడంలో స్వేచ్ఛలేని దాన్ని
కంటున్న లింగాన్ని నిర్ధారించలేని దాన్ని
కనాల్సిన నరకాల
సంఖ్యను నిర్ణయించలేనిదాన్ని'

అంటూ తన నిస్సహాయ శాపాన్ని తలపోసుకుంటుంది. తన ధిక్కారాన్ని వ్యంగ్యంగా బయలు పరచడంలోని స్త్రీత్వ భావం ఒక్క క్షణమైనా ఆలోచింపచేస్తే శక్తినిస్తుంది.

'మాతృమూర్తులకివ్వదగిన
నోబుల్ బహుమతులేవైనా
ఉంటే
మా ప్రాథమిక హక్కుల్ని
పరిహసించే
తల్లిదండ్రులకివ్వండి......

అంటూ అధిక్షేపిస్తుంది.

కడుపున కాస్తున్న ఆడ శిశువును కననివ్వని సమాజంలో ఆడపిల్లగానే పుట్టితన జీవిత విధానాన్ని ఖడ్గచాలనంతో మలుచుకుంటానని 'యుద్ధ శిశువు'గా ప్రకటిస్తుంది. పితృస్వామ్యంలోని కుటుంబ హింసా నివారణకు విప్లవ స్ఫూర్తే పరిష్కారంగా భావిస్తూ తన ఊపిరి కోసం శిశుప్రాయం నుంచే 'యుద్ధం' సహజ లక్షణం కావాలనడంలోని భావగాఢతను గమనింపచేస్తుంది.

'స్త్రీ జీవ భౌతిక యాతనల్లోని విసర్జన క్రియ రహస్యదుఃఖపు మడతల్ని విప్పడంలో ఏమాత్రం తటపటాయింపులేని సూటితనం ఈమెది.

"అవసరానికి ముందు మధ్య మందిరాలుగాను
ఆత్మజ్ఞానం పొడుచుకొచ్చినప్పుడల్లా తోలుబొక్కలుగాను వ్యాఖ్యానించబడ్డ మా నగ్న దేహాలు లఘుశంకల్ని దీర్ఘశంకల్ని నియంత్రించడం కోసం కూడా తలకిందులుగా తపస్సు చేస్తాయని ఏ శరీరశాస్త్రం చెబుతుంది".

యూరోపియన్ శానిటరీ వేర్స్‌కు దడిసి నీళ్లు తాగితే మూత్రం వస్తుందనే పాపభీతితో దాహపు గొంతుకలు మోసుక తిరిగే నాజాతి నిట్టూర్పు ఎన్ని తరాల విధ్వంసం తరువాత రికార్డవుతుంది–

(వలసల రాజ్యం)

స్త్రీని అవసరం కొద్దీ చూసే తీరు, అతి చిన్న సమస్యగా అన్పించేవి కల్గించే అస్వస్థతా విధ్వంసాన్ని గుర్తించేలా చెప్పిన ఒక భావం ఇది.

అత్యాధునిక సమాజంలోని స్త్రీ పురుష సంబంధాలను 'సీజనల్ లవ్'లో ప్రత్యక్షీకరింప చేసింది. 'మూడేళ్ల సీజను కొకలెక్కన వచ్చీ పోయే పరాధీనం పెళ్లికొడుకు' వలసరాగ బంధాలను చూపి చావిడిలోని బక్కటెద్దు చాటుచాటుగా నవ్వుతుందిట. అది 'మనకంటే చాలానయం' ప్రేమయినా పేడయినా స్వేచ్ఛామాధుర్యంతో ఇవ్వగల్గుతుంది' అంటూ సహజమైన స్వేచ్ఛకు దూరం అయిన తీరును సూచిస్తుంది.

స్త్రీ సమస్యలనే కాదు సామాన్యుల జీవితపుటంచుల్ని తాకిన జీవన వైనాలూ ఈమె కవితల్లో చోటుచేసుకున్నాయి.

మానవీయ విలువలు నేర్పే సామాజిక శాస్త్రాల వెనుకబాటు తనాన్ని నిరసిస్తూ పాఠాలదోవ పాఠాలదే పరీక్షల దోవ పరీక్షలదే అనే అత్యంతాధునిక భావాన్ని నింపుకున్న కవిత 'మీవాడు ఎన్వీ కానంటున్నాడా'..... అనేది.

మూడు వందల అరవై
రోజుల పాటు
ముక్కుపట్టిన పాఠాలన్నీ
పరీక్షల మబ్బు ముసిరేదాకా ఆపి
జిర్రుమంటూ పేపరు
మీద మాత్రమే చీదగల నేర్పరి కంటే
ముందే చీకేసిన
వాడెంత అజ్ఞానో దేశ
ద్రోహో...............

ఎమ్‌సెట్, లాసెట్, కేసెట్‌లనే పరీక్షల మోతలో మిగిలేది మిత్రులు కాదు ప్రత్యర్థులే అనేది దీని ప్రబోధం.

**పాతాకొత్తా**

పాతలో కొత్త భావాల్ని పొందికగా ఒదిగింపచేసి ఆనాటి ఈనాటి స్త్రీ స్థితిని కళ్లకు కట్టిస్తుంది. కాకపోతే 'వేదిక తేడా, ప్రకటన తేడా' ఉంటుంది. ఈమె ప్రాచీన సాహిత్యాభినివేశనానికివి దర్పణాలు.

చెట్లు వస్త్రాలనిస్తాయన్నది పురాణాల్లోని మాట. ఈనాటి వివస్త్రత్వానికి విస్తుబోతూ 'విత్తుకున్నది మొదలు బూడిదయ్యే వరకు, ప్రత్తిచెట్టు ప్రసవించి ఇచ్చిన వస్త్రాలెటుపోతున్నాయో' అంటూ సంశయిస్తూ నిరసిస్తుంది.

**పాతలో కొత్త భావాల్ని పొందికగా ఒదిగింపచేసి ఆనాటి ఈనాటి స్త్రీ స్థితిని కళ్లకు కట్టిస్తుంది. కాకపోతే 'వేదిక తేడా, ప్రకటన తేడా' ఉంటుంది. ఈమె ప్రాచీన సాహిత్యాభినివేశనానికివి దర్పణాలు.**

**చెట్లు వస్త్రాలనిస్తాయన్నది పురాణాల్లోని మాట. ఈనాటి వివస్త్రత్వానికి విస్తుబోతూ 'విత్తుకున్నది మొదలు బూడిదయ్యే వరకు, ప్రత్తిచెట్టు ప్రసవించి ఇచ్చిన వస్త్రాలెటుపోతున్నాయో' అంటూ సంశయిస్తూ నిరసిస్తుంది.**

చావులేని ఇంటి నుంచి ఆవాలు తెమ్మన్న గౌతముడి కథ మాదిరిదే స్త్రీల శీలం ప్రస్తావించని కవిత్వం తెమ్మనడం కూడా. ఆనాటి దేవకి కంసుడికి కన్న బిడ్డల్ని అర్పించడంలోని కంసుడి కుటిల నీతి వంటిదే ఈనాటి ఆధునిక దేవకీలు గర్భస్రావం పేరిట బిడ్డల్ని అర్పించడం, వెనకటి నీతి.

ప్రబంధాల్లోని ఇంతుల నాజూకు కన్నీళ్లను "గాలికీ తేమకీ తేమ తగ్గినప్పుడల్లా పద్యాల్లో చల్లుకునే వారు. యాది లేదా బిడ్డా" అంటూ గుర్తు చేస్తుంది తులాభారం కట్టినపుడు ఏ స్త్రీ లింగమేనా
గడ్డిపోచతో సమానంగానే తూగుతుంది– అనేది ఒక అపూర్వం అయిన భావం.

*(ఈ వ్యాసం రెండవ భాగం వచ్చేనెల సంచికలో )*

■



October 2009_30_09_2009_4.pmd 12 10/1/2002, 8:42 PM

# రెక్కలు

**రఘుశ్రీ**

తలగడకి
తేనెపూసి పడుకుంటే
తీయని
కలలొస్తాయా?

తీపి తలపులే
కలలని తెలుసుకో!

లేదన్న
బెంగ
ఉందన్న
మిడిసిపాటు–

లేనివాడే
స్థితప్రజ్ఞుడు!



పచ్చని చెట్లు
ప్రాణ వాయువునిస్తాయి
ఎండి మోడైనా
చితిలో తోడొస్తాయి–

చెట్లే
'ప్రాణ'స్నేహితులు!

నగరంలో
మేడలెన్నో–గుడిసెలన్ని
ఓట్లు వేసేవారికి
నోట్లు మేసేవారికి–

స్మారక
చిహ్నంగా!

తాగేవాడికి
సమయానికి
'చుక్క'పడ్డా పడకున్నా
తత్తరబిత్తర–

జిహ్వాచాపల్యమూ
ఓ పాశమే!

స్కూల్ డ్రస్సు
ఇంట్లో వేసుకోరు
ఇంటి'లోదుస్తులు'
బడిలో వేసుకోరు–

క్రమ'శిక్షణ'?
క్రమ'శిక్షనా?!

గాలికి
కిటికీ రెక్కలు
ఎడాపెడా
కొట్టుకున్నాయి–

గుండె'ముక్కలాయె'
'అద్దానిది'!

నాలుగు చేతులెత్తి
నర్తించింది చార్మినార్
గాజుల గలగలలు
వినమని–కనమని–

అ'పూర్వ'శోభ
భాగ్య'నగ'రిది!

పబ్బులో
మనుషులే కాదు
బల్బులూ
మత్తులో జోగుతాయి–

వెలుగుకొద్దీ
బతుకులు!

---

# ఆశల మొక్క

**చల్లగాలి బాబూరావు**

*బువ్వ పెట్టిన చేతుల్ని*
*మచ్చిక చేసుకోవడమే మానవత్వం*
*మరిక్కడ తిన్న యింట్లోని వాసాల్ని*
*లెక్కించడమే కొందరి పంతం*
*ఒంటరితనం ఓర్పుతో ఏకమైతే*
*తుంటరితనం తంటాలు పడేటట్లు*
*తలను నరికినట్లుగా*
*నయవంచనతో నానాబాధలు*
*పెడుతుంది*

*జీవితం బలే వుమ్మడి సరుకైనట్లు*
*బ్రతుకు బజార్న అతుకుల బొంతవుతుంది*
*కాల విహంగం మీద*
*వేల కోరికలు పురివిప్పుకొంటూ*
*జీవిత భాండంలోకి జేరుతుంటాయి*
*నెరవేరిన కోరికలన్నీ*
*నేలగుండెల్లోకి విత్తనాలై పొదుచుకుపోతాయి*
*ఆశల మొక్కలు పచ్చపచ్చగా*
*భూమిని బ్రద్దలు చేసుకొంటూ*
*బయటకు వస్తాయి!*



---



# గాలికొదిలేసి పోయాడు

**గేరా**

## నానీలు

*దేశాల హద్దుల్ని*
*చెరిపేసి*
*నీకూ నాకూ మధ్య గీసేదే*
*ప్రపంచీకరణ*

*మాధ్యమాలు*
*నిజాల నిగ్గుతేల్చాలి*
*ఊదరెక్కువైతే*
*దేశం బొగ్గవుతుంది*

*నాయకుడొచ్చి*
*జాతీయజెండాను*
*లాగిపెట్టి, జైకొట్టి*
*గాలికొదిలేసి పోయాడు*

*సినిమా వచ్చి*
*తోలుబొమ్మలాట పోయింది*
*కళ వచ్చి*
*తోలు మిగిలింది!*

*మంటలార్పగల*
*బొగ్గుపులుసు వాయువే*
*భూమిని*
*భగభగ మండిస్తోంది!*



October 2009_30_09_2009_4.pmd 13 10/1/2002, 8:42 PM

## కవిత

# మా అవ్వ కొంగు



**సిద్దెంకి యాదగిరి**

బిడ్డలు తింటారని
ఆమె తినకుండా
కోరి కోరి తెచ్చిన
తినుబండారాల చిరుభాండాగారం
మా అవ్వ కొంగుముడి

ఎతల ప్రవాహపు సుడిలో
కొట్టుక పోతున్న ఎంతోమందిని
తనకొంగు ఆనకట్టతో
పొర్లుతున్న దుఃఖానికి
అడ్డుకట్టవేసి ఓదార్చుతూవుంటుంది!

కట్టెల మోపు పడికెల తట్ట
అయ్యకు సద్దులగంప
ఆర్నెళ్ళ పంట వరికట్టలు
పొలిచ్చే ఆవు పచ్చిగడ్డి మోపుకు
బిందె మీది బిందెడు నీళ్ళు
ఎన్నో మోస్తున్న అవ్వ బాద భరించక
మెత్తటి సుట్టబట్టైన కొంగు
అవ్వ తలమీద కురంబగడ్డైతది

ఎల్లి, ఎల్లని సంసారాన్ని తలుచుకొని
బెంగటిల్లి కోకిలరాగంలో
ఏడుపు మత్తడి దుంకి
బిగపట్టినా ఎగతట్టే ఎక్కిల్లను
అరచేతిల పరుసుకున్న కొంగు
అవ్వకు ఆత్మగల్ల సుట్టమైతది

ఆరాటం కొద్ది పనిజేస్తూ
తగినంత బలంలేని అవ్వకు
పిడిసుట్టు తానై పికరు లేదంటూనే
పనిలో తోడైతది

ఒంగి వరి కలుస్తున్నా
ఎర్రటెండల పాదయాత్ర జేస్తూ
పనికిపోతుంటే మర్రినీడలా తోడుంటది
వానాకాలం ముసురులో
ఎండాకాలం రాళ్ళవానల్లో
అవ్వ నెత్తిమీద కొంగు
అన్నికాలాల్లో అండగా వుంటది

నా పిల్లలను
అత్తుకొని ఎత్తుకొన్నప్పుడు
ల్యాగదూడను నాకుతున్న ఆవులాగ
దుమ్ము దూళి దులిపేసి
ముక్కు సీముదు తీసి అక్కున చేర్చుకొని
ఉబ్బరపోస్తదని ఊపె విసనకర్రలా
మత్తునిద్రకు మెత్తగా మారిపోయే
పుండు మానడం కోసం
చెట్ల వైదుగం కట్లకు
అనుకోనని గాయమై మూలుగుతుంటే
నెత్తురు జల యిస్తున్నపుడు
చింపి చుట్టిన బట్టపేగు కట్టు
ఓ తల్లి కొంగుపేగు బంధమై
అడవిల మా బాధలు తీరుస్తది

మా రీతి రివాయి
మా బతుకు తీరు అంతా
మా అవ్వ కొంగుతోనె మొదలు
గందుకే
జాండకు దండం పెట్టినా
రెపరెపలాడుతున్న జండాను చూసినా
కండ్లనిండ మా అవ్వకొంగే కనబడ్తది

---

# ఒంటికన్ను రాకాసి కోరల్ని పీకాలి

**నీహారిణి**



అదిగో–
ఒంటికన్ను రాక్షసి
కాని, అది వెయ్యిదిక్కులు చూస్తుంది
ఒక్క కందిపప్పు బాధలేమిక!
కోట్లకొలది సగటుజీవుల
పేగులు పీల్చుకుంటుంది
రోజుకొక ఇంట
నరమాంసం విందు కోరుకుంటుంది
నిండుబొర్ర నిమురుకునే
బందలకేం 'తెలుస్తుంది'–
లొట్టబోయిన పొట్టల బాధలు!
పంట సరుకులే కాదు
కాయగూరలు కొంటున్నాం వందలుబోసి
పంట పండుతోంది 'బడా' వ్యాపారులకే
గాదా?
పండించే రైతన్న 'ఎండు'తున్నా ఎవరికి
కావాలి?
సన్నబియ్యపు సొగసులేవో బక్కవాని నెక్కిరిస్తున్నాయి!
మాయలమర్రి ఊడలేమో ఉచ్చులుగా బిగుస్తున్నాయి!
కాలమేమో కొత్తబాటకై ఎదురుచూస్తున్నది
స్వార్థమేమో పాతపాటే పాడుతానంటున్నది!
అందుకే–ఆ–
'అవినీతి' రాకాసి గొంతుపిసకడానికో
కొడుకును పంపే కుంతిమాత లెక్కడ?
భీముణ్ణో, పార్థుణ్ణో భూతద్దంతో వెతకాలి!
భూతదయకోసం మళ్ళీ ఓ బుద్ధుడు జన్మించాలి!!
ప్రపంచీకరణ చుట్టూ పరుగులు పెట్టకుండా
గట్టి పట్టుబట్టాలి
పేదోడి బ్రతుకులో సిరులు నింపాలంటే
ఒంటికన్ను రాకాసి కోరలన్నీ పీకాలి!!



October 2009_30_09_2009_4.pmd 14 10/1/2002, 8:42 PM

విశ్లేషణ

# "శ్రీరంగం నారాయణ బాబు, శ్రీశ్రీసాహిత్యం-సారూప్యత"



డా॥ మౌని.



శ్రీరంగం నారాయణబాబు, శ్రీ రంగం శ్రీనివాసరావు పేర్లలో 'శ్రీ' ఉన్నాడు. కవి నారాయణబాబు తాత, శ్రీశ్రీ తాత సహోదరులు. వీరిద్దరూ సంప్రదాయ భూమిక నుండి అభ్యుదయ కవిత్వాన్ని సృష్టించినవారే. గురజాడను, అడుగు జాడగా భావించి గురజాడ జీవించిన విజయనగరంలోను, ఆ పరిసరాల్లోనూ, ఆ ఉద్యమాలనే ఆదర్శంగా, ఊపిరులుగా భావించిన శ్రీశ్రీ, నారాయణబాబులు భాష, శైలి, సంవిధానం వంటి విషయాల్లో గురజాడను అతిక్రమించి, దేశీయతను వదలి పూర్తిగా పాశ్చాత్యకవుల ఆధునిక రీతులను అనుసరించడం వలన ఆధునిక సాహిత్యం రెండు, మూడు దశాబ్దాల్లోనే తన గతిని మార్చుకుంది. అయితే కవులుగా ఎవరి ప్రత్యేక ముద్ర వారికుంది. అయినా వారి జీవితాన్ని, కవిత్వాన్ని పరిశీలిస్తే వారి వ్యక్తిత్వంలో స్పష్టమైన భేదాలు కన్పిస్తాయి. ఇరువురి జీవితాల్లోను, కవిత్వంలోను శిథిలవ్యవస్థ, అవ్యవస్థలే కన్పిస్తాయి. శ్రీ రంగం నారాయణబాబు తన సహజశైలితో వైచిత్రితో, తను దర్శించిన జీవిత సత్యాలను అట్టడుగుకంటూ శోధించాడు., నేటి జీవితంలోని కల్లోలాలను బహిర్గతం చేశాడు. అయితే శ్రీశ్రీ నిశిత తీక్షణదృష్టితో నేడు శిథిలమౌతున్న నాగరికతా సమాజాన్ని, నిర్మితమౌతున్న నూత్నమానవోద్యమాన్ని దర్శించి, ప్రజాకవిగా ఎలుగెత్తి నినదించాడు. నేటి జీవితంలోని కష్టసుఖాలు వీరిరువురిని ఆవహించాయి. నేటి సమాజంలో వున్న మానవుల అంతరాంతరాలలో దాగి వున్న తీరని కోరికలను, భావి సమాజ నూతన నిర్మాతలుగా రూపొందుతున్న ఆదర్శాలను పలికింపచేశాయి. వీరిరువురి సాహిత్యాన్ని గురించి డా॥ యు.ఎ.నరసింహమూర్తి మాటల్ని ఇక్కడ గుర్తు చేసుకోవడం సబబుగా తోస్తుంది. "శ్రీశ్రీ కవిత్వం హృదయాన్ని తాకుతుంది. నారాయణబాబు కవిత్వం బుద్ధికి పనిచెబుతుంది. నారాయణబాబు పరిసరాల్లో ప్రపంచాన్ని చూస్తాడు. శ్రీశ్రీ ప్రపంచంలో పరిసరాల్ని చూస్తాడు. శ్రీశ్రీది ఉదాత్తశైలి. నారాయణబాబుది సరళశైలి".

ఎన్ని వైవిధ్యాలున్నప్పటికీ, ఇద్దరి కవితల్లో కొన్నింటికి దగ్గర సామ్యం కన్పిస్తుంది. గురజాడ పుట్టిన గడ్డమీద, ఒకే కాలంలో ఇద్దరు కవులు కలిసి మెలసి ఆలోచన సాగించడం కూడా. ఇందుకు ఒక కారణం కావొచ్చు.

'రుధిర జ్యోతిలో"... నారాయణబాబు సౌమిధేనిగేయంలో...

"రక్తపతాకం
శక్తి నాలుక
అగ్నికిరీటం
ఆకాశమ్మున మునిమాపు
కేకలేస్తూ
పిలిచింది"

శ్రీశ్రీ మహాప్రస్థానం గేయంలో



October 2009_30_09_2009_4.pmd 15 10/1/2002, 8:42 PM

“కనబడలేదా మరో ప్రపంచం
అగ్నికిరీటపు ధగధగలు
ఎర్రబావుటా నిగనిగలు
హోమ జ్వాలల భుగభుగలు”

ఇరువురు సమ సమాజ స్థాపనకై ఈ గేయాలను ఒక యజ్ఞంగా భావించి రచించారు. రెండు గేయాలలోను ‘అగ్నికిరీటం’ కన్పిస్తుంది. నారాయణబాబు పై గేయంలో ‘శక్తి నాలుక’ అంటే, ఇంకో గేయంలో శ్రీశ్రీ ‘కలకత్తా కాళిక నాలిక’ అనడం జరిగింది. ఈ పదాల ప్రయోగం యాదృచ్ఛికమే కావచ్చు. అయినా భావావేశంలో సత్యాన్ని దర్శించే కవులకు– భావసారూప్యమే కాదు, పద సారూప్యం కూడా కన్పిస్తుందనేందుకు ఇలాంటి నిదర్శనాలు కోకొల్లలు.

నారాయణబాబు ‘కావాలి’ అనే గేయంలో
“ఆరిన చితిలో
బూడిద వెన్నెల
జారిన ముక్కు పుడక
ఒక్కటే చుక్క సమాధిలో
మృతశిశువట్టుల
జలదాంతర శశి.”

శ్రీశ్రీ “ఒకరాత్రి” అనే గేయంలో...
“ఆకాశపుటెడారి
లో కాళ్లు తెగిన
ఒంటరి ఒంటె
లాగుంది జాబిల్లి
విశ్వమంతానిండి
వెలిబూదివోలె
బహుళపంచమి జ్యోత్స్న
భయపెట్టు నన్ను”.

పై రెండు గేయాల్లోనూ కదలలేని, కాంతిలేని చంద్రుణ్ని ఊహించడం ఇద్దరిలోను సమానంగా కన్పిస్తోంది. ఊహను ఉద్దీపనం చెయ్యడంలో, కవిత్వంగా మార్చడంలో ఎవరి నైపుణ్యం వారిదే. భగత్‌సింగ్ మరణాన్ని ఉద్దేశించిన గేయాల్ని ‘కపాలమోక్షం’ అని నారాయణబాబు, ‘జ్వాలాతోరణం’ అని శ్రీశ్రీ రాశారు. ఈ రెండు శీర్షికలు సంప్రదాయ భూమిక నుండే తీసుకుని రాయబడ్డాయి. సాధారణ మరణం పొందే వారు ఎందరున్నా దేశం కోసం ఉరికంబాన్నెక్కే అవకాశం పొందిన భగత్‌సింగు ‘కపాలమోక్షం’ వల్ల పొందే పుణ్యాన్ని ప్రయోజనాన్ని పొందాడని ఊహించాడు నారాయణబాబు. అయితే సాహసోపేతమైన వీరమరణం ఒక జాతికి నూత్న జీవితం ఇస్తుందని, కొత్త శకాన్ని ఆవిర్భవింపచేస్తుందని... శ్రీశ్రీ భగత్‌సింగ్ మరణాన్ని గూర్చి “పుడమికి నేడే పుట్టిన రోజని” ఎలుగెత్తి చాటాడు. ఇరువురి ఆలోచనల్లోను, గేయాన్ని నడిపిన తీరులోను... అందులోని సంక్షోభాన్ని వర్ణించిన తీరులోను సారూప్యత కన్పిస్తుంది.

**నారాయణబాబు**

(1). చలించినవి/ చరాచరమ్ములు
భూతాలుద్రేకించినాయి
కాటుక పెట్టిన
నయనేంద్రియమై
కర్మసాక్షి/ చీకటులురిత్రాడు

(2) భూలోకమ్మున
తురకలు గోరీలందున
క్రైస్తవులు సమాధులందున
హిందూ శ్మశాన వాటుల
కపాలమ్ములు వికవిక నవ్వినవి.

**శ్రీశ్రీ**

(1). స్వర్గనరకముల ఛాయాదేహళి
తెలినలితలుపులు, తెరిచి మూసుకుని
స్వర్గవిలయహేమంత, వసంత
ధ్వాంతికాంతి విక్రాంతవేళలో.....

(2) చావు పుట్టుకల పొలిమేరలలో
ఆవులించెనొక చితాగ్ని కుండం
అనాధ జీవుల సమాధులన్నీ
అఘోరించి, ఘోషించాయి....

వీరిద్దరు, నిపుణులైన కవులే. అందుకు సందేహం లేదు. తాము తీసుకున్న కావ్య వస్తువు చెడకుండా, తమదైన శైలిలో తమ ముద్ర చెదరకుండా కవిత్వాన్ని ప్రజల కవిత్వంగా ఎలా మలచాలో అందుకు వీరి గేయాలే తార్కాణం. ‘వీధి పాటకులు’ అనే కవితలో శంకరాభరణం ప్రస్తావన ఉంది. ప్రపంచ సంగీత రీతుల్లో ప్రధానమైన రాగం శంకరాభరణం. శంకరాభరణం అంటే పరమేశ్వరుని కంఠాభరణాలై రెండు చెవుల్లోనూ ప్రణవగానం చేసే సర్పములు. అవి వీధిగాయకులకు గురువులైన వాత్మకములు. పాపభారం మోయలేని సృష్టి నిలయం చేసి పునస్సృష్టికి మార్గం చూపే శంకరుడు ప్రతీకాత్మంగా అభ్యుదయ కవులకు ఆరాధ్యుడయ్యాడు. ముఖ్యంగా శ్రీశ్రీ, నారాయణ బాబు కవితల్లో తరచుగా శంకరుని ప్రస్తావన కన్పిస్తుంది. కళ ప్రభువు వినోదానికి, ఆత్మ వినాశానికి కాదు. ప్రజాక్షేమం కోసం ఉపయోగపడాలి అని తెలుసుకోమంటున్నాడు నారాయణబాబు.

‘ప్రకృతి పెట్టిన
వేసవి గానపాఠశాల
తుమ్మెద తంబుర శృతి
కోయిల ఒజ్జ
శాపంలో కుశలవులు
వాత్మకం
శంకరాభరణం



October 2009_30_09_2009_4.pmd 16 10/1/2002, 8:42 PM

శాపంలో కుశలవులు పాడిన శంకరాభరణాన్ని వీధి గాయకుల శ్రమ నివారణ పాటతోను, ఆకలితో కాలిపేలిపోవు కంఠధ్వయి పాటతో సమన్వయించిన సత్యాన్ని, సౌందర్యాన్ని అభ్యుదయ భారబందురంగా చెప్పాడు. కళ సారస్వత, ఆధ్యాత్మిక తాత్విక సంబంధమైన వారి ఆలోచనలకన్నింటికి సంప్రదాయమే వాహిక అయింది. వాటిని ఆకర్షించగల ప్రయోగానికి కూడా సంప్రదాయమే వాహికగా వుండాలని నారాయణ బాబు, శ్రీశ్రీ వంటి తొలితరం అభ్యుదయ కవులు విశ్వసించారనడం నిజం. నారాయణబాబు 'రుధిరజ్వాలలో' ఇది ప్రముఖంగా కన్పిస్తుంది. 'సౌమిధేని' కవితలో రుషులు సహజ క్షేమం కోరి యజ్ఞం చేయడం సంప్రదాయంగా కన్పిస్తుంది. యజ్ఞగుండంలో అగ్నిని ప్రజ్వలింపచేయడానికి మంత్రపూర్వకంగా సమిధలు సమర్పిస్తారు. ఇది అగ్నినిప్రజ్వలింపచేస్తుంది. ఈ దృష్టితోనే శ్రీశ్రీ "నేను సైతం ప్రపంచాగ్నికి సమిధ నొక్కటి ఆహుతిచ్చాను" అని చెప్పాడు. ఆహుతిచ్చినంతనే చాలదు-ప్రజ్వరిల్లడానికి మంత్రపఠనం చేయాలి. ఋగ్వేదంలో సమిధలను ప్రజ్వలింపచేసే సమయంలో పఠించే ఋక్కులకు "సౌమిధేని" అని పేరు. అభ్యుదయ సమాజ సంస్థాపన కోసం ఉద్యమించే ప్రజలు సమిధలైతే, ఆ ఉద్యమ చైతన్యాన్ని ప్రజ్వలింప చేసే మంత్రం నారాయణబాబు రాసిన "సౌమిధేని".

ఇదేవిధంగా "ఢంకాబజావ్" అనే కవితలో నారాయణ బాబు, అరుణరాగ సంధ్యలో ఆరంభమైన వాతావరణాన్ని వర్ణిస్తూ...

"నటరాజు గొంతులో
పాటలా పుష్పించి
పురివిచ్చే
పుష్యలావర్త మేఘాలు". ఈ పుష్యలావర్తు మేఘాలు ప్రాచీన సాహిత్యంలో కన్పిస్తాయి. సప్తమేఘాల పేర్లలో పుష్యలావర్త ఒక్కటి. ఇవి ఇంద్రుని ఆధీనంలో వుంటాయంటారు. ఇవి 'సంవర్త, ఆవర్త, పుష్యలావర్త, ద్రోణ, కాళ, నీళ, మహాకాళ'యని. సప్తమేఘాలలో సంవర్తనమనే మేఘం ప్రళయకాలంలో వర్షిస్తుందంటారు. భాగవతపురాణంలో తన పూజమానిన అభేరులపై సంవర్తన మేఘాలను వదిలి ఏడు రోజులు అసిధారావ్రతంగా వర్షాలు కురిపించిన గాథవుంది. శ్రీశ్రీ కూడా తన 'జ్వాలాతోరణం'లో 'అదె సంవర్తపు తుఫాను మేఘం' అంటూ ఈ మేఘాన్ని పేర్కొనడం విశేషం.

'రక్షణ మందిరం' అనే కవితలో నారాయణబాబు వేయి కళ్లతో విరూపంగా కన్పించే ఇంద్రుడు ఎలా ఉంటాడో, వేయిగాయాలతో కన్పించే కుష్ఠురోగి ఇక్కడ అలా కన్పిస్తాడు.

"కొత్త సృష్టికే పిలిచాడు
కట్టుతెగిన కాలభైరవుడు
గాలి... పండుటాకుల
మోడుటాకుల
మరణశయ్యకె పరిచాడు
కొత్త సృష్టికే పిలిచాడు"

ఇలాంటి భావమే, శ్రీశ్రీ రాసిన 'అవతారం' అనే కవితలో "నరకలోకపు జాగిలమ్ములు, గొలుసు త్రెంచుక ఉరికిపడ్డాయి" అనే చరణంతోపాటు "పుడమి తల్లికి పురిటి నొప్పులు కొత్త సృష్టిని స్ఫురించాయి" అనే చరణాలను జ్ఞప్తికి తెస్తాయి. ఇక్కడ కవులిద్దరి లక్ష్యం ఒక్కటే. సామాన్యులు యాజమాన్యాలపై తిరుగుబాటు చేసి వర్గరహిత సమాజాన్ని సృష్టించడమే లక్ష్యంగా కన్పిస్తుంది. ఒక విధంగా ఇది బానిసల తిరుగుబాటును తెలియచేస్తుంది. ఇక్కడ కవులిద్దరు ఒకేరకమైన ప్రతీకలను ఆశ్రయించారు... "నరలోకపు జాగిలమ్ము" అనడంలో, శ్రీశ్రీ పాశ్చాత్య సంప్రదాయ ప్రతీకను ఎన్నుకుంటే, నారాయణబాబు భారతీయ సాంప్రదాయ ప్రతీకయైన 'కాల భైరవుడ్ని' ఎన్నుకున్నాడు.

సమాసాలు, అలంకారాలు, వ్యాకరణాలు, ఛందస్సులనన్నింటిని నారాయణబాబు నిర్లక్ష్యం చేశాడు.

'మాసిన బట్టల, మాటల మూటలు
రేవులో తగలబెట్టుకుని ఏడుస్తూ
ఎదురుగుండా తోచిన
చాకలి సరస్వతిని చూచి
కోపంతో శ్రీశ్రీ తన్నేందుకు కాలెత్తి
మూగయై నిల్చున్నాడు" అంటాడు నారాయణబాబు. శ్రీశ్రీ ఎత్తిన కాలుదించాడేమోగాని, నారాయణబాబు ఆ పనిచేసి చూపించాడు. ఆ సరస్వతికి "పాతాళమ్మున పతితులు పల్లవించే మాటల జిలిబిలి తేటల చీకటి గుండె కదిల్చే జాలి పాట"నేర్పాడు నారాయణబాబు. ఏది ఏమైనా శ్రీశ్రీ నారాయణబాబులు అతినవ్య కవితా ధోరణులకు భాష్యప్రణీతులయ్యారు.

'ఒళ్లు తెలియక, పళ్లు కొరుకుతూ
నృత్యం చేస్తే,
రాక్షస సంఘపు కలాలమ్మే
తైలమ్ముగ జీవనమెత్తగ
రుధిర జ్యోతి వెలిగింపుమురా
విప్లవగీతి వినిపింపుమురా.." ఇలాంటి చరణాలలో నారాయణబాబు ఆదర్శం గురజాడకు సన్నిహితంగా కన్పించినా, ఆయన దర్శనం అభివృద్ధి సంపూర్ణంగా భిన్నమైన మార్గంలోనే ఉన్నాయని స్పష్టమై తోస్తుంది.

"భూమికంత ఈనాడే
గ్రామ దేవతోత్సవమ్ము
కాల జ్ఞానులు మీరు
కాచుకోండి కత్తిపదును
కాచుకోండి కవిగారని'..

గాలి కబురు చెప్పింది - విజయనగరంలో అమ్మవారి ఉత్సవంలో లెక్కలేనన్ని కోళ్లు తెగేవి. ఇక ప్రపంచ స్థాయిలో ఉత్సవం జరిగితే అమంగళ పరిహారానికి, అభ్యుదయ ఆవిష్కారానికి ఎన్ని వేల కోళ్లు తెగిపడాల్సి వస్తుందోనన్న సంరంభాన్ని ఊహించుకున్న సామ్యవాద



October 2009_30_09_2009_4.pmd 17 10/1/2002, 8:42 PM

సమాజావిష్కరణ కవి నారాయణబాబు ఊహకు అద్దం పదుతున్న గీతం ఇది. నారాయణ బాబుకు గ్రామ దేవత ఉత్సవం ఈ రకమైన కవిత రాయడానికి ప్రేరణ అయితే శ్రీశ్రీకి రథయాత్ర "జగన్నాథుని రథచక్రాలు" వంటి కవిత రాయడానికి ప్రేరణ అయిందంటారు. ఇలాగే శ్రీశ్రీ తన "శైశవగీతిని" రసపారవశ్యంతో రాశారు. నారాయణబాబు 'చిన్నా' కవితను తాత్త్విక చింతనతో రాశాడు. శ్రీశ్రీ ఆధునికతవైపు మొగ్గు చూపినా, నారాయణబాబు మాత్రం అత్యాధునిక కవితా ధోరణులపై మొగ్గు చూపి, కొంగ్రొత్త ప్రయోగాలు చేసి, తన అభినివేశాన్ని అందరికంటే భిన్నంగా సాధించారు.

నారాయణబాబు బ్రహ్మచారి. ఆయనకు కుటుంబం, బంధుగణం లేదు. శ్రీశ్రీ, ఆరుద్రలు ఆయనకు స్నేహితులని తెలుస్తుంది. తొలి దశకంలో శ్రీశ్రీకి, నారాయణబాబుకు భేదాభిప్రాయాలుండేవని అంటారు. దీనికి సాక్ష్యాలుగా కొందరు రాజకీయ కారణాలు చూపిస్తే, కొందరు సాహిత్య కారణాలు చూపించారు. శ్రీశ్రీ నారాయణబాబును వ్యతిరేకిస్తూ చేసిన ప్రకటనలున్నాయి. "ఏరి తల్లీ ! నిరుడు మురిసిన ఇనపరచయితలని", నారాయణ బాబు "తోక చుక్కయని' ఎద్దేవా చేయడం జరిగింది. శ్రీశ్రీ, నారాయణబాబును తోక చుక్క అనడం తప్పుకాదుగానీ, అది శ్రీశ్రీ చెప్పిన తోక చుక్కకాదు. గురజాడ చెప్పిన తోక చుక్క సంఘ సంస్కరణ పతాక. నారాయణబాబు కూడా శ్రీశ్రీని "నిన్న వెల్లికిలా- నేడు బోర్లా" అని అన్నాడంటారు. అయితే నారాయణబాబు తన 'మౌనశంఖం'లో ఇలా శ్రీశ్రీని గూర్చి తన మనసులోని మాట చెప్పాడు.

"నీటికన్నా రక్తం చిక్కన
కవులమైనా, అన్నదమ్ములమైనా... శ్రీశ్రీ, నేను" అని.

శ్రీశ్రీని, నారాయణబాబు ఇద్దరూ అభ్యుదయ కవితా మార్గగామిలైనా, ఆ ప్రస్థానానికి నాయకత్వ ఆధిపత్యం మాత్రం శ్రీశ్రీదే. నారాయణబాబుతో సహా ఆయన అభిమానులైన రోణంకి, చాసోలకుగాని శ్రీశ్రీతో మనస్పర్థలు అభిప్రాయ భేదాలు ఉంటే ఉండవచ్చుగాని, శ్రీశ్రీ ఆధిపత్యాన్ని వారెవరు శంకించలేదు. కొన్ని అవాంఛనీయ సంఘటనలు వారి మధ్య దూరాన్ని పెంచినా, నారాయణబాబుకు శ్రీశ్రీ అంటే వల్లమాలిన ప్రేమ. అందుకే "మౌన శంఖం"లో మరికొన్ని పాదాలను మననం చేసుకుందాం.

'పక్కన పడివున్న శేషుని కోరపెరికి
ఆదగండభేరుండ పక్షి రెక్కమీద
డాలీ శ్రీశ్రీ రచించిన చిత్రపఠానికి
మా శ్రీ నారాయణబాబు తీసిన ఛాయాచిత్రం" అంటూ

నారాయణబాబు శ్రీశ్రీని అభివర్ణించాడు. డాలీ అంటే సాల్విడోర్ డాలి (1904-1989) సర్రియలిస్ట్ డాడా ఇస్ట్, ప్రముఖ స్పెయిన్ చిత్రకారుడు. శ్రీశ్రీ, నారాయణబాబులతో అతి దగ్గర పరిచయమున్న 'ఆరుద్ర' గారి మాటల్లో "నారాయణబాబు వ్యక్తిగత జీవితంలో నియమాలు, నిష్ఠలు వున్నవాడు. తెల్ల కాగితం లాంటి ఒంటరి జీవితం మీద చక్కగా రూళ్లు గీసుకుని గుండ్రంగా కుదురుగా ఉన్నంతలో బ్రతికాడు" అని నారాయణబాబు వ్యక్తిత్వాన్ని చిత్రించాడు.

కవుల వ్యక్తిగత వైషమ్యాలతో, సాహితీ ప్రియులకు సంబంధం లేదు. వారు సృష్టించిన సాహిత్యం ప్రజలకు ఎంతో విలువైంది. అభ్యుదయ సాహిత్యాకాశంలో సూర్యచంద్రులుగా ప్రకాశించిన శ్రీరంగం శ్రీనివాసరావు, శ్రీరంగం నారాయణబాబులిద్దరు. ప్రజలకు అత్యంత ప్రియతములే అన్నది నిర్వివాదాంశము. ■


**'ప్రస్థానం'కు చందా కట్టండి!**
**నెల నెలా మీ ఇంటికే ప్రస్థానం తెప్పించుకోండి!!**

సాహిత్య ప్రస్థానం మాసపత్రిక చందా వివరాలు

**సంవత్సర చందా (వ్యక్తులకు) : రు.120/-** **సంవత్సర చందా (సంస్థలకు) : రు. 150/-**

**అయిదేళ్లకు : రు. 500/-** — **పదేళ్లకు : రు. 1000/-** — **విడి ప్రతి : రు. 10/-**

**చందా దారులకు విజ్ఞప్తి** **చిరునామా పైన చందా ప్రారంభ మరియు ముగింపు నెలలు సూచించబడినవి. దయచేసి చందా ముగిసిన వారు తమ ముగింపు నెలను గుర్తించి వెంటనే చందాను పునరుద్ధరించుకోగలరు.**

మేనేజర్
ప్రస్థానం
ఎం.హెచ్.భవన్, ప్లాట్ నెం. 21/1, అజామాబాద్, ఆర్‌టిసి కళ్యాణమండపం దగ్గర, హైదరాబాద్-20
వివరాలకు : 040-27660013, సెల్: 9490099059 ; ఇ.మెయిల్:Prasthanam_ss@yahoo.co.in





October 2009_30_09_2009_4.pmd 18 10/1/2002, 8:42 PM

## కవిత

# భవంతి



హిందీమూలం: కైఫీ ఆజ్మి
అనువాదం: వేదుల రామకృష్ణ

*ఈ రేయి చాలా వేడి గాలి వీస్తోంది.*
*ఈ రేయి ఫుట్‌పాత్‌పై నిద్ర రాకుంది.*
*అందరూ లెండి, నేనూ లేస్తా,*
*నువ్వులే, నువ్వులే,*
*ఏదో కిటికి ఈ గోడలోనే తెరుచుకుంటుంది.*
*ఈ నేల అప్పుడు కూడా*
*మింగేసి తీరుతాననేలా ఉండింది.*
*ఈ భవంతులకు కాని,*
*వాట్లో ఉండేవాళ్ళకి కాని తెలియదులెండి*
*మేము గుహల్లో గడిపిన రోజుల గురించి*
*మూసలో పోయబడుతూ ఉన్న అలుపెరుగని చేతులతో*
*ఆకారం తరువాత కొత్త ఆకారం తీర్చి దిద్దాము మేము లేపేము ఈ*
*గోడని పైకి, ఇంకాపైకి, ఇంకాపైకి*
*కప్పు తలుపులు కాస్త, ఇంకాస్త, మెరుగు పరిచాము మేము*
*గాలి [illegible]*
*కనుక విద్యుత్తారలను అమర్చిపెట్టాము మేము,*
*భవంతి కాగానే ఎవడో కుర్చుండిపోయాడు కాపలా,*
*నిర్మాణపు కోలాహలంలో మట్టిలోనే పరుండేము మేము. నరనరాల్లో*
*అవిశ్రాంత శ్రమ యొక్క అలసటై*
*నిమీలిత నేత్రాల్లో నిలిచిన ఆ భవంతి చిత్రమై*
*కరుగుతున్నది పగలు ఇప్పటికి ఇలాగే తలలపై.*
*రేయి గుచ్చుకుంటున్నది కళ్ళల్లో చీకటి బాణాలై.*
*ఈ రేయి........................*
*...................తెరుచుకుంటుంది*

---

# సుడిగాలిలోని దీపం !

గుర్రాల రమణయ్య



గతం మనసులో కదలాడినప్పుడు
హృదయాన్ని వేటాడుతున్న జ్ఞాపకాలు
చూరు చినుకులు రాలుతున్నట్లు
కన్నీటి బొట్లు రాలుతుంటే
కలాన్ని నా రక్తంలోముంచి
మూగరోదనా వేదనై రాస్తున్నా!
జీవనపయనం ఓ ఎడారి గమనమై
ఆత్మీయతా ఒయాసిస్సుల కోసం వెదుకుతూ
వేసారి పోతున్నప్పుడు
ఓతాత్వికత పక్షిలా దూసుకవచ్చి
నాగుండెలో కెలుకుతున్నపుడు
వేదనా సంఘర్షణ మొదలైంది
ఎవరు ముందో ఎవరు వెనుకో
ఏనాడు ఎలా మలుపు తిరుగుతుందో
ఎవరూహించగలం
నేననుకోలేదు
రెక్కలు తెగిన ఒంటరి పక్షినైపోతానని
నీదారిన నీవు వెళ్ళావు!
ఏ దారి కానక
నేనిక్కడ నీ జ్ఞాపకాల్లో
దగ్ధమైపోతూ....
మనం జీవితాన్ని
కలబోసుకున్న రోజుల్లో
ఏదైనా బాధించి నట్లుంటే
క్షమిస్తావు కదూ
అని ఆషామాషిగా అన్నపుడు
మనసు కావాలిగానీ
మిగతావన్నీ మనసులోకి రానీకని
నీవు నన్ను
ఒదిలి వెళ్ళే రోజు తెలిసే అన్నావా!
మీలో చిరునవ్వే చూడాలి
బాధ పడితే భరించలేను
హుషారుగా ఉండాలి !
అంటూ నా గురించి చెప్పావు గానీ
తిరిగిరాని
నీ పయనం గురించి చెప్పలేదు కదా!
బహుశా అది తెలిస్తే తట్టుకోలేనని!
మోడువారిన చెట్టు చిగురించేలా
ఆరిపోయే దీపాన్ని వెలిగించేలా
అనురాగం గుప్పెట్లో మూసి
నన్ను మోసగించావు !
నన్ను క్షమించవూ !
ఇక నా గురించి
యెదలో
కాలంగునపాలై గుచ్చుతున్నా
కల్లోల పవనాలు సుళ్ళు తిరుగుతున్నా
కింకర్తవ్యమని కాలాన్ని ప్రశ్నిస్తూ
ఆనంద వీచికల హస్తాన్నందుకొని
చిరునవ్వుతో తిరుగాడే
గొప్ప నటుడ్ని !
నిజం చెప్పాలంటే
నేనిప్పుడు
సుడిగాలిలోని దీపాన్నే !



October 2009_30_09_2009_4.pmd 19 10/1/2002, 8:42 PM

## అవలోకనం

# బస్సు ప్రయాణమూ కవిత్వమే!

### డాక్టర్ రాధేయ



కవిత్వం అంతర్మథనమే కాదు అనంత వైవిధ్యభరితం. కవి తన బాధలను అనుభవిస్తాడు. బాధితుల్ని పరామర్శిస్తాడు. యాంత్రిక వ్యాపార కాంక్షల్ని వ్యతిరేకిస్తాడు. సాంస్కృతిక పతనానికి తల్లడిల్లిపోతాడు. ఈ పరిణామ క్రమంలో తనకు తారసపడిన అనుభవాలను అనుభూతులను తన కవితా వస్తువులుగా రూపొందించుకుంటాడు.

కవి నిరంతర స్వప్నజీవి. స్వప్నలోక సంచారి. తన స్వప్నాలన్నింటినీ మానవీయ చింతనలో మమేకం చేసుకుంటూ ప్రయాణిస్తూ వుంటాడు. ప్రయాణీకులందరికీ గమ్యాలుంటాయి. కానీ కవి ప్రయాణానికి గమ్యాలుండవు. అన్నీ మజిలీలే. తాను ప్రయాణించే వాహనం ఏదైనా సరే ఆ వాహనం కంటే వేగంగా తన ఆలోచనల్ని పరుగెత్తిస్తాడు కవి. మలుపు మలుపులోను కవితాను భూతులతో జీవన సత్యాలను క్లోజప్‌లో దర్శిస్తాడు. తన ప్రయాణంలో చెట్టూ, పుట్టా, మట్టీ, గట్టూ అన్నీ తన పదాల్లో అపురూపంగా వొదిగిపోతాయి.

ప్రకృతి చరణాలపై కరస్పర్శే కవిత్వమంటే. తన కవితా ప్రయాణంలో స్వప్నాల్ని ప్రేమించేకవి మనసుకు సరిహద్దులుండవు. సాధారణంగా కవులంతా మధ్యతరగతి వార్రై, వేతనజీవులై వుంటారు. అందుకే వారు రైలు ప్రయాణాన్నీ, బస్సు ప్రయాణాన్నీ ఎక్కువగా ఇష్టపడతారే తప్ప ఆకాశయానం చెయ్యాలన్న అత్యాశవారికుండదు. ఎందుకంటే తమ ఊహల్లో ఆకాశమండలాన్ని నిరంతరం చుట్టివస్తుంటారు కనుక. బస్సు ప్రయాణంలో కిటికీ పక్కన కూర్చొని ప్రకృతిలోకి కవితాయానం సాగిస్తారు. మొక్కజొన్న పొత్తులపై అడవి పిట్టల విన్యాసాన్ని కవిత్వంగా దృశ్యమానం చేస్తాడు. సమస్తాన్ని ప్రేమించే మనసులకు సాయుధ పహారా ఎందుకు? ఆకుపచ్చని చిగుళ్ళని ఆప్యాయంగా స్పృశించే వారికి అడ్డంకులెందుకు?

"నదులూ, కవులూ భూగోళపు రక్తనాళాలు, నదులు ప్రవహిస్తాయి కవితల్లా పక్షుల కోసం, పశువుల కోసం, మనుషుల కోసం, నదులుకంటున్న కలలు పొలాల్లో ఫలిస్తాయి. కవులుకంటున్న కలలు మనుషుల్లో ఫలిస్తాయి". అంటారు శేషేంద్ర

కవి తన సుదీర్ఘ జీవన ప్రయాణంలో ఏదో ఒక మలుపు దగ్గర ఆగి వెనక్కి తిరిగి చూసుకుంటాడు. సజీవమైన తన పురాస్మృతుల్ని ఒక్కసారి నెమరేసుకుంటాడు. కాలం చిటికెన వేలు పట్టుకొని సాగిపోయే కలల బేహారి కవి. ఈ నేపథ్యంలోంచి కవుల బస్సు ప్రయాణాన్నీ, ఊహాలోక విహారాలను ఒక్కసారి మననం చేసుకుందాం.

భద్రాచలం నుంచి హైద్రాబాదుకు గానీ, హైద్రాబాదు నుంచీ కాకినాడకు గానీ, కాకినాడ నుంచీ సాలూరుకు గానీ, హైద్రాబాదు నుంచీ కర్నూలు, కడప, తిరుపతికి గానీ, ఎక్కణ్ణించి ఎక్కడికైనా బస్సులో కిటికీ దగ్గర కూర్చున్న కవి మనోగతం ఇలా ఉంది.

"బస్సు కిటికీ తలుపు దగ్గర కూర్చుంటే/ ఎంతహాయి/ ఎంతహాయి:/ గాలి విసురు శ్వాస మార్గాల్లో/ ఆటలాడుకుంటుంది/ చెట్లన్నీ దగ్గరికి వస్తున్నట్టే కనిపించి/ రాలేక పోయినందుకు స్తంబించి/ కొమ్మల సందేశాల్ని/ ఆత్మలోకి పంపుతూ ఉంటై/ తాగ్రొడును శృతి పెట్టెలా చేసుకొని/ బస్సు వినిపించే ప్రయాణరాగం/ అంతర్గత గీతంలా వెంటాడుతుంటుంది/ కండక్టరు లేని బస్సులో/ డ్రైవరు టికెట్ల యంత్రం పట్టుకొని తానో యంత్రమైతే/ ఆలస్యాన్ని భరించలేని ప్రయాణీకుల ఆగ్రహాన్ని/ నిగ్రహంతో ఎదుర్కొంటూ/ చిరునవ్వులు నవ్వే చోదకుడు/ దోవలో ఎత్తిన చేతిని మన్నించి బస్సునాపి/ బాటసారి కాళ్ళకి స్వాగతం చెప్పే/ డ్రైవర్ మెత్తటి చూపులు/ భోజనం కోసం ఆపిన స్టేజిలో ప్రయాణికుడి రాక ఆలస్యమైనా/ బస్సును ఆపి ఆపినందుకు లోపలివారి/ అసహనపు అరుపుల్ని మింగేస్తూ/ అందర్నీ లెక్కపెట్టుకొని/ పునః ప్రారంభాన్ని తృప్తిగా కొనసాగించే ప్రజానుబంధం/ ఆర్టీసీ బస్సు ప్రయాణమంటే/ నాకు సాహిత్య సభంత యిష్టం/ గ్లోబలైజేషన్ ఘోరాల్ని / నా కవిత్వం ఎత్తి చూపుతుంటే/ ఈ ఆర్టీసి రేపు ఏమౌతుందోనని/ నాలో చిరిగి పోతున్న దేశపటమంతా విషాదం!"

–అద్దేపల్లి రామమోహనరావు

ప్రయాణమంటేనే నాకు ఆశ. ఎందుకంటే కిటికీల్లోంచీ కవిత్వం వీస్తుంది. పొలిమేరలు దాటగానే కలలు మేలుకుంటాయి. ముందుకు వెళ్తున్న కొద్దీ మనసు వెనక్కి పరుగెడుతుంది అంటాడు కవి.

"అనంతానేక అసంఖ్యాక దృశ్యాలు/ కిటికీ ఫ్రేంలోనికి ఇమిడిపోతాయి/ బస్సంతా కవిత్వవౌతుంది/ స్వప్నాలు తూనీగలవుతాయి/ దూరంగా కొండల్లోంచి/ పైటలెగరేస్తూ మేఘాలు చేరువౌతాయి/ గుడిసె హోటళ్ళులోంచి/ పడుచుదనం ప్రవహిస్తుంది/ మగత జిగురుతో/ రెప్పలు అంటుకుంటాయి/ నిద్రకూ మెలుకువకూ మధ్య/ తీగెమీద ఒంటికాలిపై నడిచే చేతన/ ఫెళ్ళున కొట్టే ఎండలోంచి/ దోసెడు చెమట చుక్కలు../పద్యాలు...పద్యాలు../ పద్యాలు ఖాళీ చేసిన బస్సు/ పాడువడ్డ బంగళాలా మిగుల్తుంది/"

–డా॥ఎన్. గోపి

బస్సు ప్రయాణమెప్పుడూ గమ్యంవైపూ, కవి చూపు గమనం వైపూ సాగాలి. వృధా ప్రయాణం కవివైపు నుంచీ సాగదు. దారివెంట ప్రతి గులక రాయీ పల్కరిస్తుంది. తాడుతో కట్టేసుకున్నా, చూపుల్లోంచీ భయం తొంగిచూస్తుంది అప్పుడప్పుడూ–

"చీకటి నీడని పాముతూ కళ్ళజోడు/ బస్సు కిటికీలోంచివాలి/



October 2009_30_09_2009_4.pmd 20 10/1/2002, 8:42 PM

దారివెంట ప్రతి గులకరాయినీ గిల్లుతుంది./ నీచ చేతనలోంచి/ నూతిబొక్కెనలోకి/ తాబేలు ఇరుక్కొంటుంది./ గమనం వేపే ప్రయాణం కానీ/ ఇదనలౌకనిష్కారణజర్నీ/ దిగుడు బావిలోకి బస్సు వాలిపోయిందనుకో/ జోబిలో టికెట్టు ఎవడన్నా కొట్టేస్తాడేమో!"

'మో'

ఈ కవికి ఎర్రబస్సంటే ప్రాణంతో సమానం.

"డ్రైవర్ సీట్లో మానాన్నని కూర్చోబెట్టుకొని/ నా ఒంటిమీద బట్టలైన బస్సు/ నా చేతుల్లో పుస్తకమైన బస్సు/ నాలాగే ఎంతోమందికి అన్నమైన బస్సు/ ఈ బస్సు ఒఠ్ఠి పిచ్చిది/ కానీ దానికేం తెలుసు/ తల్లి లేకుండా బిడ్డ లెక్కడైనా ఉంటారా?/ కన్నపిల్లలంతా కలిసి పనిమానుకుంటే/ బస్సు ... అమ్మకోసం చూస్తున్న పిల్లాడిలా ఉంది. పండుగ సెలవులే తెలీని కాన్వెంటు లాగుంది/ ఎంత పరుగుదీసినా అలుపే ఎరుగని బస్సు/ ఎన్నడూ.. ఎదురు తిరగని బస్సు/ నన్ను కనని తల్లి బస్సు/ ఎంతకోపమొచ్చినా కనీసం మందలించని మా మేనత్తే బస్సు/ అమ్మా... ఎర్రబస్సూ/ నిన్ను అమ్మాలనిచూసే దళారుల్ని చూసి/ ఎంతకాలం అలా యంత్రక్రీస్తువై క్షమిస్తావే/ పాలు తాగి తల్లి రొమ్మునే గుద్దే ఈ పశువుల మీదుగా/ ఒక్కసారి నడిచిపోవే.. చాలు/"

–రాంరెడ్డి

ఎర్రబస్సంటే ఒక లౌకిక లోకం. సమస్త వ్యక్తిత్వాలను ఏకం చేసే వేదిక అస్పృశ్యతను రూపుమాపే సంఘ సంస్కరణ వాహనం. ఉద్యోగులు, విద్యార్థులు, సామాన్యులు కలిసిసాగే మానవ జీవనయానం. బస్సంటేనే కదిలిపోతున్న ఓ వాహన సంసారం అంటాడు ఈ కవి. లేనోళ్ళకు లోగిలి. కలిగినోళ్ళకు వాకిలి. అందర్నీ ఒక్కటిగా చేసే ఆత్మీయ కరస్పర్శే బస్సు ప్రయాణం.

బస్సు ఒకానొక లౌకిక లోకం/ ఒక ఊరు, ఒకతాండ, ఒక పట్నం/ సమస్త వ్యక్తిత్వాలను ఏకం చేస్తున్న వేదిక/ అంటుడు ముట్టుడు రూపుమాపి/ ఆదినుంచి అందరిని కలిపిందీ ఎర్రబస్సు/ ఒక్కలా ఇద్దరా/ ఊరికిద్దరు.. ముగ్గురు... పదిమంది/ కులాని కొకలు తలానికొకలు/ నిత్యం ఎందరెందరినో/ మోసుకుపోతున్న బస్సు/ సమానత్వ సూత్రానికి సిసలైన ప్రతీక/ కిటికీ ప్రక్క/ ఆలోచనా పావురాలు రెపరెపలాడుతాయి/ దృశ్యా దృశ్యాలు మనసు పొరల్లో క్లిక్ మంటాయి/ కొందరికి బస్సు నిద్రపాన్పు/ కొందరికి పఠన సమయం/ ఒక్కో దినపత్రిక పదిముక్కలై/ వరుస వరుసకూ తిరుగుతుంది/ లేనోళ్ళ లొగిలి/ కలిగినోళ్ళ వాకిలి/ నడుస్తున్న చల్లని చెట్టు/ ఉరుకుతున్న ఇల్లు/ గంటలకు గంటలు మనల్ని కలిపి ఉంచే కరచాలన స్పర్శ/ బస్సు మానవ జీవనయానం/ పగుంటే కూల్చేటోన్ని కూల్చుకో/ కాల్చుకో../ బంగారం అసోంటి బస్సేమన్నది../"

– అన్నవరం దేవేందర్

ఈ కవికి ఎర్రబస్సు ప్రయాణమంటే పరుగుల రాణి పి.టి. ఉషతో సమానం. బస్సు కిటికీ సినిమా స్క్రీన్. భాగ్యనగరపు పడుచు పిల్ల సిగలో మల్లె మొగ్గ. ఎర్రజుత్తు కోడిపుంజు. పొలాల్లో నాట్లేసుకుంట పల్లె పడుచులు పాడే జానపద జావళీ బస్సు ప్రయాణం. ఇట్లాంటి ఎర్రబస్సులో కవి ఎక్కి కూర్చుంటే ఆ ప్రయాణమెలా సాగుతుందో చూద్దాం. –

"నేను కూర్చున్నానో లేదో/ బస్సు పి.టి. ఉషలా పరుగెత్తడం మొదలెట్టింది/ బస్సు కిటికీ సినిమా పరదా అయి/ చలన చిత్రంలో దృశ్యాలు చూస్తున్నట్లుగా ఉంది/ ట్రాఫిక్ పోలీసు నిర్బంధాల్ని వదిలించుకొని/ మా బస్సు భూమితల్లి పరిచిన/ పచ్చగడ్డి తివాచీ మీద పరుగెడుతూనే ఉంది/ ఊళ్ళమీద బస్సు నిలబడ్డప్పుడల్లా ఎర్రజుత్తు కోడిపుంజులా ఉంటుంది/ బస్సు కిటికీ నుండి చూస్తున్నప్పుడల్లా/ దృశ్యాలు మారుతూనే ఉంటాయి/ కొమ్మ నుంచి కొమ్మకు దూకే కోతిపిల్లలా/ ఊరు విడిచి ఊరు దాటేస్తూనే ఉంది/"

–టి. కృష్ణమూర్తి యాదవ్

బస్సులో కూర్చుంటే ఈ కవికి ఉయ్యాల్లో ఊగుతున్నట్లుగా వుంటుంది. కడుపులో బిడ్డల్ని మోసే నిండు చూలాలు బస్సు. అందర్నీ ఆప్యాయంగా అక్కున జేర్చుకొని ఆదరించే తల్లి ప్రేమే బస్సంటే. దేశంలో ఎక్కడ ఏ తప్పిదం జరిగినా ముందుగా బలైపోయే అత్తింటి నిస్సహాయ కోడలే బస్సు.

"బస్సులో కూర్చుంటే/ ఉయ్యాల్లో ఊగుతున్నట్టు వుంటుంది/ బస్సులో నిల్చుంటే/ రాత్రంతా జాగారం చేసినట్లు తూగు/ ఉదయం లేచింది లగాయితూ/ రాత్రి పడుకునే వరకూ/ అలా నెమరేస్తూ పాలిస్తూ వుండే/ గేదేకదా బస్సు/ ఎన్నిచేతులో కలిసి కట్టిన/ ఎందరో ఊగటానికి వీలైన/ ఊయలకదా బస్సు/ కడుపులో బిడ్డల్ని మోస్తూ/ అప్పుడప్పుడు... అక్కడక్కడా/ ప్రసవిస్తూ/ నిండు గర్భిణికదా బస్సు/ బస్సు కొందరిని పిలిచి/ పీటవేసి కూర్చో బెడుతుంది/ అవసరాల కట్టెల మోపు నెత్తిన పెట్టుకునే/ కొందరిని అలా చెట్లలా/ నిలబెట్టే వుంచుతుంది/"

– మాధవీసనారా

బస్సంటే ఒక ఆత్మీయుని రాక. ఒక తల్లి కోడిపిల్లల కోసం ఎదురుచూపు. ధనిక, పేద, వృద్ధుల, వికలాంగుల అందరి పట్లా సమానమైన ఆప్యాయత. అందర్నీ ప్రేమతో అలా పెనవేసుకొని మానవత్వానికి జీవం పోస్తుంది.

''మా ఊరి బస్సు వస్తే చాలు/ ఒక ఆత్మీయుని రాకలాగుంటుంది/ ఆప్యాయ పూరిత ఆనందాన్నిస్తుంది./ నిరీక్షణలో గడిపే క్షణాలన్నీ/ ఒక్కసారే మటుమాయమవుతాయి/ దాని రాక కొంచెం ఆలస్యమైతే/ తల్లి కోడి కనిపించకపోతే/ పిల్లలన్నీ తల్లడిల్లినట్లే/ క్షణంలో కలకలం రేగుతుంది/ బస్సులో కూర్చొని పయనిస్తుంటే/ తల్లి కోతి రెక్కల క్రింద దాగిన/ పిల్లల్ని గద్దవాటు నుంచి రక్షించినట్లే/ సంపూర్ణ రక్షణనిస్తుంది/ పేదోళ్ళను దింపేయదు/ గొప్పోళ్ళను చంకనేసుకోదు/ వికలాంగులపై చికాకు లేదు/ వృద్ధులను చీదరించుకోదు/ రోగులను అసహ్యించుకోదు/ మానవీయ దినచర్యలో నిత్యం/ అందర్నీ ప్రేమతో పెనవేసుకొని/ మానవత్వానికి జీవం పోస్తుంది!"

– కనపర్తి రాజశేఖరమ్

ఇలా కవులందరూ బస్సు ప్రయాణంలో కూర్చున్న సీటు నుండే ఊహల్లోనే ప్రయాణం చేస్తారు. ఆప్రయాణంలోనే ప్రాపంచిక విలువల్ని కవిత్వంతో జోడించి దృశ్యమానం చేస్తారు. ఆర్టీసి పట్ల ఆపేక్ష. ఎర్రబస్సుపైన ఎనలేని అభిమానం చూపుతుంటారు. గ్లోబలైజేషన్ వికృతరూపం ఆర్టీసిని మింగేస్తుందేమోనని ఆందోళన చెందుతారు. ఆందోళనకారులు, విధ్వంసకారులు ఎర్రబస్సులను ధ్వంసం చేయడమంటే మనల్ని మనం తగులబెట్టుకోవడమేనని దుఃఖిస్తారు. పల్లెటూరి సుఖ జీవన తరంగాల్ని, పట్టణాల నాగరికతల్ని, జీవనయానంలో కళ్ళముందు నిలుపుతుంది ఈ కవుల బస్సు ప్రయాణం. ■



October 2009_30_09_2009_4.pmd 21 10/1/2002, 8:42 PM

◆ కథ

# స్మోక్‌లెస్ కోల్

పొన్నాల బాలయ్య



***మధ్యాహ్న భోజన సమయం. విద్యార్థులంతా ప్లేట్లు పట్టుకుని లైన్‌గా నిలబడి వున్నారు. అన్నం తెచ్చుకుని ఒక్కరి తర్వాత మరొకరు వరండాపై కూర్చుంటున్నారు. అందరికి అన్నం వడ్డించేదాక విద్యార్థుల్ని లైన్‌లో పెట్టే పి.ఇ.టి. గారికి సహాయకంగా మధ్యాహ్న భోజనాన్ని పర్యవేక్షిస్తున్నాడు హెచ్.ఎం.ప్రకాశ్.***

అప్పటికే అతని గురించి ఆ ఊరి డీలర్ సుధాకర్ పది నిమిషాల నుండి ఎదురు చూస్తున్నాడు. బియ్యం లెక్కల్లో ఏదో తేడా వచ్చిందని పెద్దసారుతో మాట్లాడి లెక్క చెప్పుదామని వచ్చిన సారు అంటూ "హెచ్.ఎం. ఏడి" అని అడిగిండు? "అక్కడ మధ్యాహ్న భోజనం వడ్డించే దగ్గర ఉన్నాడు... కొంచెం ఆగండి వస్తాడు" అన్నాడు స్టాఫ్‌లో ఒక సారు. ఓ ప్లాస్టిక్ కుర్చీ గుంజుకుని కూర్చున్నాడు డీలర్ సుధాకర్.

సార్లంత తమ బ్యాగులో నుండి టిఫిన్ బాక్సులు తీసి, కాళ్లు, చేతులు ముఖం కడుక్కుని తినటానికి కూర్చున్నారు. అందరు కలిసి తినే అలవాటు వాళ్లది. అప్పటిదాకా క్లాసులో వొర్రీ వొర్రీ ఆకలైతాంది. పొద్దుగాళ్ల తినబుద్ధిగాదు. ఆదర బాదరా ఇంటి నుండి బస్ స్టాండ్‌కు రావాలె. బస్సు మిస్ అయితే ఆ రోజు బడికి వచ్చుడు కష్టమే. ఒక్కొక్కసారి ఇంట్ల వంటే కాదు... అయినా పిల్లల్ని స్కూళ్లో తోలి రావాలి. ఆగమాగం బడికి ఉరికొచ్చుడేనాయె. కడుపులో ఆకలి మండుతాంది. గప్పుడే వచ్చి ఆఫీసులో కూసున్న డీలర్‌ను చూస్తాంటె అందరికీ కోపం వస్తుంది. అరే! ఈ పెద్దమనిషికి గీ విషయం కూడా తెలువదా! పాపం సార్లు అన్నం తింటరు కావచ్చు తరువాత వచ్చి మాట్లాడుతా అని అనుకుంట లేడు. "ఈ ఆఫీస్ రూమేమో చిన్నదాయె ఇండ్లనే ల్యాబ్, లైబ్రరీ, కంప్యూటర్ ల్యాబ్, స్టాఫ్ రూం,"జానెడింట్ల మూరెడు కట్టె లెక్క" అన్నీ ఇండ్లనేనాయె. పదిమంది సార్లాయె. ఒక్కలెక్కువైనా ఇంకొకరు నిలబడవలసిందేనాయె. అసలు క్లాసు రూంలే సరిపోయేన్ని లేక పిల్లలు చెట్ల కింద కూసుండి సదువుడాయె. గత సంవత్సరమే సక్సెస్ స్కూలు అయింది. ఆరు ఏడు తరగతులు ఇంగ్లీష్ మీడియం ప్రారంభమైనయ్. మూత్రశాలలు లేక ఇబ్బందేనాయె. మంచినిళ్లు లెక పిల్లల బోరింగ్ కాడ ఈగల్లెక్క గుమిగూడుడాయె. కడుపుల పేగులు గుర్రున ఒర్రినట్లు ఆలోచనలు తిరుగుతున్నయ్ హిందీ పండిట్‌కు. కుండబద్దలు కొట్టినట్టు మాట్లాడుడే ఎరుకాయె. కానీ డీలర్‌ను ఏమనాలో అర్థమైతలేదు స్టాఫ్‌కి. ఆకలి మాత్రం జోరుగైతంది. పావుగంటాయె బెల్లాయి. ఇగ ఆగే ఓపిక లేదు. బువ్వ తినాల్సిందే అని తలోదిక్కు మనసులో గులుగుకుంటాండ్రు.

సారీ సార్లు లేటైంది. పిఇటి, హెచ్ఎం చేతులు కడుక్కుని లోపటికి వచ్చిండ్రు. తమ కుర్చీ మీద కూర్చున్నడు హెచ్.ఎం. కానీ పిఇటి నిలబడే ఉన్నాడు. వారి మాటలతో ఆలోచనల నుండి బయటపడ్డాడు. హిందీ పండిట్. పక్క క్లాసు రూం నుండి ఒక కుర్చీ తెప్పించుకుని కొంచెం స్థలంలో సర్దుకుని కూర్చున్నడు పిఇటి. "ఈ డీలర్ ఇగ పోయేటట్లు లేడు" అని కలుగజేసుకుని సార్ మేం అన్నం తింటం. తిన్నంక మీ లెక్కలు చూసుకోండ్రి ప్లీజ్ ! ఇప్పుడు ఆ బాగోతం పెట్టకండ్రి... అన్నడు హిందీ పండిట్. ఎప్పట్నుంచో ఎద్దు నెమరేసినట్టు గుట్కేసుకుని తొర్రిపండ్లతోటి ఒక్కటే నములుడు డీలర్. తెల్ల ఎంటికెలు ఎరిజ లెక్క ఎర్రగ పెద్ద కండ్లు. లుంగీ,నిండు చేతుల అంగీ తొడుక్కుని జేబుల ఆర్.ఓ.ఆర్ స్లిప్‌లు పెటుకొని వచ్చిండు డీలర్.

అతని పోరు పడలేక హెచ్.ఎం. 'సరే! సార్ మీరు చెప్పుండ్రి నేను లెక్క చూస్త" అని డీలర్‌తో చెప్పి "మీరు అందరు తినండి సార్ " తన ఆకలిని ఆపుకుంటూ బంకపీసు లెక్కపట్టుకు కూర్చున్న డీలర్ వైపు తిరిగి "చెప్పు చెప్పు ఏ నెల ఎన్ని బియ్యం వచ్చినయి. మా స్కూల్‌కు ఎన్నిచ్చిండ్రు. ఇగో ఎం.ఆర్.సి. నుంచి ఒక లెటర్ పంపిండు. మన



October 2009_30_09_2009_4.pmd 22 10/1/2002, 8:42 PM

స్కూళ్ల ఇంకా 7 క్వింటాళ్ల బియ్యం మిగిలి వున్నయట. రేపు పొద్దుగాళ్లకు పెడుదామంటే చారెడు బియ్యం లేవు. అందుకే మిమ్మల్ని పిలిపించిన అన్నడు హెచ్.ఎం. వాళ్లిద్దరు లెక్కజూసుకుంటున్నరు. సార్లంత భోజనాలు చేస్తుంగ్రు. అంతల్నే సుధాకర్ గుట్క తినుడు అయిపోయింది. కుంటు కుంట కుంటు కుంట బయటకు పోయి ఊంచొచ్చిండు. నోరు పండినట్టు ఎర్రగ ఉంది. పెదవులు పగిలి తెల్లగా పక్కపొంటి సొల్లున్నది. కాళ్లు చేతులకు గుడ్డేలుగుకున్నట్లు పెయ్యన్ని రోమాలు, తాట మొద్దోలె ఆజానుబాహుడు. గుట్క వాసన రూమంతా ఇసురుతంది. 60 ఏండ్ల పైననే ఉంటాడు సార్ల మాటలను బట్టి అర్థం చేసుకున్నడు డీలర్. నేను కూడా మీ లెక్క చదువుకున్నోన్నే సారు. ఈ స్కూళ్ల రిటైరైన తెలుగు సారు నేను క్లాసుమేట్లమే. నేను ఇంటర్ సదివిన. నాతోని సదివినోళ్లందరికీ నౌకర్లచ్చినయి. ఒక నాకే రాలే అన్నడు డీలర్. సార్లు ఎవ్వల పనిల వాళ్లే ఉన్నరు. కానీ ఉత్సాహవంతులైన హిందీ సారు అతని దిక్కు తిరిగి "అవ్ సారు" ఆ కాలంల హెచ్.ఎస్.సి చదివినోళ్లందరికీ నౌకర్లచ్చినయ. మరి నీకెందుకు రాలే? అనంగనే హెచ్ఎంను వదిలిపెట్టి హిందీ పండిట్ దిక్కు తిరిగి తన కథ చెపుతాండు డీలర్ సుధాకర్.



నేను ఇంటర్ చదువుకునే రోజుల్లో కరీంనగర్‌లో మీ తెలుగు సారునేను ఒక్క రూములోనే కిరాయిన్నం. 'నాజీవితాన్ని నేనే పాడు చేసుకున్న" మా రూం పక్కకే జగన్‌రెడ్డి, గాల్‌రెడ్డి, సత్యనారాయణ రావుల రూం ఉండేది. వాళ్లతోనాకు దోస్తి అయింది. జగ్గారెడ్డి లారీ ఓనర్. అతనికి రెండు మూడు లారీలుండె. రామగుండం నుంచి బొగ్గు దెచ్చి బట్టి పెట్టి హైదరాబాద్‌లో అమ్మేది. ఆ కాలంలోనే మస్తు సంపాయించేది. వాళ్లు నాకంటే వయసుల దాదాపు పదేండ్లు పెద్దోళ్లు. పెండ్లిళ్లయినయ్. గతాన్ని పూసగుచ్చినట్లు జెపుతాండు సుధాకర్. పండితుని అన్నం దినుడు అయిపోయింది. ఎంగిలి చెయ్యి కడగకుండానే పూర్తిగా లీనమై వింటాండు. నేను వాళ్లతోని దోస్తీ జేసుకుంట జగ్గారెడ్డి దగ్గర గుమస్తాగా పనిచేస్తున్న. రామగుండం నుండి లారీల బొగ్గు దేవాలె. భూమి నుండి దీసిన బొగ్గు ఎక్కువ పొగస్తది. దాన్ని కరీంనగర్‌లో బట్టిపెట్టి సల్లారినంక, హైదరాబాద్ ఫ్యాక్టరీలకు పంపించేది. లారీ కిరాయి లేబర్ ఛార్జి పోంగ నాలుగైదు వేల రూపాయలు మిగిలేది. ఇంత బొగ్గు దీసి అంత మందం వజనచ్చెటట్టు నీళ్లు పోసేది. అట్ల రోజుకు నాలుగైదు వందల రూపాయలు సంపాయించేది. తినంగ, తాగంగ నెలకు పదివేల కంటే ఎక్కువనే సంపాయించేది. అప్పుడు నౌకరిగాళ్లకు మా అంటె వెయ్యి రూపాయలు జీతం వచ్చుడే ఎక్కువాయె! ఏడాదిలోనే లక్ష రూపాయలకు ఎక్కువ సంపాదించిన. చేతినిండ పైసలాయె, కడుపునిండ తినుడు, తాగుడు కాళ్లు రెక్కలు నొయ్యకుండా "కంకెడు దొరికతే చాలు" కడుపుల చల్లకదలకుండ సులువుగా సంపాయించుడు నాకు నచ్చింది. మొత్తం సదువు బంజేసిన. సంపాదనకు ఎగవడ్డ. మంచి సంబంధం దొరికింది. పెండ్లయింది. నా భార్య లక్ష్మి నాకు తగ్గది. ఎన్నడు నాకు ఎదురు జెప్పలే. మిత్రుల సహాయంతో మెల్లగా ఒక సెకండ్ హ్యాండ్ లారీ గొన్న. జగ్గారెడ్డి బొగ్గును హైదరాబాద్ కిరాయి గొట్టేది. బొగ్గుదీసి అమ్ముకుంటే కిరాయి కంటే త్రిబుల్ పైసలొచ్చేది. అట్లట్ల చెయ్యి తిరిగింది. గాల్‌రెడ్డి ఒకనాడు సుధాకర్ ఎన్ని రోజులిట్లుంటవు. నువ్వుగూడ సింగరేణి నుండి బొగ్గు బట్టికి లైసెన్స్‌దెచ్చుకో. బొగ్గుబట్టి పెట్టి అమ్ముకో అన్నడు.... నీ కాళ్ల మీద నీవు బతుకు... లైసెన్స్ సంపాదించుకున్న.

అప్పట్నుంచీ నాకు ఎదురే లేదు. నల్ల బంగారాన్ని నమ్ముకుని "నాలుగు బొగ్గు రవ్వలు ఎనిమిది రూపాయలు"గా సాగుతుంది. ఇద్దరు ఆడపిల్లలు అముడాల పుట్టింగ్రు. పేరుకు మాత్రమే మా ఊల్లె బొగ్గుబట్టి. కానీ నేను కరీంనగర్‌లోనే రామగుండం బైపాస్ రోడ్డు మానేరు నది ఒడ్డున చౌరస్తా పక్కకు నాలుగు గుంటల భూమి కొన్న. అక్కన్నే బట్టి పెట్టేది. ఊళ్లె ఇళ్లు గట్టిన నాలుగెకరాల పొలం గొన్న. అయ్య, అవ్వ జీతగాళ్లను బెట్టి వ్యవసాయం చేపిస్తాంగ్రు.

"ఇంక నీకు నౌకరెందుకే అన్నడు తన పని మరిచిపోయి హెచ్ఎం ప్రకాశ్". సార్లంతా అబ్బా! ఈ లెక్కన నీవు చాలా సంపాయించుంటవు. పైసలన్ని ఏడ దాచినవ్. కరీంనగర్‌లుండక ఈ ఊర్లె ఎందుకుంటన్నవు అని ఇంట్రస్టుగా అడిగింగ్రు సార్లు. గప్పుడే నా జీవితంలో "చెప్పుకుంటే మానం బాయె, చెప్పకపోతే పానం బోయే" సంఘటన జరిగింది.

అదేందో తెలుసుకోవాలని ఉబలాటంతో అడుగుతుంగ్రు సార్లు. హైదరాబాద్‌లో నా మిత్రులు జగ్గారెడ్డి, గాల్‌రెడ్డి, సత్యనారాయణరావులు తలో ... ఫ్యాక్టరీ పెట్టి స్థిరపడ్డారు. నేను ఆ దేవుని దయ వల్ల కరీంనగర్‌ల ఇళ్లు మొదలుపెట్టిన. బేసిమీట్ లేపి కడప పెట్టేనాడు ధూంధాం పండుగ చేసిన. అప్పటికి నాకు నలుగురు ఆడబిడ్డలే పుట్టింగ్రు.

నెలకొకసారి పట్నం పోయి ఫ్యాక్టరీల పైసలు వసూలు చేసుకుని మళ్ల ఆర్డర్లు తెచ్చుకునేటానికి పోయేది. నాలుగైదురోజులు లాడ్జింగ్‌లోకిరాయి తీసుకుని తాగుడు తినుడు ఎంజాయ్ చేసేది. రాత్రి ఆడపోరీలతో లత్‌కోర్ పనులు చేసేది. మా నలుగురం మిత్రులం ఆర్థికపరంగా ఒకలకొకలం సాయం చేసుకునేది. ఒకరోజు బొగ్గు బట్టికి పచ్చిమన్ను పూసి ఇటుక కాల్చినట్టు అంటుపెట్టి వారం పది రోజులకు సట్టన సల్లారినంక బట్టిప్పి లారీ లోడ్ చేస్తున్నప్పుడు మోహనరావ్ అనే వ్యక్తి వచ్చి పరిచయం చేసుకున్నడు. హైదరాబాద్‌లో నీ మిత్రుడు గాల్‌రెడ్డి గట్ల నీ దగ్గరకు పొమ్మన్నరు. అందుకే వచ్చిన అన్నడు. మిత్రుల పేరు చెప్పంగనే సకల మర్యాదలు చేసిండు, మందు తాక్కుంట మాట ముచ్చట మాట్లాడుకుంటన్నం.

సూడు సుధాకరన్నా ! పదివేల రూపాయలు నీవు ఇస్తే నీకు ముప్పయి వేలు ఇస్త అన్నడు.



October 2009_30_09_2009_4.pmd 23 10/1/2002, 8:42 PM

అదేంది ! ఇదేం బిజినెస్ ! చాలా లాభం ఉన్నట్టుందే అని ఆశ్చర్యంగా అడిగిండు సుధాకర్. మోహన్‌రావు ‘దొంగనోట్ల బిజినెస్” సుధాకర్ గుండెల రాయేసినట్టయింది. వామ్మో దొంగనోట్లా? ఎన్నో లత్కోర్ పనులు జేసిన! కానీ చట్టవ్యతిరేక పనులు ఎన్నడు జెయ్యలే సుధాకర్. దొరుకుతెట్ల ఇజ్జత్‌పోదు! మానం పోదు! తలెత్తుకోని ఎట్ల తిరిగేది! పరిపరి విధాలుగా మనసులో ఆలోచనలు పోటెత్తుతున్నయ్. నీకేం భయం లేదు. నేనుచూసుకుంటా! నువ్వు వాటిని నీ బిజినెస్‌ల సగం కలిపి చెలామణి చేస్తే అయిపాయె అనే మోహనరావు మాటలతో సోయిలకచ్చిండు సుధాకర్... సరే చూద్దాం. తరువాత కలువ్ అన్నాడు సుధాకర్. లేదు లేదు నేను మళ్లీ రాన్ ‘లక్ష్మి రాంగ మోకాలడ్డు బెడుతవా! అదృష్టం ఒక్కసారే వస్తది! మళ్లీ మళ్లీ రాదు’ సక్కని అవకాశం ఆలోచించిన ఆశాభంగం. మాటల గారడితో ఒప్పించ్చిండు. అవ్వో ఇవ్వో పదివేలు చేసి అయిష్టంగానే ఇచ్చేటప్పుడు మిత్రులకు ఫోన్ జేసినంకనే పైసలిచ్చిండు సుధాకర్. మరి ఎప్పుడు తెచ్చిస్తవు పైసలు.



వారం రోజుల వరకు తెచ్చిచ్చిపోత... నువ్వేం బెంగపెట్టుకోకు. ఒక్కసారి నన్ను నమ్ము అనుకుంట బుర్రున కారెక్కి వెళ్లిపోయాడు మోహనరావు. అన్నమాట ప్రకారం వారం కంటే ముందే ముప్పయి వేల రూపాయలు తెచ్చిచ్చిండు మోహనరావు. నమ్మశక్యంగా లేదు. పదివేలకు ముప్పయి వేలు.. అబ్బా! ఒరిజినల్ నోట్‌కు వీటికి తేడానే తెలుస్తలేదు! అబ్బ నీది ఏం తెలివిరా మోహనరావు! అతని బుద్ధిని మరీ మరీ మనసుల కీర్తిస్తున్నడు సుధాకర్.... సరే ! వీటిని వినియోగంలోకి తెద్దాం... వైన్స్‌కు పోయి బీర్లు కొన్నడు... అసలు వానికి అనుమానమే రాలేదు. సుధాకర్‌కు ఆత్మవిశ్వాసం పెరిగింది. చూస్తుండగానే మొత్తం ముప్పయి వేలు చలామణి చేసిండు. “నీ అవ్వ.... గీ బొగ్గు దందలేమున్నది? అగ్గి కాలి బూడిదే మిగులుతది... ఇన్నేండ్లళ్ల ఏం సంపాయించిన. బట్ట పొట్ట.... ఆశలు ఉబికొస్తన్నయి. బిల్డింగ్ కట్టినట్టు, పట్నంల కార్లల్ల తిరిగినట్టు, ఖరీదు బట్టలేసినట్టు, నగలు కొన్నట్టు, నలుగురు బిడ్డలను పెద్ద చదువులు చదివించి మంచి సంబంధాలు చూసి పెండ్లి జేయాలె. అయ్యవ్వ ఆ ముత్తమంత భూమి పట్టుకుని తడ్లాండుతండ్రు. అవ్వయ్యను కూసుండబెట్టిసాదాలె! కోటీశ్వరున్ని కావాలె! ఆశలు మనసులో సుడిగాలోలె తిరుగుతున్నయి. “మనిషి ఆశా జీవి! ఎంతున్నా సరిపోదు! కోరికలకు అంతే లేదు” అత్యాశల సుడిగుండంలో దిగిండు సుధాకర్.

సరిగ్గా పదిహేను రోజులకు మోహనరావు ఫోన్ చేసిండు. మీ మిత్రులు ఒక్కొక్కలు పది లక్షలిచ్చిండ్రు నువ్వు ఇస్తవా అని... పది లక్షలకు ముప్పయి లక్షలు తీసుకో... ఒక్కసారి జీవితంల సక్సెస్ అయితే నీ జీవితమంతా కూర్చుని బతకొచ్చు.

నిజమే... ఒక్కసారి సక్సెస్ అయితే జీవితమే మారిపోతుంది. ఇంక కష్టపడే అవసరమే ఉండది....“బూడిదల బొర్రితె ఏం ఫాయిదా! నీ తల్లి కొడితే సింహాన్నే కొట్టాలె”! పడితే పెద్ద పట్టే పట్టాలె! ఆ రాత్రంతా నిద్రపట్టలేదు. తాగిందంతా దిగిపోతుంది. ఎంత తాగినా ఎక్కుత లేదు. అత్యాశ నిద్ర పోనిత్తలేదు సుధాకర్‌కు. తనయి 3 లక్షలు ఊళ్లె అప్పు జేసి మొత్తం 8 లక్షల రూపాయలు జమ చేసి ఇచ్చే ముందు మిత్రులకు ఫోన్ చేసి వాళ్లు ఇచ్చినమంటేనే ఇచ్చిండు.

నిజంగా... ఎక్కువ కులమోల్ల ధైర్యం జూడు, చెడైనా మంచైనా త్యాగం చేస్తరు. అందుకే ఇన్ని ఆస్తిపాస్తులు, భూమి జాగలు సంపాయిస్తరు. ఊళ్లు ఇడిసినా పట్నంలో దొరల్లెక్కనే బతుకుతుండ్రు. మనిషికి ధైర్యం ఉండాలె. ఏదైనా తట్టుకునే గుండె బలముండాలె! పుట్టేది సచ్చేది ఒకేసారి... నీ అవ్వ! ఇప్పుడేం జెస్తనో చూడు... పదివేలకు 30 వేలిచ్చిన విశ్వాసం నమ్మి 8 లక్షలు అప్పనంగా మోహనరావు చేతుల పెట్టిండు. పదిహేను రోజులల్ల పైసలిస్త నువ్వేం భయపడకు...

తుర్రున ఎళ్లిపోయిండు మోహనరావు.

నెలైనా తిరిగిరాలె. మిత్రులు నలుగురు కలిసి వాని జాడ పట్టుకుని గుంటూరు పక్కకు వాని సొంతూరుకు పోయిండ్రు. ఎక్కడ దొరుకలే. అతి కష్టం మీద వాళ్ల అన్నను విజయవాడలో పట్టుకున్నరు. నన్ను అడుగుతే నేనేం చేయాలె.... మీరెమన్న నాకు ఇప్పిచ్చిండ్రా? వానికి నాకు చిన్నప్పటి నుండి సంబంధాలే లేవు! వాడు పెద్ద మోసగాడు! పెండ్లం పిల్లలు ఎవ్వరు లేరు! మందిని ముంచుడే వాని పని! మర్యాదగా ఇక్కడ నుండి వెళ్లకపోతే పోలీసు కంప్లయింట్ చేస్త అని బెదిరించిండు? ఏడాదంతా వెతుకుతనే ఉన్నరు.... బెంగుళూరు, చెన్నయి, ముంబాయి, కలకత్తా, ఢిల్లీ నుంచి పల్లె దాకా తిరిగిండ్రు. సుధాకర్‌కు అప్పులు పెరిగినయ్. అప్పుల బాధకు లారీ, భూమి, ఇళ్లు జాగలు అమ్మి అప్పులు కట్టిండు. “నిండ మునిగినోనికి సలేక్కడిది?”

మిత్రులు ఇగ ఆశ వదులుకుని తమ తమ వ్యాపారాల్లో లీనమైండ్రు. “పలారం కోసం పరిగెత్తి పసిపోరడు పోత్రాయి తగిలి బొక్కబోర్లపడ్డట్లు సుధాకర్ జీవితంల బోర్లపడ్డడు.”

మింగలేక కక్కలేక ఇజ్జత్‌కు ఎవ్వలకు చెప్పుకోలే! పిల్లలు పెళ్లికి ఎదిగిండ్రు. నలుగురు ఆడపిల్లల పెండ్లీలు ఎట్టజేయాలె? ఎట్ల బతుకాలె? అనే దిగులుతో పక్షపాతంతో కుడికాలు, కుడిచేయి పడిపోయినయ్. “అత్యాశల పొగజూరి జీవితం కొర్రాయోలె సుర్రున కాలింది.” “పులిని చూసి నక్క వాత పెట్టుకున్న బతుకైంది” అప్పుడు సుధాకర్ పుట్టినూళ్లకు పోయిండు. అయ్యో! పాపమని డీలర్‌షిప్ ఇప్పించ్చిండ్రు... సిన్నంగ సిన్నంగ నలుగురు బిడ్డల పెండ్లి చేసిండు.... అప్పటికి హెచ్ఎం లెక్కలు సరిచూసిండు. వణుకుతూ వణుకుతూ ఎడమ చేతితో రిజిష్టర్ల సంతకం పెట్టిండు సుధాకర్.

నల్లని మనిషి..... రెండు కండ్లు ఎర్రని స్మోక్‌లెస్ కోల్

■



October 2009_30_09_2009_4.pmd 24 10/1/2002, 8:42 PM

## కవిత

# బ్రతుకు

**దోర్నాదుల సుబ్బమ్మ**



పదాల సమూహం నుండి
పారాణి ఎర్రదనం వరకు...
మెడలో పడ్డ పసుపు తాడుకి ...
సిద్ధాంతాల తోరణాలు చుట్టి
బ్రతుకుల్ని ప్రవాహపు ఎదురీతలో జయించలేక
కాటేస్తుందని తెల్సినా...
కరుణలేని పురుషతత్వాన్ని మెడకు తగిలించుకొని
మోసాన్ని తెల్సుకున్నాక...
జీవితం మిగిల్చిన బూడిద మాత్రమే దక్కుతుంది.
ఎవర్ని ఎవరూ ప్రేమించకుండానే...
ప్రేమ నిండుకొందీ ప్రపంచంలో....
ఆకాశమంత హృదయానికైనా.....
సూదిమొనంత ద్వేషపుగాయం కూల్చివేస్తుంది.
బ్రతుకుదే ముందండీ చిల్లుపడ్డ నావలాంటిది...
జీవితమే గదా మండుతున్న అగ్నిగోళం
అంతా అర్ధమయ్యాక
జీవితం కంటే ప్రియమైంది పోరాటమేగదా... పోరాటాన్ని
మొదలు పెట్టుకున్నాక
సాంప్రదాయపు విషపుకోరలే అడ్డుగోడలై
ఈ లోకాన్ని చూస్తుంటే...
మేనీటర్ తిరుగుతున్న అడవిలావుంది.
మొదలు పెట్టుకున్న విలువల చరిత్ర
ఎక్కడవేసిన గొంగళి అక్కడిలానే వుంది.
పునరావృతం అవుతున్న రాక్షసత్వాన్ని
కళ్ళులేని చట్టపు సిద్ధాంతాలు
మరింత అంధకారంలోనికే నెట్టున్నాయి.
బతుకిప్పుడు భయపెట్టే వెన్నెలయితే
బాల్యపు వయసే పడగ్గదికి నడిచివెళ్తుంది.
జీర్ణించుకోలేని దాన్ని వాంతి చేస్కున్నట్లు
గర్భాలు కూడా వాంతయితే ఎంత బావుణ్ణు
విలువల్ని కాపాడుకుంటున్న వ్యక్తులకి
వంద నమస్కారాలు...
వనితల్ని అమ్ముకుంటున్న వరుళ్ళకి
శతకోటి నమస్కారాలు...
మగాడు ఒక్క విషయం గుర్తించాలి....
ఆడది చంపే సిద్ధాంతాన్ని మొదలుపెట్టాక ...
చివరికి మిగిలేది చావే.

# ఇదేనా నీ నైజం?

**వై.కె.మూర్తి**

ఉదయించే సూరీడు
విరగకాసే వెన్నెల
కరుణించే కారుమేఘం
పరిమళం వెదజల్లేపూవు
వీచే చల్లని గాలి
ఇవన్నీ ప్రకృతి నైజాలు
మృగ్యమైన మానవత్వం
కరుడుగట్టిన కసాయితనం
దహించే ఈర్షాద్వేషాలు
మసిబారిన మమతానురాగాలు
కులమత కుమ్ములాటలు
ఓమనిషీ, ఇదేనా నీ నైజం !



# అలజడి

**అనూరాధ రామకృష్ణ**



నిలువెల్ల
కలుషితమైన మనిషి
పంచభూతాలకు
మూల్యం చెల్లిస్తూ,
గ్రహాలు సైతం అన్వేషిస్తూ
అలజడులు సృష్టిస్తున్నాడు !
జగమంతా ప్లాస్టిక్‌మయం
అభిమానాలు
ఆదరణలు మాయం
పచ్చని భూములన్ని
కాంక్రీట్ వనాలవుతున్నాయి !
రంగుల ప్రకృతి చూసి,
ఆనందించటం
టి.వి లకే పరిమితం !
కల్తీ వాతావరణంలో
వర్షం కూడ
మేఘ మధనమే !
మానవ సంబంధాలు సైతం
ఆర్థిక లావాదేవిలే !
మానవత్వం
సంఘాలకే సరిపోయింది.



October 2009_30_09_2009_4.pmd 25 10/1/2002, 8:42 PM

విశ్లేషణ

# గురజాడ బాటే గురువు జాడగా శ్రీశ్రీ

**డా॥ రాపోలు సుదర్శన్**

*మధురవాణి గురించి చెబుతూ ఆమె ప్రాంతం, వాక్చాతుర్యం చెప్పి "ఆమె వలన కథ సూటిదారిలో ప్రవహిస్తుంది. కథ యెదురు తిరిగితే "చక్రం అడ్డువేయగలిగినంత ధీమా ఆమెకున్నది" అని కన్యాశుల్కం నాటకంలో మధురవాణి పాత్ర ఔన్నత్యాన్ని చెప్పాడు శ్రీశ్రీ. ఈ పాత్ర ఎలాంటిదో సాటి పాత్రల అభిప్రాయాన్ని ఓ దగ్గర పేర్చి "మధురవాణి అంటూ ఒక వేశ్య శిఖామణి యీ కళింగ రాజ్యంలో వుండకపోతే భగవంతుడి సృష్టికి ఎంతలోపం వచ్చి ఉండును? అని కరటక శాస్త్రి అనుమాన పడతాడు. నువ్వు మంచిదానివి. ఎవరో కాలుజారిన సత్పురుషుడి పిల్లవైవుంటావు అని సౌజన్యారావు అభిప్రాయపడతాడు" (మన గురజాడ, పుట-10) ఇలాగే ఇంకా లుబ్ధావధాన్లు, గిరీశం, కరటకశాస్త్రి, రామప్పంతులు మొదలైన పాత్రల అభిప్రాయాల్నీ వివరించాడు శ్రీశ్రీ.*



తెలుగు సాహిత్యాన్ని ప్రక్రియల పరంగా, విషయ పరంగా కందుకూరి వీరేశలింగం; భాషా పరంగా గిడుగు రామ్మూర్తి ఆధునికం వైపుకు కృషిచేస్తుండగా వీరిద్దరి లక్షణాలకి రూపుకట్టిన రచనలు చేయనారంభించాడు గురజాడ అప్పారావు. గానయోగ్యమైన దేశిఛందం 'ముత్యాలసరం' సృష్టించి దేశభక్తి, తోకచుక్క, పూర్ణమ్మ వంటి కవితా ఖండికల్ని అల్లి రూప, భావాల పరంగా కవిత్వాన్ని ఆధునికం వైపు తిప్పాడు గురజాడ. వచనంలో సాంఘిక ఇతివృత్తంతో పాత్రోచిత మాండలిక భాషను వాడి 'కన్యాశుల్కం' నాటకాన్ని రాసి తెలుగులో మొట్టమొదటి సాంఘిక నాటకకర్త అయ్యాడు. 'దిద్దుబాటు' కథా రచనతో తెలుగు సాహిత్యంలోకి కథానికా ప్రక్రియను ప్రవేశపెట్టిన వాడయ్యాడు. ఇలా తన రచనలతో తెలుగు సాహిత్యాన్ని 'ఆధునికం' వైపు దారి మళ్ళించాడు గురజాడ.

ఈ దారిని తన రచనల ద్వారా మరింత వెడల్పు చేసి, విస్తృతపరచిన మహాకవి శ్రీశ్రీ, గురజాడ రచనలకు ముగ్ధుడయ్యాడు. అందుకే తన దృష్టిలో తెలుగు సాహిత్యంలో కవిత్రయంగా తిక్కన, వేమనలతో పాటుగా గురజాడనూ పేర్కొన్నాడు. సందర్భం వచ్చినప్పుడల్లా గురజాడ వైశిష్ట్యాన్ని ఉగ్గడించాడు. రచనల్ని ఉటంకించి చూపాడు. ప్రత్యేకించి గురజాడ రచనలపై పదిహేను వ్యాసాల్ని రాశాడు. గురజాడను ఉటంకిస్తూ అరడజనుకు పైగా కవితల్నీ రాశాడు శ్రీశ్రీ. దీన్ని బట్టే తెలుస్తుంది గురజాడ అన్నా ఆయన రచనలన్నా శ్రీశ్రీకి ఎంత వల్లమాలిన ప్రేమో. ఇటువంటి శ్రీశ్రీ- గురజాడపై చేసిన రచనలను, వెలుబుచ్చిన అభిప్రాయాల్ని తెలుపడమే ఈ వ్యాస పరిధి.

వీరసింహ విజయసింహ, పరిణయ రహస్యం(1924) వంటి నవలలు రాసి కథాత్మక వచన సృజనకారుడుగా, ప్రభవ(1928) పేరుతో తన కవితా సంకలనాన్ని ముద్రించి కవిగా లబ్ధప్రతిష్ఠుడైన శ్రీరంగం శ్రీనివాసరావు కథేతర వచన రచన (Non fictional prose) ల్లో 'కన్యాశుల్కములో స్త్రీ వ్యక్తులు' (1932) శీర్షికతో రాసిన రచనతో వ్యాస ప్రక్రియలో రచనలు చేయనారంభించాడు శ్రీశ్రీ. కేవలం కన్యాశుల్కంపై ఆరు వ్యాసాల్ని వెలయించాడు. దీన్నిబట్టే శ్రీశ్రీకి కన్యాశుల్కం అంటే ఎంత అభిమానమో తెలుస్తుంది. అందుకే "... తెలుగు భాషలో ప్రథమ శ్రేణిని నిలిచే పది పుస్తకాలలో కన్యాశుల్కానికి నేను ప్రథమ స్థానం ఇస్తాను. ప్రపంచపు నూరు పుస్తకాలలో కన్యాశుల్కం ఒకటి" (మన గురజాడ, పుట 47) అనగలిగాడు. అటువంటి కన్యాశుల్కంపై శ్రీశ్రీ రాసిన ఒక్కొక్క రచన చూద్దాం.

కన్యాశుల్కములో స్త్రీ వ్యక్తులు :

ఇది సమదర్శిని ఉగాది సంచిక 1932లో ముద్రితమైంది. గురజాడ రాసిన 'కన్యాశుల్కము' నాటికలోని మధురవాణి, వెంకమ్మ, బుచ్చమ్మ, మీనాక్షి, పూటకుళ్ళమ్మ, యోగిని ఈ ఆరు స్త్రీ పాత్రలు గురించి శ్రీశ్రీ ఇందులో వివరించాడు. మొదట మధురవాణి గురించి చెబుతూ ఆమె ప్రాంతం, వాక్చాతుర్యం చెప్పి "ఆమె వలన కథ సూటిదారిలో ప్రవహిస్తుంది. కథ యెదురు తిరిగితే "చక్రం అడ్డువేయగలిగినంత ధీమా ఆమెకున్నది" (మన గురజాడ, పుట-11) అని కన్యాశుల్కం నాటకంలో మధురవాణి పాత్ర ఔన్నత్యాన్ని చెప్పాడు శ్రీశ్రీ. ఈ పాత్ర ఎలాంటిదో సాటి పాత్రల అభిప్రాయాన్ని ఓ దగ్గర



October 2009_30_09_2009_4.pmd 26 10/1/2002, 8:42 PM

పేర్చి “మధురవాణి అంటూ ఒక వేశ్య శిఖామణి యీ కళింగ రాజ్యంలో వుండకపోతే భగవంతుడి సృష్టికి ఎంతలోపం వచ్చి ఉండును? అని కరటక శాస్త్రి అనుమాన పడతాడు. నువ్వు మంచిదానివి. ఎవరో కాలుజారిన సత్పురుషుడి పిల్లవైవుంటావు అని సౌజన్యారావు అభిప్రాయపడతాడు” (మన గురజాడ, పుట–10) ఇలాగే ఇంకా లుబ్ధావధాన్లు, గిరీశం, కరటకశాస్త్రి, రామప్పంతులు మొదలైన పాత్రల అభిప్రాయాల్నీ వివరించాడు శ్రీశ్రీ.

మరో స్త్రీ పాత్ర వెంకమ్మ గురించి శ్రీశ్రీ చెబుతూ వెంకటేశం రాగానే ఆదరించిన తీరును, అన్ఫార్చునేట్ ‘బ్యూటిఫుల్ యంగ్విడో’గా గిరీశంతో అనిపించుకున్న బుచమ్మ అమాయకత్వం, నాటి వ్యవస్థ “వితంతువులలో విధిలేక పాడయిపోయిన స్త్రీ వ్యక్తిని సూచిస్తు”న్నట్లుగా (మన గురజాడ, పుట–13) మీనాక్షి, ఇంకో స్త్రీ పాత్ర చీపురుకట్ట సరసంతో పూటకుళ్ళమ్మ పండించిన హాస్యాన్ని చెప్పి చివరగా యోగిని పాత్రను వివరించాడు శ్రీశ్రీ. ఇలా ఈ కన్యాశుల్కం నాటకంలోని ప్రధాన స్త్రీ పాత్రల్ని ఈ వ్యాసంలో తెలిపాడు శ్రీశ్రీ.

**కన్యాశుల్కం’ మీద :**

‘‘జీవితంలో ఏ సందర్భానికైనా సరిపోయే మాటలు ఎక్కడో ఒకచోట గురజాడ మహాకవిలో దొరకుతాయి” (మన గురజాడ, పుట – 35) అంటూ దృష్టాంతంగా కన్యాశుల్కంలోంచి ఉటంకించి చూపాడు శ్రీశ్రీ. మన జీవితాల్లో కనిపించే దాదాపు అన్ని సంఘటనలు, పాత్రలు ఈ నాటకంలో ఉన్నాయని తెల్పి ‘మృచ్ఛకటికం’ అంత గొప్ప నాటికగా అభివర్ణించాడు కన్యాశుల్కాన్ని శ్రీశ్రీ ఈ వ్యాసంలో.

**సెల్యులాయిడ్‌లో ‘కన్యాశుల్కం’ :**

‘కన్యాశుల్కం’ నాటికను సినిమాగా తీయబోతున్నట్లు వార్తలు విన్న శ్రీశ్రీ ఈ వ్యాసాన్ని రాశాడు. ఈ సినిమా వల్ల నిర్మాతకు నష్టమేగానీ లాభం రాదని శ్రీశ్రీ భావించాడు. కన్యాశుల్కాన్ని సినిమాగా తీయడానికి అనుకూలం కాదన్నవారి వాదాన్ని వ్యతిరేకించాడు శ్రీశ్రీ. ఈ నాటకంలోని “గిరీశం, రామప్పంతులు, లుబ్ధావధాన్లు మొదలైన వారు నవ్వు పుట్టించేటట్లు మాటలాడే ట్రాజిక్ హీరోలు” (మన గురజాడ పుట –39) అన్న వాక్యం చదివినప్పుడు రావిశాస్త్రి రాసిన ‘ఆరుసారాకథలు’కు శ్రీశ్రీ రాసిన పీఠికలో చెప్పిన ‘రసన’ అనే ఒక కొత్త రస సిద్ధాంతం జ్ఞాపకమొస్తుంది. అదేమిటంటే ఒక రచనకానీ, ఒక చిత్రపటం కానీ, సినిమాల్లో నటనగానీ ఆస్వాదిస్తున్నప్పుడు ఏకకాలంలో నవ్వు, ఏడుపు వంటి భిన్నరసాలు ఏకకాలంలో మనలో ఉత్పన్నం చేస్తాయని శ్రీశ్రీ చెప్పిదానికి ఉదాహరణగా గురజాడ, చార్లెస్ డికెన్స్ రచనలను, పికాసో చిత్రించిన ‘గుయెర్నికా’ చిత్రం, ప్రముఖ హాస్యనటుడు చార్లీచాప్లిన్ నటన ఇవన్నీ పేర్కొన్నాడు శ్రీశ్రీ. (ఇది సోదాహరణంగా ఈ వ్యాస రచయిత శ్రీశ్రీ పీఠికలు పరిశీలన’ గ్రంథంలో వివరించాడు.)

గతంలో షేక్స్పియర్ నాటకాన్ని సినిమాగా తీసిన అంశాల్నీ ఈ చిన్న వ్యాసంలో వివరించాడు శ్రీశ్రీ.

**ఒక కావ్య నాయిక :**

‘కన్యాశుల్కంలో స్త్రీ వ్యక్తులు’ పేరుతో రాసిన వ్యాసంలో మిగతా స్త్రీపాత్రలతో పాటు ప్రధానంగా ‘మధురవాణి’ పాత్రనే వివరించినప్పటికి శ్రీశ్రీకి తృప్తి కలుగక కేవలం ‘మధురవాణి’ పాత్రనే వివరించడానికి ‘ఒక కావ్య నాయిక’ శీర్షికతో 1947లో ఈవ్యాసాన్ని రాశాడు శ్రీశ్రీ. ఇది చిన్న వ్యాసమే అయినా, దీన్ని చదివిన తర్వాత భారతీయ, ప్రపంచ ప్రసిద్ధ కావ్యనాయికలు, వారి తీరు, వారందరిలో మధురవాణి మహత్తు మన మనస్సుకు హత్తుకునే రీతితో సోపత్తికంగా శ్రీశ్రీ వివరించిన తీరుకు ముగ్ధులంకాక తప్పదు గాక తప్పదు. కవికుల గురువైన మహాకవి కాళిదాసు ‘విక్రమోర్వశీయం’ నాటకంలోని దేవవేశ్య అయిన కథానాయిక ఊర్వశి, స్వకపోలకల్పనల కంటే నిజజీవితానికి అతిదగ్గరుండే ‘మృచ్ఛకటికం’ నాటకంలోని మానవ వేశ్య అయిన కథానాయిక వసంతసేన, షేక్స్పియర్ రాసిన ‘యాంటోని అండ్ క్లియోపాత్రా’ అనే నాటకంలోని కథానాయిక మహా అందగత్తెనే గానీ వేశ్యకాదు, అలాగే సుప్రసిద్ధ గ్రీకు నాటకకర్త సోఫోక్లిస్ నాటకాల్లోని నాయకలూ వేశ్యలుగాక రాజకుటుంబీకులైన కథానాయికలు, చింతామణి (కాళ్ళకూరి నారాయణరావు) నాటకంలోని కథానిక అయిన వేశ్య చింతామణి విప్రనారాయణ (పానుగంటి లక్ష్మీనరసింహారావు) నాటకంలోని కథానాయిక దేవదేవి వేశ్యే వీరందరితోపాటు రాధికా సాంత్వనము (ముద్దుపళని) కావ్యం, థాయిస్ (అనటోల్‌ఫ్రాన్స్), ఆఫ్రోడైట్ (పెయిర్రెలూయిస్), సలాంబో (గుస్తావ్ ఫ్లవ్ బర్ట్), మానన్ లెస్కాట్ (ప్రెవోస్ట్), నానా (ఎమిలీజోలా) అనే నవలల్లోని నాయికలు, కార్మెన్ (మెరిమీ ప్రాస్సర్) అనే కథానికలోని నాయిక వీళ్ళందరికంటే మధురవాణి ఎలా ఉత్కృష్ట, ఉన్నత పాత్రో చక్కగా శ్రీశ్రీ వివరించి “నేను చదివినంత మట్టుకు విశ్వ సాహిత్యంలో మధురవాణితో సరిపోల్చగలిగిన పాత్ర మరొకటి లేదు” (మన గురజాడ, పుట – 42) అని చెప్పడానికి తెలుగు, భారతీయ సాహిత్య ఎల్లలు దాటి విశ్వ సాహిత్యంలోని ప్రముఖ రచనల్లోని నాయికలకు మధురవాణికి గల భేద సాదృశ్యాలు తారతమ్యాలు సోదాహరణంగా వివరించిన తీరును చూస్తే శ్రీశ్రీ పఠనావైదుష్యానికి హాట్సాఫ్ అనకమానం.

***1947లో ఈవ్యాసాన్ని రాశాడు శ్రీశ్రీ. ఇది చిన్న వ్యాసమే అయినా, దీన్ని చదివిన తర్వాత భారతీయ, ప్రపంచ ప్రసిద్ధ కావ్యనాయికలు, వారి తీరు, వారందరిలో మధురవాణి మహత్తు మన మనస్సుకు హత్తుకునే రీతితో సోపత్తికంగా శ్రీశ్రీ వివరించిన తీరుకు ముగ్ధులంకాక తప్పదు గాక తప్పదు.***

**బైరాగి :**



October 2009_30_09_2009_4.pmd 27 10/1/2002, 8:42 PM

కన్యాశుల్కం నాటికలోని ఒకానొక పాత్ర బైరాగి. మహాభారతానికి కర్ణుడెలాంటివాడో, హామ్లెట్ నాటకానికి డెన్మార్కు రాకుమారుడు ఎలాంటి వాడో బైరాగి అనే ఈ పాత్ర 'కన్యాశుల్కం' నాటకంలో అంత ముఖ్యమైందిగా శ్రీశ్రీ చెప్పాడు. ఈ బైరాగి ఆసవాలయానికి (కల్లుదుఖానం) లోపలా వెలుపలా నిర్లిప్తత సాధించిన వాడుగా చెప్పి, బైరాగి అన్నటువంటి "... మేం సిద్ధులం! నిజాన్ని అబద్ధం చేస్తాం. అబద్దాన్ని నిజం చేస్తాం" అనే మాటను, ఇంకా నిజమేమిటి? అబద్ధమేమిటి? లోకమే పెద్ద అబద్ధం" (మన గురజాడ, పుట - 46)గా గురజాడ చెప్పిన దాన్ని యధాతథంగా ఉటంకించి వివరించాడు శ్రీశ్రీ. బైరాగి పాత్ర గురించి తెలుపుతూ "బైరాగి నిత్య జీవితంలో నుంచి సరాసరిగా కన్యాశుల్కపు పుటలలోనికి ప్రవేశించాడు" (మన గురజాడ, పుట - 46) అని ఆ పాత్ర సహజత్వాన్ని సాధికారికంగా తెలిపాడు శ్రీశ్రీ.

'కన్యాశుల్కం' నాటిక గురించి ఇంకా నరకంలో (వ్యాసం), ఆధునిక గద్య వాఙ్మయ ప్రవర్తకుడు (ఉపన్యాసం), గురజాడ ఆధిక్యానికి కారణాలు (ఉపన్యాసం), ముత్యాల సరాలు (పీఠిక), గురజాడ కథనశిల్పం (ఉపన్యాసం), నాకు నచ్చిన కథ (వ్యాసం), కామ్రేడ్ గురజాడ (వ్యాసం) మొదలైన కన్యాశుల్కేతర రచనల గురించి శ్రీశ్రీ తన రచనల్లో సందర్భం వచ్చినప్పుడల్లా కాదు కాదు, సందర్భం కల్పించు కొని మరీ కన్యాశుల్కం వైశిష్ట్యం తెలిపాడు. ఈ రచనలన్నీ చదివితే శ్రీశ్రీ కన్యాశుల్కంపై ఎంత సాధికారత సాధించాడో గమనిస్తాం. కన్యాశుల్కంపై ఇంత పట్టు ఉంది కాబట్టే ఈ కన్యాశుల్కంలో ఉన్న లోపాలు గుర్తించగలిగాడు, ఓ ప్రత్యేక వ్యాసమే రాయగలిగాడు శ్రీశ్రీ.

**గురజాడ కథన శిల్పం :**

కన్యాశుల్కంలో కథను నడిపిన తీరును తెలుపుతూ కన్యాశుల్కంలో చిన్నకథలు ఎన్నో ఉన్నాయని చెప్పి, వాటిలో కొన్ని తెలిపాడు ఈ వ్యాసంలో శ్రీశ్రీ. ఇంకా ఆ రోజుల్లో జల సూత్రం రుక్మిణీనాథ శాస్త్రి ఓ వారపత్రికలో 'కన్యాశుల్కంలో చిన్న కథలు' శీర్షికను నిర్వహించినట్లు చెప్పాడు శ్రీశ్రీ.

**కన్యాశుల్కంలో కథను నడిపిన తీరును తెలుపుతూ కన్యాశుల్కంలో చిన్నకథలు ఎన్నో ఉన్నాయని చెప్పి, వాటిలో కొన్ని తెలిపాడు ఈ వ్యాసంలో శ్రీశ్రీ. ఇంకా ఆ రోజుల్లో జల సూత్రం రుక్మిణీనాథ శాస్త్రి ఓ వారపత్రికలో 'కన్యాశుల్కంలో చిన్న కథలు' శీర్షికను నిర్వహించినట్లు చెప్పాడు శ్రీశ్రీ.**

**'కన్యాశుల్కం'లో లోపాలు :**

ప్రపంచ ప్రసిద్ధ కావ్యాల్లో కొండొకచో దోషాలున్నట్లుగానే 'గురజాడ కూడా మానవ మాత్రుడే కాబట్టి కొన్ని లోపాల్ని చేశాడని చెప్పి కన్యాశుల్కంలో ఉన్న కొన్ని దోషాల్ని చూపాడు శ్రీశ్రీ. వాటిల్లో మొదటిది శిష్యుడికి పెళ్ళి కూతురు వేషం వేయించి పెళ్ళికి ఉపక్రమించినప్పుడు ఈ పెళ్ళి కూతురుకు మీనాక్షి మంగళ స్నానం చేయిస్తుంది. దీనితో పెళ్ళి కూతురు వేషంలో ఓ పురుషుడున్నాడన్న సంగతిని శ్రీశ్రీ ఎత్తిచూపాడు. మరో దోషం సత్ప్రవర్తన కలిగిన పాత్రలకు మంచి అర్థం వచ్చేపేరు, నీచ ప్రవర్తన ఉన్న పాత్రలకు చెడర్థం వచ్చే పేర్లు నిజ జీవితంలో తటస్థపడవు. అటువంటి అసహజమైన దానిని గురజాడ పాటించడం తప్పుగా శ్రీశ్రీ విశదీకరిస్తూ "కోపగొట్టు పేరు అగ్నిహోత్రావధాన్లు, జిత్తులమారి పేరు కరటక శాస్త్రి, పిసినిగొట్టు పేరు లుబ్ధావధాన్లు, మంచి ప్లీడరు పేరు సౌజన్యారావు" (మన గురజాడ, పుట - 48) పేర్లను చూపాడు. ఇలా కన్యాశుల్కంలోని కొన్ని తప్పులను చెప్పి "కన్యాశుల్కంలో తప్పులు పట్టడం నా కిష్టంకాని పని. కాని ఉన్న దోషాలని లేవనుకోవడం కూడా నిజమైన అభిమానానికి పుష్టినివ్వదు" (మన గురజాడ, పుట - 48) అని చెప్పి ఈ వ్యాసాన్ని ముగించాడు శ్రీశ్రీ.

ఇలా 'కన్యాశుల్కం'పై శ్రీశ్రీ రాసిన రచనల తర్వాత గురజాడ ఇతర రచనలపై శ్రీశ్రీ రచనల్ని చూద్దాం.

**ముత్యాలసరం - ఒక కృషి :**

గురజాడ గురించి శ్రీశ్రీ రాసిన వ్యాసాలలో ఇది రెండవది (ఇది ఉదయిని సాహిత్య త్రై మాసపత్రిక) ఫిబ్రవరి, 1935 సంచికలో ముద్రితమైంది. మొత్తం శ్రీశ్రీ వ్యాసాల్లోనే ఇది అత్యంత పెద్దది. 1/8 డెమ్మిసైజ్‌లో పద్నాలుగున్నర పేజీల నాక్రమించిన వ్యాసమిది. ఇందులో గురజాడ సృష్టించిన 'ముత్యాలసరాలు' అనే ఛందస్సు గురించి వివరిస్తున్నానని చెబుతూ ఈ వ్యాసం ఎవరికోసం కాదో తెల్పి, "... కొత్త విధంగా కవిత్వ సాక్షాత్కరం పొంది కావ్యగానం చేస్తున్న వారి వింత కంఠమని నమ్మినవారి.." (మన గురజాడ, పుట - 16) కోసం ఈ వ్యాసం అని ఆరంభించాడు శ్రీశ్రీ. ముత్యాలసరం మన ప్రాచీన సాహిత్యంలో ఏఏ ఛందో రీతులకు దగ్గరగా ఉందో పేర్కొని ఈ ఛందం గురజాడదేనన్నాడు శ్రీశ్రీ. ఆధునిక కవులు తమ గేయాల్లో యతిప్రాసలు వైకల్పికంగా వాడారు బంధాలను సందలించుకుంటూ రమణీయార్థాలను ప్రతిపాదించే కవులను ఆహ్వానించాల్సిందేనని చెప్పాడు శ్రీశ్రీ. ముత్యాలసరాన్ని మాత్రాబద్ధ ఛందస్సుగానే పరిశీలన చేశాడు శ్రీశ్రీ. ఇది ఎలా విరుగుతుందీ, పాదాలేమిటి మొదలైన అంశాల్ని పాత కవుల ఉదాహరణలతో పాటు తన జయభేరి, అవతారం కవితలు ఎలా నడుస్తున్నాయో చూపాడు. నవ్యకవితను తెలుగులో ప్రవేశపెట్టినవాడుగా గురజాడను కీర్తిస్తూ "....లవణరాజుకల'లో, 'కన్యక'లో, 'లంగరెత్తుము'లో కవిత్వ స్ఫులింగాలను మరచిపోజాలము. కాని గురజాడ అప్పారావుగారు ముత్యాలసరాన్ని మెలకువతో నిర్వహించలేదనే చెప్పాలి... నిర్వహణ వైవిధ్యం లేకపోవడమే కాక ఎటూ కాని చోట విరువబడి పాదయిన



October 2009_30_09_2009_4.pmd 28 10/1/2002, 8:42 PM

పాదాలు (ఉదా: 'కాసులు') అప్పారావు గారి ఛందోవ్యవస్థకు బలహీనత ఆపాదిస్తున్నవి" (మన గురజాడ, పుట - 22) అని గురజాడ ముత్యాలసరాలను నిర్వహించిన తీరును విమర్శించి "..... గనిలో నుంచి మొట్టమొదట తీయబడిన లోహం వంటిది వీరి ముత్యాలసరం..." (మన గురజాడ, పుట - 23) అని ముత్యాలసరం నూతన ఛందస్సును సమర్థించాడు శ్రీశ్రీ.

ఇంకా ఇదే వ్యాసంలో తన కాలం నాటి సీనియర్ కవులు అబ్బూరి రామకృష్ణారావు, బసవరాజు అప్పారావు మొదలైన వారు ముత్యాలసరాల్ని వాడిన తీరు చెబుతూ కవిత్వంపై తన అభిప్రాయం తెలపడానికి ఇది సందర్భం కాదని చెప్పాడు శ్రీశ్రీ. ఎందరో కవుల ఛందోరీతుల్ని విశ్లేషించి చివరికి సంవిధానంతో కూడిన కవిత్వమే సర్వోత్కృష్టమైనదిగా చెప్పి, వీటిలో ఏది లేకున్నా అది మహత్తర కవిత్వం కాజాలదని సోదాహరణంగా, విపులంగా చూపాడు శ్రీశ్రీ. ఈ వ్యాసాన్ని గమనిస్తే శ్రీశ్రీలో పరిశోధకుడు, విశ్లేషకుడు, తాను నమ్మినదాన్ని బలంగా చెప్పే విమర్శకుడు ఉన్నట్లు గ్రహిస్తాం.

**ముత్యాలసరాలు :** ఇది 'ముత్యాలసరాలు' అనే గురజాడ కవితా సంపుటికి 1958 లో పీఠికగా రాసిన రచన. ఇందులో ముత్యాలసరాలు ఛందస్సులో రాసిన దేశభక్తి, పూర్ణమ్మ, లవణరాజుకల, కన్యకల్లోని కవిత్వతీరు తెన్నుల్ని సోదాహరణంగా వివరిస్తూ గాందీజీకంటే ముందు గురజాడ హరిజనోద్ధరణకు పూనుకున్నాడని తెలిపాడు. ఈ నూతన ఛందం గురించి "గణబద్ధ ఛందస్సుల ఫ్యూడలిజం నుండి మాత్రాబద్ధ ఛందస్సుల ప్రజాస్వామ్య యుగానికి ఆంధ్ర సాహిత్య చరిత్ర గమనాన్ని పరివర్తన చేసినవాడు గురజాడ" (మన గురజాడ, - పుట - 61) అని మారుతున్న వ్యవస్థ తీరుకు తెలుగు కవిత్వంలో వస్తున్న ఛందో మార్పుల్ని చక్కటి లింక్‌తో చెప్పాడు శ్రీశ్రీ.

**ఆధునిక గద్య వాఙ్మయ ప్రవర్తకుడు :**

ఇది ఆకాశవాణి ద్వారా ప్రసారమైన శ్రీశ్రీ ప్రసంగం. ఇది తొలిసారి వ్యాస రూపంగా తెలుగు స్వతంత్ర 6-8-1954వ సంచికలో ముద్రితమైంది. అనంతరం పరిశోధన పత్రికలో, మన సాహితీ, శ్రీశ్రీ సాహిత్యం రెండు వచన విభాగాల్లో ముద్రితమైన తర్వాత జయంతి పబ్లికేషన్ వారు 1983లో 'కన్యాశుల్కం' ప్రచురిస్తూ, అందులో పీఠికాప్రాయంగా 'యుగకర్త గురజాడ సాహిత్యంపై మహాకవి శ్రీశ్రీ సమీక్ష'గా అచ్చేశారు.

ఈ రచనలో గురజాడ కొత్తపుంతలు తొక్కినట్లు చెప్పి ప్రాచీన కావ్యాల్లో ఉన్న వచనానికి, నేటి కాలపు వచనానికి తేడా తెల్పి ఆధునిక వచనానికి గురజాడను ప్రవక్తగా కొనియాడి ఆయన రచనల్ని 1. నాటకీయం, 2. కథనాత్మకం, 3. విమర్శనాత్మకం, 4. వ్యక్తిగతంగా విభాగించి ఒక్కొక్కదాని గురించి వివరించాడు శ్రీశ్రీ. 'నాటకీయం'లో కన్యాశుల్కాన్ని సవిస్తరంగా వివరించి, కొండు భట్టీయం, బిల్హణీయం నాటికలను కూడా తడిమాడు శ్రీశ్రీ. 'కథనాత్మకం'లో దిద్దుబాటు' కథ ప్రారంభం, నిర్వహణ, ఉపసంహారంలో గురజాడ చూపిన ప్రత్యేకతను తెలిపి, 'మీ పేరేమిటి' కథ వైశిష్ట్యాన్ని చూపాడు శ్రీశ్రీ. గురజాడ 'విమర్శనాత్మక' రచనలుగా వారి వ్యాసాల్ని వివరిస్తూ వ్యంగ్య హాస్యాలు ఉన్నట్లుగా చెప్పి 'వ్యక్తిగతం'గా డైరీలు, లేఖలు మొదలైనవి వస్తాయని తెలిపాడు శ్రీశ్రీ ఈ వ్యాసంలో.

**గురజాడ ఆధిక్యానికి కారణాలు :**

జయంతి పబ్లికేషన్‌వారి కన్యాశుల్కంలో పీఠిక స్థానాన్ని అలంకరించిందీ ప్రసంగ వ్యాసం. ఇందులో గురజాడ తన కన్యాశుల్కం రెండో ముద్రణకు పీఠిక రాసుకున్న కాలాన్ని, అప్పటిస్థితి తెల్పి ముత్యాలసరాలు గుచ్చిన యేడు నుంచే తెలుగులో విప్లవశకం ఏర్పడిందన్నాడు శ్రీశ్రీ. కందుకూరి, రాయప్రోలు, తిరుపతి వెంకటేశ్వర కవుల సాహిత్య కృషి తెలిపి అందరిలోనూ భావం, భాష, వ్యక్తీకరణ ఎందులో చూసినా గురజాడే గొప్పవాడుగా తేల్చాడు శ్రీశ్రీ.

***ఇందులో గురజాడ తన కన్యాశుల్కం రెండో ముద్రణకు పీఠిక రాసుకున్న కాలాన్ని, అప్పటిస్థితి తెల్పి ముత్యాలసరాలు గుచ్చిన యేడు నుంచే తెలుగులో విప్లవశకం ఏర్పడిందన్నాడు శ్రీశ్రీ. కందుకూరి, రాయప్రోలు, తిరుపతి వెంకటేశ్వర కవుల సాహిత్య కృషి తెలిపి అందరిలోనూ భావం, భాష, వ్యక్తీకరణ ఎందులో చూసినా గురజాడే గొప్పవాడుగా తేల్చాడు శ్రీశ్రీ.***

**నాకు నచ్చిన కథ :**

గురజాడ కవిగా, నాటక రచయితగా ఎంత గొప్పవాడో కథారచనలో కూడా అంతటి వాడిగానే చెప్పి 'దేవుడు చేసిన మనుషుల్లారా! మనుషులు చేసిన దేవుళ్ళారా మీ పేరేమిటి?' అనే కథలోని విషయాన్ని, ఆనాటి కాలమాన పరిస్థితుల్ని సవిస్తారంగా వివరించాడు శ్రీశ్రీ.

**నరకంలో :**

ఈ వ్యాసంలో శ్రీశ్రీ విచిత్రమైన ఊహను ప్రదర్శించాడు. తను చనిపోయిన తరువాత నరకంలో గురజాడను కలిసి వారితో సంభాషించడమే ఈ వ్యాసం. ఇది చిన్న నాటికలాగ సంభాషణాత్మకంగా సాగుతుంది. కన్యాశుల్కంలోని గొప్పతనాన్ని గురజాడకే తెలపడం చాలా బావుంది.

**కామ్రేడ్ గురజాడ :**

ఇది విరసం ఏర్పడిన తర్వాత 1976లో రాసిన వ్యాసం. అందుకే ఇందులో కాస్త తీవ్ర పదజాలం కనిపిస్తుంది. "ఇప్పటికీ గురజాడను కవిగా గుర్తించని గాడిదలున్నాయి" (మన గురజాడ, పుట - 69) అని చెప్పి గురజాడ గొప్పతనం, కన్యాశుల్కం, మీ పేరేమిటి కథానిక, పూర్ణమ్మ కవితల గొప్పదనం వివరించి "కనిపించని వంద కల్పవృక్షాల కన్న 'దేశభక్తి' గీతం మిన్న. సన్మానాలు పొందే లక్ష సామ్రాట్టులకన్న ఒక కామ్రేడ్ గురజాడ మేలు" (మన గురజాడ, పుట - 70) అని ముగించాడు ఈ వ్యాసాన్ని శ్రీశ్రీ.



October 2009_30_09_2009_4.pmd 29 10/1/2002, 8:42 PM

ఇలా గురజాడ, ఆయన రచనలపై ప్రత్యేకంగా వ్యాసాలలోను, ఉపన్యాసాలలోను తెలపడమేగాక ఇతర అంశాలపై వ్యాసాల్లోగానీ, ఉపన్యాసాల్లోగానీ, పీఠకల్లో గానీ ఏప్రక్రియలోనైనా చాలా రచనల్లో గురజాడ ప్రసక్తి తెచ్చాడు శ్రీశ్రీ. వాటిని చూద్దాం. మొదట మచ్చుకో వ్యాసాన్ని పరిశీలిద్దాం. '20వ శతాబ్దపు తెలుగు సాహిత్యం (1900–1950)' అనే వ్యాసంలో మన దేశ సాహిత్యాన్నే గాక విదేశీ సాహిత్యాల్ని గమనించినా ప్రపంచ నాటక సాహిత్యంలో కన్యాశుల్కం ప్రత్యేమైనదిగా చెప్పాడు శ్రీశ్రీ. ఉపన్యాసాల్లో అరసం 5వ మహాసభలో అధ్యక్షోపన్యాసం చేస్తూ సమకాలీన పరిస్థితుల్ని తెల్పి, వీరేశలింగం, గిడుగులతో పాటు గురజాడల బాటలో నడిచి సాహిత్యానికి ప్రజలకు సేవచేయాలని ఉద్భోదించాడు. ఇలాగే విరసం సభల్లో కూడా గురజాడ రచనల ప్రసక్తి తెచ్చాడు శ్రీశ్రీ. ఆంధ్రసారస్వత పరిషత్తు ఏడవ మహాసభలో ప్రసంగిస్తూ ఆధునికుల్లో గురజాడ కవిత్వం మాట్లాడేదిగా, రాయప్రోలుది పాడే కవిత్వంగా తెలిపాడు. ఇలా పలు వేదికలపై గురజాడ సాహిత్యాన్ని ఉటంకించాడు శ్రీశ్రీ.


> ***శ్రీశ్రీ రాసిన పీఠికల్లో చాలాచోట్ల గురజాడ ప్రస్తావన వస్తుంది. తను పీఠిక రాస్తున్న పుస్తకాన్ని విశ్లేషిస్తూ గురజాడ రచనల తీరును ఉదహరించడం గమనిస్తాం. ఉదాహరణకు రావిశాస్త్రి రాసిన 'ఆరుసారాకథలు'కు రాసిన పీఠికలో 'రసన' అనే కొత్త రస సిద్ధాంతాన్ని చెప్పిన దానికి పలువురి రచనలతో పాటు గురజాడ రచనలలో కూడా అది ఉందని చెప్పాడు శ్రీశ్రీ.***


శ్రీశ్రీ రాసిన పీఠికల్లో చాలాచోట్ల గురజాడ ప్రస్తావన వస్తుంది. తను పీఠిక రాస్తున్న పుస్తకాన్ని విశ్లేషిస్తూ గురజాడ రచనల తీరును ఉదహరించడం గమనిస్తాం. ఉదాహరణకు రావిశాస్త్రి రాసిన 'ఆరుసారాకథలు'కు రాసిన పీఠికలో 'రసన' అనే కొత్త రస సిద్ధాంతాన్ని చెప్పిన దానికి పలువురి రచనలతో పాటు గురజాడ రచనలలో కూడా అది ఉందని చెప్పాడు శ్రీశ్రీ. మహాప్రస్థానం, కవితా! ఓ కవితా!, దేశచరిత్రలు మొదలైన కవితలతో ఆధునిక రీతిలో రాస్తున్నకవిగా ప్రసిద్ధుడై, 'మహాప్రస్థానం' కావ్యం 1950లో వెలువడిన తర్వాత 'మహాప్రస్థానం' కవిగా లబ్ధప్రతిష్ఠుడై కవితాభిమానుల గుండెల్లో శాశ్వతంగా గూడు కట్టుకున్నాడు శ్రీశ్రీ. అందుకే పలు అంశాలపై ఎప్పటికప్పుడు శ్రీశ్రీ అభిప్రాయాల్ని తెలుసుకునేందుకు చేసిన ప్రయత్నమే ఇంటర్వ్యూలు. వివిధ సంస్థలు, వ్యక్తులు, పత్రికలు జరిపిన ఇంటర్వ్యూలలో కూడా చాలా సందర్భాలలో గురజాడ ప్రసక్తి తీసుకొచ్చాడు శ్రీశ్రీ. 12-01-1959 నాడు హైదరాబాదుకు వచ్చిన శ్రీశ్రీతో 'మనసాహితి' సంస్థ సభ్యులు జరిపిన ఇష్టాగోష్టిలో తెలుగు సాహిత్యంపై అడిగిన ప్రశ్నల్లో ఒకటి "గురజాడ కవికాదనీ, నాటక కర్తాకాదనీ అనే విమర్శపై మీ అభిప్రాయం?" (ప్రజ, పుట – 18) అని అడగ్గా శ్రీశ్రీ ఇచ్చిన సుదీర్ఘ సమాధానంలో తెలుగులో మహాకవులుగా తిక్కన, వేమన, గురజాడలను పేర్కొని కన్యాశుల్కం అంతటి నాటకం తెలుగులో తన కాలం నాటికీ వెలువడలేదని తెలిపి యావత్ భారతదేశంలోనే గత వేయి సంవత్సరాలలో వెలువడిన రెండు ఉత్తమ నాటికల్లో ఒకటి కన్యాశుల్కంగా చెప్పి, వేమన కవి కాకపోతే గురజాడ కూడా కవి కాదని వివరించాడు శ్రీశ్రీ. దేవులపల్లి ప్రభాకర్ శ్రీశ్రీతో చేసిన ఇంటర్వ్యూ ఆంధ్రప్రభ దినపత్రిక 17-11-1977 నాడు ముద్రితమైంది. ఇందులో "మీరు ఎన్నడూ మరచిపోలేని, మీ మీద శాశ్వత ప్రభావం కల్గించిన గ్రంథాలేవి?" అన్న ప్రశ్నకు జవాబుగా "ఒకటి యూలిసిస్ (జెమ్స్‌జాయిస్ రచన), ఇంకొకటి లెనిన్ (మయకోవస్కీరచన) మరొకటి కూడా చెప్పాలంటే గురజాడ వారి సమస్త సాహిత్యం" (ప్రజ, పుట – 110) అని గురజాడ రచనల వైశిష్ట్యాన్ని తెలిపాడు శ్రీశ్రీ.

ఇలా శ్రీశ్రీ వచన రచనల్లో గురజాడ ప్రసక్తి కనిపిస్తుంది. అక్కడక్కడ శ్రీశ్రీ కవిత్వంలో కూడా గురజాడ ప్రస్తావన ఉంది. 1943లో 'చక్కని ముత్యాల సరాలు' పేరుతో ముత్యాల సరాల ఛందస్సులో రాసిన ఈ కవిత భారతి, మార్చి 1943 సంచికలో అచ్చయింది. 'జేజే' అన్న కవితలో "గురజాడ, కందుకూరి / కొమర్రాజు, గిడుగు / తెలుగు వారి వెలుగుదారి / తెలివెన్నెల గొడుగు" (ఖడ్గసృష్టి, పుట – 67) గా అభివర్ణించాడు శ్రీశ్రీ. ఈ కవితలాగే 'కవితా ప్రయోజనం' అనే కవితనూ ఆరుద్రతో కలిసి రాశాడు. ఇందులో కవిత్వం గురించి ఆరుద్ర చెబితే దానికి తన పంక్తిగా శ్రీశ్రీ "మెచ్చుకుంటే మించి పాయెను" అని స్పందిస్తే, అప్పుడు ఆరుద్ర "ఇది గురజాడకి / ఇమిటేషన్ కాదూ" (ఖడ్గ సృష్టి, పుట – 78) అన్నాడు. దీనికి సమాధానప్రాయంగా శ్రీశ్రీ "ఇమిటేషన్ కాదు కొటేషన్"గా చక్కగా చెప్పాడు. 'సఖ్యం' అన్న కవిత గురజాడ 'దేశభక్తి' గేయ గొప్పతనాన్ని తెలుపుతూ రాసిన కవిత. 1908లో మద్రాసులో జరిగిన కాంగ్రెస్ మహాసభపై గురజాడ ఆంగ్లంలో రాసిన కవిత "Tell me not in scornful numbers/ Congress is an empty show...." ను "పాడకోయ్‌కవీ! కాంగ్రెస్ ఒక / భజన సమాజం మాత్రమే అనీ !" (ఖడ్గసృష్టి, పుట – 139) అంటూ అనువందించి గురజాడపై తన నిరుపమాన గౌరవాన్ని చాటుకున్నాడు మహాకవి శ్రీశ్రీ.

ఇలా అటు వచన రచనల్లో, ఇటు కవిత్వంలో గురజాడపై అపార అభిమానాన్ని పదే పదే చాటుకున్న మహాకవి శ్రీశ్రీ, గురజాడ రచనలతో సామాజిక మార్పు మరింత వేగాన్ని పుంజుకుందని చెబుతూ "ఏ కవికైనా సరే అతని చుట్టూ ఒక సమాజం, ఆ సమాజానికొక చరిత్రా, ఆచరిత్రకొక పరిణామం ఉంటాయి. సామాజిక చారిత్రిక పరిణామ గమనంలో కవి యొక్క సాహిత్య స్థానం నిర్ణీతమవుతుంది. కవి ప్రగతిశీలి, ప్రతిభాశాలి అయితే ఆ గమనాన్ని అతడు మరింత వేగవంతం చేస్తాడు. సామాజిక పరిణామానికి విప్లవపంథాలో వేగం సాధించిన మహాకవిగా గురజాడ అప్పారావుకి నేను నమస్కరిస్తున్నాను" (మన గురజాడ పుట – 56) అని గురజాడకు నివాళిని అర్పించాడు శ్రీశ్రీ. ■




October 2009_30_09_2009_4.pmd 30 10/1/2002, 8:42 PM

## కవిత

# “ధ్వంస రచన”

డా॥ కె.జి. వేణు




అది యుద్ధభూమి కాదు
మరణించిన వాళ్లంతా యుద్ధానికి వచ్చిన వాళ్లు కాదు
అంతా పౌరులే
వయసుతో సంబంధం లేకుండా వధింపబడిన వారే

ముహూర్తాలు వివాహాలకే కాదు విధ్వంసాలకు కూడా..
ఆకాశం ఒక్కసారిగా దద్దరిల్లింది
తుఫాను పిడుగుల శబ్దాలతో కాదు
పథకం ప్రకారం పేలిన బాంబు విస్ఫోటనాలతో

వీస్తున్న గాలికి తెలియదు... కాస్తున్న ఎండకు తెలియదు
పాదాల క్రింది మట్టికణాల కసలే తెలియదు
మారణహోమం ఇంత భయంకరంగా ఉంటుందని
రుధిరం నదీ ప్రవాహమై ప్రవహిస్తుందని
నేలకు నైవేద్యంగా మాంసపు ముద్దలు కుప్పలుగా రాలుతాయని

హాహాకారాలతో క్షతగాత్రగానం మొదలయిందక్కడ
ఖండాలుగా విభాగాలైన శరీరాలు
ఆఖరి శ్వాస వీడ్కోలులో విలవిల్లాడి పోయాయి.
రాక్షసక్రీడలో శ్వాస కోల్పోయిన కళేబరాలు
కిరాతకుల చర్యను మౌనంగానే ప్రశ్నిస్తున్నాయి
విషాదం మాత్రం జెండా లెగరేసుకొంటూ
ఆవరణం నిండా రణాన్ని మించిన ఉత్సవాలు జరుపుకుంది

శబ్దం తరువాత నిశ్శబ్దాన్ని చీల్చుకొంటూ
ఆప్తుల ఆర్తనాదం, రోదన, వేదన
కారిన కన్నీటి ఉప్పెనతో రోడ్లన్నీ రక్తాన్ని కడిగేసుకొంటున్నాయి
దృశ్యాలన్నీ ఎదను దగ్ధం చేస్తున్న సజీవ చిత్రాలే
మరోసారి తునాతునకలైన మానవత్వపు అవశేషాలే
స్తంభించిన గాలి కదలబోయి రక్కున ఆగి అటు చూసింది

సౌందర్యానికి ప్రతీక ఆమె... దురదృష్టానికి బలైపోయింది
తాళి కట్టిన వాడ్ని... బాంబుల దాడి తన్నుకెళ్లిపోయింది
మంత్రాలు, మంగళవాయిద్యాలు, అక్షింతలు, ఆశీర్వాదాలు
పోటిపడి పదిరోజులు కూడా కాలేదు

కళ్ళకాటుక కరగకముందే నుదుటి కుంకమ రాలిపోయింది
ఏడ్చి.. ఏడ్చి అయింది ఆ చిన్నది ఆ క్షణం
వింతలా... వితంతువులా
తంత్రులు లేని వీణలా... ఎండిన మ్రానులా
మాటలు రాని రాయిలా కదలలేని శిలలా
కన్నీరు మాత్రమే తెలిసిన విషాదంలా

లెక్కిస్తే ఆకాశంలో చుక్కలయ్యాయి దృశ్యాలన్నీ
మానవ చరిత్ర మరోసారి ఘోరంగా మలినమై పోయింది
చరిత్ర పేజీలన్నీ శవాల అవశేషాలతో అలంకరించబడుతున్నాయి
క్యాలండర్‌లో పండగ తేదీల్లా
మళ్లీ మళ్లీ పునరావృతం.. ఏదో ఒకచోట ఈ విధ్వంసం

ధ్వంస రచన ఎపుడు జరిగినా అది యుద్ధం కాదు
మరణించేది శత్రువుల కాదు
అంతా పౌరులే....
మూడు రంగుల జెండా క్రింద భద్రత లేని భారతీయులే



October 2009_30_09_2009_4.pmd 31 10/1/2002, 8:42 PM

## నచ్చిన పుస్తకం

# ఇప్పుడు ఎందరు 'గిరాంమూర్తి'లు కావాలో?

**అస్మిత**



వ్యావహారిక భాషా ఉద్యమానికి ఆద్యుడు గిడుగు రామ్మూర్తి పంతులు గురించి సాహిత్య అకాడమీ ఒక పుస్తకం ప్రచురించింది. కె.వి. రమణారెడ్డి 'గిడుగు పిడుగు' అనే పుస్తకం ప్రచురించారు. ఇంకా ఒకటీ అరా పుస్తకాలు కూడా వచ్చి ఉంటాయి. అయితే శ్రీశ్రీ సాహిత్యనిధి తీసుకువచ్చిన 'గిరాంమూర్తి' పుస్తకానికి ఒక ప్రత్యేకత ఉంది. గిడుగు రామ్మూర్తి పంతులు నడిపిన వ్యావహారిక భాషా ఉద్యమం గురించి వివిధ సందర్భాలలో మహాకవి శ్రీశ్రీ రాసిన వ్యాసాలూ, ప్రస్తావనలూ, ప్రశంసలూ గుదిగుచ్చి ఆంధ్ర పాఠకులకు అందించారు. ఇవన్నీ ఉద్యమ స్ఫూర్తితో ఉండటమే ఈ పుస్తకం ప్రత్యేకత.

కందుకూరి, గురజాడలతో పాటు గిడుగు రామ్మూర్తి పేరు చెప్పినట్లయితేనే 20వ శతాబ్దపు తెలుగు సాహిత్య మూర్తిత్రయం పూర్తవుతుంది అంటాడు శ్రీశ్రీ. గ్రామ భాష కోసం ఆయన ఆంధ్రసాహిత్య పరిషత్తును ఒంటరిగా ఎదిరించి పోరాడాల్సివచ్చింది. చివరకు దాని అంతు తేల్చుకున్నాడు కూడా. తాను లేవదీసిన తిరుగుబాటును తన జీవితంలోనే విజయం పొందడం చూడగలిగారు అని గిడుగు కృషిని శ్రీశ్రీ ప్రస్తుతిస్తారు. ఆనాడు గిడుగు రామ్మూర్తి అంత తేలికగా వాడుక భాషను గుర్తించేట్లు చెయ్యలేకపోవటానికి కారణం వ్యావహారిక భాషోద్యమంలోని బలహీనత కాదని పకడ్బందీగా తయారయిన అధికార ఇనుప చట్రపు బలాధిక్యమే అని చెప్పుకోవలసి వుంది అని శ్రీశ్రీ మార్పు కోసం జరిగిన పెనుగులాటలో బలాబలాలను సరిగా అంచనా వేయగలిగాడు.

శ్రీశ్రీ మాటల్లోనే చెప్పాలంటే 'గిడుగు పిడుగు' ప్రారంభించిన పోరాటం ఇంకా ముగిసిపోలేదు. వ్యావహారిక భాషా ఉద్యమం ద్వారా గిరాంమూర్తి సాధించిన విజయం కొనసాగింపు ఏ మాత్రం కొసలేని ప్రయాణంగా తయారయింది. ఇవాళ తెలుగు భాషను పరిపాలనా భాషగా మలచడంలో తీవ్ర వైఫల్యం కొట్టొచ్చినట్లు కనబడుతోంది. తెలుగు భాషా ప్రాశస్త్యాన్ని దశదిశలా చాటిచెప్పడానికి ఆంధ్రరాష్ట్రంలో అనేక సాహిత్య సంఘాలు ఉన్నాయి. చాలా ఏళ్ళ నుండి అధికార భాషా సంఘం పనిచేస్తోంది. అయినా పాలనా వ్యవహారాలు ఇప్పటికీ తెలుగులో జరుపుకోలేని పరిస్థితి ఉంది. తమిళనాడు ప్రభుత్వం లేవనెత్తిన న్యాయపరమైన అభ్యంతరాల మూలంగా ఆ హోదా ఉన్నదీ లేనిదీ తేలకుండా వుంది.

ప్రాచీన భాష హోదా సంగతి ఎలా వున్నా తెలుగు పరిపాలనా భాషగా కాళ్ళూనుకోవడం మాత్రం సాధ్యం కాలేదు. ఉపాధి సంపాదించుకోవడానికి విద్య ఒక సాధనంగా మారింది. ఆంగ్లభాష మాధ్యమం మీద మోజు పెరిగింది. ఉపాధి అవకాశాల లేమి వల్ల లేవనెత్తిన పోటీతత్వంతో ఆంగ్ల భాషా మాధ్యమంలో చదువుకోలేకపోవటమే కొందరి వెనుక బాటు తనానికి కారణం అనే కొత్త సూత్రీకరణ తెరమీదకు వచ్చింది. దాంతో ప్రభుత్వమే నడుం బిగించి కాన్సెప్టు స్కూళ్ళ పేరిట ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియం ప్రవేశపెట్టింది.

చేతికి అందింది నోటికి అందకుండా దోబూచులాడుతున్న తెలుగుకు ప్రాచీనభాష హోదా వచ్చిందని సంబరపడిపోవాలో ప్రభుత్వమే పూనుకొని పరభాషా మాధ్యమంలోకి విద్యను మళ్ళిస్తూ ఒకనాటికి నిజంగానే తెలుగును ప్రాచీనభాషగా మార్చేసేలా వుందని దుఃఖపడాలో తేల్చుకోలేని సంకటంలో పడిపోయింది తెలుగు భాషా సాహిత్యలోకం.

దీనంతటికీ కారణం ఏంటో గిరాంమూర్తి వ్యాసాల్లో శ్రీశ్రీనే చెప్పాడు. "వాడుకభాష అంటే ఎందుకింత జడుపు? (పరిపాలనా భాషగా తెలుగు వుండాలంటే ఎందుకింత వెరపు?) దీనికి నేను కారణం చెప్పగలననుకుంటా. ప్రజా బలాన్ని చూస్తే దౌర్జన్య ప్రభుత్వానికి కలిగే జడుపులాంటిదే ఇది. కేవలం భయం వల్లనే ప్రభుత్వం ప్రజల మీద పశుబలం ప్రయోగిస్తుంది. తాత్కాలికంగా అలజడిని అణచివేయగలిగానని సంతోషిస్తుంది. కాని ఎప్పటికైనా ప్రభుత్వమే నాశనమవుతుంది కానీ ప్రజలెన్నడూ తుడిచిపెట్టుకుపోరు. ఈ సూత్రాన్ని అనుసరించి ప్రస్తుత పరిస్థితుల్లో వాడుక భాషకు మన ప్రభుత్వం విశ్వవిద్యాలయాలు ఆదరం చూపిస్తాయా అని ఆలోచించాలి" అంటాడు. మరి పరిస్థితి ఇలా కొనసాగవలసిందేనా? "తీర్మానాల ద్వారా జరుగుతుందా? లేదు. మనం ఇదివరకు ఎక్కడ నిలబడ్డామో అక్కడే ఉండిపోతాం." అని హెచ్చరించాడు శ్రీశ్రీ.

గ్రాంథిక భాషా కంచుకోటను బద్దలు కొట్టిన బృహచ్ఛక్తి గిడుగు పిడుగు. సభలు చేసి వారి దివ్యస్మృతిని స్మరించి మర్నాడే మర్చిపోవడం కాకుండా మనసా వాచా అందుకు కృషిచేయాలి.

మాతృభాషలో విద్యాబోధన జరగడం, తెలుగుభాషలో పరిపాలనా వ్యవహారాలు సాగించడం తమకు సదుపాయం కాదని గట్టిగా ఎరిగినవారు ఇవాళ అధికార స్థానాలలో వున్నారు. గిరాంమూర్తి స్ఫూర్తితో మరో భాషోద్యమాన్ని నిర్మించడం ద్వారానే తెలుగుభాష చిరంజీవి అవుతుంది. శ్రీశ్రీ సాహిత్యనిధి సంస్థ తరపున సింగంపల్లి అశోక్‌కుమార్ తీసుకువచ్చిన గిరాంమూర్తి పుస్తకం భాషా ఉద్యమకారులకు ఆ రకమైన ప్రేరణ ఇస్తుంది. ఎంతటి సుదీర్ఘ ప్రయాణం అయినా ఒక అడుగుతోనే మొదలవుతుంది. ■



October 2009_30_09_2009_4.pmd 32 10/1/2002, 8:42 PM



# ఇతివృత్తం : మహాత్ముడే!

గుడిపూడి విజయరావు

***గాంధీజీ స్వరూపాన్ని చూసినా, వేష ధారణ చూసినా, లేక ఆయన నివాసం ఉన్న ఆశ్రమాలు ఏ విధమైన అలంకరణలు లేకుండా ఉండటాన్ని చూసినా- గాంధీజీకి కళపట్ల కాని, సౌందర్యం పట్ల కాని పెద్దగా ఆసక్తి, అవగాహన లేదని భావించే అవకాశం ఉంది. అది నిజం కాదు. అసలు ఆయన కళాత్మక దృష్టి ఆయన అనుసరించిన వేషధారణలోనే ఉంది.***

ఈ ఏడాది అక్టోబరు 2 గాంధీజీ 140వ జన్మదినం. అందుచేతనే గాంధీ గురించి వివిధ రకాల కార్యక్రమాలు సాధారణం కన్నా ఎక్కువగా జరుగుతున్నాయి. చలన చిత్రాల ప్రదర్శనలు, ఉపన్యాసాలు లాంటి వాటితో పాటు పలు చిత్రకళా ప్రదర్శనలు కూడ నిర్వహించబడుతున్నాయి. అలాంటి వాటిలో ఒకటి ఇప్పుడు మనం చెప్పుకుంటున్న 'గాంధీ- ఆన్ సెరేటెడ్ రోడ్' అనే పేరుతో హైదరాబాదు, కళాకృతి ఆర్ట్ గ్యాలరీలో ఏర్పాటయిన కె. శివకేశవరావు చిత్ర ప్రదర్శన. ప్రింట్ మేకింగ్, బ్లాక్ మేకింగ్, నేచురల్ డైయింగ్, టీచింగ్ లాంటి బహుముఖ కార్యకలాపాలు నిర్వహించే కేశవరావు మంచి చిత్రకారుడు.



చిత్రకారుడు కేశవరావు

గాంధీజీ అతి నిరాడంబరుడైన వ్యక్తి. ఆయన వేషధారణే కాదు శరీరాకృతి సైతం అతి సాధారణంగా కనిపిస్తుంది. గాంధీజీ అనగానే బోసినవ్వు, నున్నటితల, సన్నటి ఫ్రేముతో గుండ్రని కళ్లద్దాలు, మోకాళ్లపైకి ఎగగట్టిన పంచె, ఆ పంచెలో దోపిన పాకెట్ గడియారం, ఆకుచెప్పులు, చేతికర్ర, చరఖా- ఇవన్నీ గుర్తుకొస్తాయి. అలాగే ఆయన నివాసం, పరిసరాలు కూడ ఎంతో సాదాసీదాగా ఉంటాయి. గాంధీజీని చిత్రించాలనుకునే ప్రతి ఒక్కరూ వీటిని ప్రధానంగా తీసుకుంటారు. అయినప్పటికీ ఆయనను ఎందరో చిత్రకారులు ఎన్నెన్నో రీతుల్లో చిత్రించారు. పూర్తి హంగులతో రంగు రంగుల ఆకృతి చిత్రాలు మొదలుకొని, పాక్షిక ఆకృతి, పాక్షిక నైరూప్య చిత్రాలు, పూర్తి నైరూప్య చిత్రాల వరకు తమ తమ కళా నైపుణ్యాలతో తీర్చిదిద్దారు. ఎందరు ఎన్ని విధాలుగా చిత్రించినా, కొత్తవారు మరింత నూతనంగా గాంధీజీని, ఆయన స్వభావాన్ని, భావాలను ప్రేక్షకులకు తమదైన శైలిలో అందిస్తూనే ఉన్నారు.

ఇందరు కళాకారులకు గాంధీజీ నిరంతర స్ఫూర్తిని అందిస్తున్నాడంటే అది ఆయన స్వరూపంలోనే కాకుండా, ఆయన నిర్వహించిన పాత్రలోనూ ప్రధానంగా ఉంది. ఆయన భారత జాతీయోద్యమ ప్రధాన దిశను నిర్దేశించిన వ్యక్తి. అశేష ప్రజానీకం గాంధీజీ మాటపై నిలబడి స్వాతంత్రసమరంలోకి దుమికారు. ఆయన జాతీయోద్యమంపై ఆయన ప్రభావాన్ని ఆయన అనుయాయులే కాకుండా, భిన్నాభిప్రాయాన్ని కలిగిన వారు సైతం అంగీకరించక తప్పదు. అంతేకాదు ఆయన ఒక్క భారత దేశంలోనే కాకుండా విదేశాల్లో సైతం తన ప్రభావాన్ని చూపకలిగారు. మహాత్మునిగా పేరుగాంచారు.

ఇలా అతి సాధారణంగా కనిపించే వ్యక్తి



October 2009_30_09_2009_4.pmd 33 10/1/2002, 8:42 PM

అనేక మంది కళాకారులకు ఇతివృత్తంగా ఉపయోగపడటం ఒక అంశం కాగా, అసలు గాంధీజీకి కళ పట్ల ఉన్న అవగాహన ఏమిటి అన్నది కూడ మరొక ఆసక్తి కరమైన అంశం. గాంధీజీ స్వరూపాన్ని చూసినా, వేష ధారణ చూసినా, లేక ఆయన నివాసం ఉన్న ఆశ్రమాలు ఏ విధమైన అలంకరణలు లేకుండా ఉండటాన్ని చూసినా– గాంధీజీకి కళపట్ల కాని, సౌందర్యం పట్ల కాని పెద్దగా ఆసక్తి, అవగాహన లేదని భావించే అవకాశం ఉంది. అది నిజం కాదు. అసలు ఆయన కళాత్మక దృష్టి ఆయన అనుసరించిన వేషధారణలోనే ఉంది. ఏ కళాకారుని ప్రతిభకైనా అద్దం పట్టే ఒక ప్రధాన అంశం అతను ఎంచుకున్న సంకేతాలు, ప్రతీకలు. తాను చెప్పదలుచుకున్న ప్రధాన అంశాన్ని శక్తివంతంగా వ్యక్తీకరించడానికి దోహదపడటానికి ఇలాంటి వాటిని చిత్రకారుడు వినియోగిస్తాడు. గాంధీజీలో కళాదృష్టి పుష్కలంగా ఉంది కాబట్టే అశేష బడుగు జనాన్ని ఆకట్టుకునే రీతిలో, వారిలో తానూ ఒకడినని చెప్పుకోవడానికి ఉపయోగపడే వేషధారణను ఎంచుకున్నాడు.

కళ పట్ల గాంధీజీకి ఆసక్తి, అవగాహన ఉండటమేకాదు, ఆ భావాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని సైతం ఆయన ప్రయత్నించారు. హింద్ స్వరాజ్ అనే తన రచనలో టాల్‌స్టాయ్ రచన 'వాట్ ఈజ్ ఆర్ట్?', జాన్ రస్కిన్ 'ఎ జాయ్ ఫర్ ఎవర్', 'పొలిటికల్ ఎకానమీ ఆఫ్ ఆర్ట్' లాంటి గ్రంథాలను చదవాలని సూచించారు. చక్కటి అనువాదకుడు కూడా అయిన గాంధీజీ టాల్‌స్టాయ్ రచనను తానే స్వయంగా గుజరాతీలోకి అనువదించారు. మిగతా వాటిని కూడా అలా తీసుకు రావాలని ఆయన కోరారు. లండన్‌లో రౌండ్‌టేబుల్ సమావేశానికి వెళ్లి తిరిగివస్తూ రోమ్‌లో వాటికన్‌ను సందర్శించిన గాంధీజీ అక్కడ మ్యూజియంలో క్రీస్తు శిలువ వేసిన నిలువెత్తు విగ్రహాన్ని చూసి మంత్రముగ్ధులయ్యారు. తాను మళ్లీ అక్కడికి వెళ్లే అవకాశం లభిస్తే రెండు మూడు మాసాల పాటు ఆ విగ్రహాలను, పెయింటింగ్స్‌ను అధ్యయనం చేస్తానని కూడ ఆయన చెప్పినట్లు ఆయనతో ఉన్నవారు పేర్కొన్నారు. కళ, కళ కోసం కాదని దృఢంగా విశ్వసించే వ్యక్తి గాంధీజీ. టాల్‌స్టాయ్ మాదిరిగా కళను దేశభక్తిని ప్రేరేపించడానికి ఉపయోగించుకోవాలని ఆయన కోరారు. గాంధీ ఆశ్రమాల్లో గానం చేసే భజనావళి ఎంపికలో సైతం గాంధీజీ కళా దృష్టి అర్థమవుతుంది.





అందుచేత గాంధీజీ ఇంత మంది కళాకారులకు విభిన్నమైన, విలక్షణమైన రీతిలో ప్రేరణ ఇవ్వడం ఏ మాత్రం ఆశ్చర్య కలిగించదు. ఇప్పుడు మనం చెప్పుకుంటున్న కేశవరావు చిత్రాల విషయానికి వస్తే ఎన్నెన్నో ప్రత్యేకతలను పేర్కొనవచ్చు. గాంధీజీ స్వభావాన్ని సమర్ధవంతంగా వ్యక్తం చేయడానికి ఆయన ప్రధానంగా చార్‌కోల్, డ్రైపేస్టెల్ మీడియంను ఎంచుకున్నారు. ఆ మీడియంలో అపరిమితమైన పట్టుకలిగిన కేశవరావు గాంధీజీని రక రకాల మూడ్స్‌లో, విభిన్నమైన చారిత్రక సందర్భాలలో అత్యంత ప్రతిభావంతంగా చిత్రించారు. గాంధీజీ తత్వాన్ని అవగతం చేసుకోవడానికి గాంధీజీ రచనలను, గాంధీజీపై ప్రముఖులు రాసిన అనేక గ్రంథాలను ఆయన అధ్యయనం చేశారు. ఆయన కేవలం గాంధీజీ ఆకార, వేషధారణలకే తన అధ్యయనాన్ని పరిమితం చేస్తే ఇలాంటి చిత్రాలు ఆవిష్కరింపబడి ఉండేవి కాదని కచ్చితంగా చెప్పవచ్చు. ఇలాంటి చక్కటి అవగాహనతో ఆయన



October 2009_30_09_2009_4.pmd 34 10/1/2002, 8:42 PM

దాదాపు సంవత్సరం పాటు శ్రమించి ఇప్పుడు ప్రదర్శనకుంచిన సుమారు 35 చిత్రాలను తీర్చిదిద్దారు.

దక్షిణాఫ్రికాలో సత్యాగ్రహిగా మారిన గాంధీజీ, ఆ తర్వాత చర్ఖా ఉద్యమాన్ని చేపట్టిన గాంధీజీ, స్వాతంత్ర్య సంగ్రామంలో అశేష ప్రజానీకాన్ని సమ్మోహితులను చేసిన గాంధీజీ– ఇలా అనేక దశల్లో మనకు ఈ చిత్రాలలో దర్శన మిస్తారు. అలాగే ఆలోచనల్లో నిమగ్నమయిన గాంధీజీ, ఆందోళనలో గాంధీజీ, ఆనందంలో గాంధీజీ, బోసినవ్వుల గాంధీజీ, వడివడిగా అడుగులేస్తున్న గాంధీజీ– ఇలా అనేక మూడ్స్‌లో మనకు ఈ చిత్రాలలో కనిపిస్తాడు. గాంధీజీని చిత్రించడంలో కేవలం యధాతధస్థితిని ప్రతిబింబించడానికే కేశవరావు పరిమితం కాలేదు. అద్భుతమైన వూహాశక్తిని వాటికి జోడించాడు.



మొదటి ఉదాహరణగా, దక్షిణాఫ్రికాలో గాంధీజీ గమనించిన పరిస్థితులను వ్యక్తీకరించిన పెద్ద సైజు వర్ణ చిత్రాన్ని చెప్పుకోవాలి. ఇతర చిత్రాలు అన్నీ నలుపు తెలుపుగా కనిపిస్తుంటే, ప్రధానంగా ఇదొక్కటే రంగుల్లో ఆకర్షిస్తుంది. రంగుల్లో ఉండటమే కాకుండా తాను చెప్పదలుచుకున్న అంశం, మొత్తంగా తీర్చిదిద్దిన తీరుకూడ మిగతా చిత్రాలకు పూర్తి భిన్నంగా కనిపిస్తుంది. దక్షిణాఫ్రికాలో అక్కడి తెగలకు, బ్రిటిష్ వలసవాదులకు మధ్య జరిగిన యుద్ధానికి చిహ్నంగా ఫిరంగులు, ఫిరంగి గుళ్లు, ధ్వంసమయిన డాలు, బల్లెం లాంటి ఆయుధాలు కనిపిస్తుంటాయి. పైన మేఘాలలో పాశ్చాత్య వేషధారణలో గాంధీజీ శిరస్సు తేజస్సుతో కనిపిస్తుంటుంది. యుద్ధ బీభత్సానికి గాంధీజీ స్పందించిన తీరును, దాని పర్యవసానాలు భారత దేశంలోనూ ఎదుర్కోవలసి వస్తుందన్న సంకేతంతోను దీన్ని తీర్చిదిద్దినట్లు చెప్పుకోవచ్చు. అయితే, మరో విధమైన వ్యాఖ్యానమూ ఇవ్వవచ్చు. ఫిరంగులు పాశ్చాత్య వలసపాలకుల దాడికి చిహ్నాలు అయితే, విరిగిన డాలు, బల్లేలు విఫలమైన దేశీయ రాజుల పరాజయానికి ప్రతీక. పాశ్చాత్యదుస్తుల్లోఉన్న గాంధీజీ– ఈరకమైన పరిణామాలతో భారత్‌లో ప్రవేశించిన పాశ్యాత్య విధానాలకు చిహ్నంగా ఉన్నారని చెప్పవచ్చు. ఏదేమయినా సాధారణ గాంధీ చిత్రాలకు భిన్నంగా ఉన్న ఈ చిత్రం ప్రేక్షకుల దృష్టిని విశేషంగా ఆకర్షిస్తుంది.

కేశవరావు అన్ని చిత్రాలలోను బ్యాక్ గ్రౌండును, ఫోర్‌గ్రౌండును ఎంతో నైపుణ్యంగా తీర్చిదిద్దడం గురించి కూడ ప్రత్యేకంగా చెప్పుకోవాలి. చాల చిత్రాలలో విభిన్న వర్గాలకు చెందిన ప్రజానీకం కనిపిస్తుంటారు. విశేషమేమంటే ఏరకమైన జనం మధ్యలో ఉంటే, గాంధీ వారిలో ఒకడుగా కలిసిపోతాడు. సత్యాగ్రహిగా కనిపించే చిత్రంలో ఫోర్‌గ్రౌండ్‌లో చరఖా ఉంటే, బ్యాక్ గ్రౌండ్‌లో విదేశీ దుస్తులు దగ్ధం అవుతున్న దృశ్యం ఒకవైపు, మరొక వైపు చేతితో వడికిన నూలు కనిపిస్తాయి. ఈ చిత్రానికి ప్రత్యేకంగా వ్యాఖ్యానం చెప్పుకోనవసరం లేదు. అలాగే గాంధీజీ ఎక్కడికి వెళ్లినా ప్రజలు పెద్ద ఎత్తున విరాళాలు అందించే వారని, తమవద్దనున్న నగదుతో పాటు వంటిపై ఉన్న నగలను కూడ సంపూర్ణంగా ఆయనకు అందించే వారన్నది అందరికీ తెలుసు. గాంధీజీ రైలుపెట్టెలో ఉండగా, కిటికీలోనుంచి ఒక నిరుపేద వ్యక్తి ఒక నోటును అందిస్తున్న దృశ్యాన్ని చిత్రించడం ద్వారా కాని ఈ విషయాన్ని కేశవరావు చిత్రించారు. విరాళం అందిస్తున్న వ్యక్తి చేయి మాత్రమే కనిపించడంతో చెప్పదలుచుకున్న విషయం ఎంతో బలంగా వ్యక్తమయింది.

మొత్తంగా ఈ ప్రదర్శనను తిలకించినపుడు అసలు గాంధీజీని ఇన్ని విధాలుగా చిత్రించడం, ఇంత ప్రతిభావంతంగా చిత్రించడం వెనుక ఉన్న అధ్యయనం, నైపుణ్యం పట్ల ఆశ్చర్యం కలగకుండా ఉండదు. ఈ ప్రదర్శనకు హైదరాబాదులోని జర్మన్ సాంస్కృతిక కేంద్రం 'గోథా జంట్రుమ్' సహకరించింది. చెన్నైలోని జర్మన్ కాన్సల్ జనరల్ హెర్ హాన్స్ బుర్కార్డ్ సార్టీగ్ దీన్ని ప్రారంభించారు. బెర్లిన్ లోని గాంధీ ఇన్ఫర్మేషన్ సెంటర్ చైర్‌పర్సన్ హెర్ క్రిస్టియన్ బార్టఫ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 2009 సెప్టెంబరు 29న ఆరంభమయిన ఈ ప్రదర్శన అక్టోబరు 8 వరకు కొనసాగుతుంది. ■



October 2009_30_09_2009_4.pmd 35 10/1/2002, 8:42 PM

**సామాజికం**

# అమానుష సంస్కృతిలో అమ్మాయిల హాహాకారాలు!

ప్రమర

*వస్తు వ్యామోహం పనిగట్టుకుని పెంచేందుకు కూడా స్త్రీలనే సాధనాలుగా సమిధలుగా చేసుకుంటున్నారు. ఉదాహరణకు ఒక కొత్త కారును, బైకును, గోడకు వేసే రంగును, టూత్ పేస్టును బ్యూటీ క్రీమ్‌ను దేన్ని ప్రమోట్ చేయాలన్నా స్త్రీ ప్రతిమను అడ్డం పెట్టుకుంటున్నారు. వ్యక్తిత్వం గల మనుషులుగా గాక కేవలం భోగపు వస్తువులుగానే స్త్రీలను చూపించడం . వస్తు వ్యామోహాన్ని ఎంత పెద్ద ఎత్తున సృష్టించినా మన సమాజంలో దాన్ని అందుకోలేని వారే ఎక్కువ శాతం. వారిలో కొందరైనా తెగబడి ఏదో ఒకటి చేయాలన్న భావనకు అనివార్యంగా లోనవుతుంటారు. ఆ వస్తువులతో పాటు భోగపు వస్తువుగా చూపించబడిన స్త్రీని కూడా అలాగే హస్తగతం చేసుకోవాలన్న ఘోర ప్రవృత్తికి ఇవన్నీ దారితీస్తున్నాయి.*

స్త్రీలపై అమానుషాలు, అఘాయిత్యాలు పెరుగుతున్నాయా లేక ఎక్కువగా వెలుగులోకి వస్తున్నాయా అన్న మీమాంసలు మీడియాలో అప్పుడప్పుడు వస్తుంటాయి. వివిధ చోట్ల జరిగేవాటిని తక్షణం నివేదించడంలో మీడియా చురుగ్గా వ్యవహరిస్తుండవచ్చు గాని ఈ రూపంలో దాడులు గతంలో లేవన్నది చాలా స్పష్టం. భూస్వామ్య సమాజంలో స్త్రీలపై అనేక రాక్షసాలు అమలు జరిగిన మాట నిజం. అందులో అనేకం కొనసాగుతుండగానే వికృతమైన మార్కెట్ యుగపు మంటలు మగువలను మాడ్చి వేస్తుండడం ఒక పెద్ద సాంస్కృతిక సవాలు. సామాజిక సుడిగుండం.

స్త్రీలపై అఘాయిత్యాలు ఇంతగా పెరగడానికి అనేక కారణాలు కనిపిస్తున్నాయి. వారిని వస్తువులుగా చూపించే ధోరణి అన్నిటికన్నా ముఖ్యమైనది. వస్తువులతో పాటు వస్తువుల కింద స్త్రీలను చిత్రిస్తున్నారు. వస్తు వ్యామోహం పనిగట్టుకుని పెంచేందుకు కూడా స్త్రీలనే సాధనాలుగా సమిధలుగా చేసుకుంటున్నారు. ఉదాహరణకు ఒక కొత్త కారును, బైకును, గోడకు వేసే రంగును, టూత్ పేస్టును బ్యూటీ క్రీమ్‌ను దేన్ని ప్రమోట్ చేయాలన్నా స్త్రీ ప్రతిమను అడ్డం పెట్టుకుంటున్నారు. వ్యక్తిత్వం గల మనుషులుగా గాక కేవలం భోగపు వస్తువులుగానే స్త్రీలను చూపించడం . వస్తు వ్యామోహాన్ని ఎంత పెద్ద ఎత్తున సృష్టించినా మన సమాజంలో దాన్ని అందుకోలేని వారే ఎక్కువ శాతం. వారిలో కొందరైనా తెగబడి ఏదో ఒకటి చేయాలన్న భావనకు అనివార్యంగా లోనవుతుంటారు. ఆ వస్తువులతో పాటు భోగపు వస్తువుగా చూపించబడిన స్త్రీని కూడా అలాగే హస్తగతం చేసుకోవాలన్న ఘోర ప్రవృత్తికి ఇవన్నీ దారితీస్తున్నాయి.

మీడియాలో స్త్రీల గురించి చూపిస్తున్న తీరు అత్యంత హేయం. అసలు వారిని గురించి చెప్పాల్సి వస్తే అమ్మడు అని ముద్దుగుమ్మ అని సంబోధన. ప్రేక్షకులతో మాట్లాడేప్పుడే అమ్మాయిలైన యాంకర్లతోనే చవకబారుగా మాట్టాడించడం..ఎంతసేపూ గర్ల్‌ఫ్రెండ్లు, బాయ్ ఫ్రెండ్లు వంటివే గొప్పతనాలుగా చెప్పడం.. పదోక్లాసు పిల్లలు మాట్టాడుతున్నామన్నా ఇవే ప్రస్తావనలు తేవడం.. కింద స్క్రోలింగులో విచక్షణా రహితంగా అమ్మాయిల పేర్లతో ఐలవ్‌యూ వంటివన్నీ వేయడం ..ఇవి సమాజంపై ఎలాంటి ప్రభావం చూపిస్తాయని కాస్తయినా ఆలోచన చేస్తున్నారా? కామెడీ పేరిట ప్రసారమయ్యే చాలా సన్నివేశాలు వాస్తవంలో స్త్రీలపై అసభ్యతను ప్రేరేపించేవిగానే వుంటున్నాయి. మిడ్‌నైట్ మసాలాలు వంటివి సరేసరి. చాలా విదేశీ చానళ్లు నేరుగా ప్రసారమవుతున్నాయి. వీటిలో నేరుగా ఇళ్లలోకి ప్రవహించే కొన్ని సన్నివేశాలు ఏ సర్టిఫికెట్‌కు కూడా మించినవై వుంటాయి. ప్రపంచీకరణ విస్తరించిన తర్వాత నీలి చిత్రాల మార్కెట్ విపరీతంగా పెరిగిపోయింది. సాంకేతిక నైపుణ్యం కూడా సామాజిక విధ్వంసానికి సాధనమవుతున్న సందర్భాలు కోకొల్లలు. ఉదాహరణకు కెమెరాతో రహస్యంగా చిత్రాలు తీయడం, అశ్లీల మెసేజ్‌లు పంపించడం, వెబ్‌సైట్లలో బూతు పురాణాలు, అమ్మాయిల పేర్లతో అవారా మెయిళ్లు,నెట్ కేఫ్‌ల భాగోతాలు, శ్రుతిమించిపోతున్న వ్యభిచార



October 2009_30_09_2009_4.pmd 36 10/1/2002, 8:42 PM

ముఠాలు ఇవన్నీ అమ్మాయిల పాలిట శాపాలవుతున్నాయి.

ఈ జాబితాలో తప్పక చెప్పవలసింది చలన చిత్రాలను. నటీనటులు దర్శకులు అందరూ మన సంస్కృతి, మహిళల ఔన్నత్యం పాఠాలు చెబుతుంటారు గాని కథలన్ని పురుష ప్రధానంగా స్త్రీలను వేధించే రీతిలోనే తయారు చేస్తారు. అమ్మాయిలు గనక ప్రేమ లేదా ఆకర్షణ ప్రతిపాదనకు స్పందించకపోతే అది పెద్ద నేరమైనట్టు ఈ చిత్రాలన్ని చూపిస్తాయి. అసలు అమితాబ్ బచన్ దీవార్ నుంచి నేటి మగధీరుల వరకూ మన సినిమాలన్నిటిలోనూ అవారా లే హీరోలు. వీరిని చూపించడమే అమ్మాయిలను ఏడిపించే డాన్సుతో మొదలు. ఉదాహరణలు కూడా అనవసరం. బాగా విజయం సాధించిన చాలా చిత్రాలలో హీరోలు హీరోయిన్ను బలవంతంగా తీసుకుపోయి బంధించి ఏడిపించే సన్నివేశాలుంటాయి. తమిళం నుంచి డబ్ చేయబడిన వాటిలో ఇవి మరీ ఎక్కువ. స్త్రీలు విశ్వాసఘాతకులైనట్టు ప్రేమించిన వాడిని బేఖాతర్ చేసి పతనం చేస్తారన్నట్లు వీటిలో చిత్రిస్తుంటారు. శాడిజానికి ఉన్మాదానికి ప్రేమకు తేడా తెలియని రీతిలో ఎందరో ప్రేమికులను మన చిత్రాలు సృష్టించాయి. మహర్షి, సుస్వాగతం,దేవదాసు, శేషు, ప్రేమతో... చెప్పాలంటే ఇలాటి ఉదాహరణలెన్నో! ఇవన్నింటిలో హీరోల శాడిజమే.. అయితే అదే ప్రేమోన్మాదం అంటారు. నిజానికి ఈ మాటే పెద్ద తప్పు. ఇక విలన్ల శాడిజంతో కలిపి అమ్మాయిలను చూపించే చిత్రాలు లెక్కలేనన్ని. దీనికి తోడు భయానకమైన హింస, అసభ్య శృంగార ఘట్టాలు.. అన్ని కలిపి అపరిపక్వ మనస్కులపై చూపించే దుష్ప్రభావాన్ని ఎంత చెప్పినా తక్కువే. ఇటీవల బయిటపడుతున్న అనేక ఘటనలలో దుర్బుద్ధులైన అధ్యాపకులు కూడా ఇలాంటి వాటిలో ఎక్కువగానే వున్నట్టు కనిపిస్తుంది. వీరు అపరిపక్వ మనస్కులు కాదు- అమానవ కామాంధులు. ఆస్ట్రియాలో ఫిజిల్ నుంచి ఆంధ్ర ప్రదేశ్‌లో అనేక ఘటనలలో దగ్గరవారు, కుటుంబ సభ్యులే పరమ పైశాచికంగా అమ్మాయిలను నిర్బంధించి బానిసలుగా చేశారని, ఏళ్ల తరబడి హింసా నరకం చూపించారని తెలుసుకున్నప్పుడు మనం మాట రాకుండా ప్రాన్పడిపోతాం.

మృగాళ్లు అంటున్నారు గాని నిజానికి మృగాలు ఆడజంతువుపై అత్యాచారం చేయవు. వాటిని మెప్పించే బాధ్యత మగ జంతువుపైనే వుంటుంది. ప్రసవ సమయంలోనూ మగ జంతువులు చాలా బాధ్యత తీసుకుంటాయి. మనుషుల విషయంలోనే( అసలు మనిషి అంటే పురుషుడే! స్త్రీని ఆడమనిషి అంటారు) పురుషాధిక్యత. పాత సమాజాలలోని దురంతాలు చాలనట్టుగా ఆధునిక వ్యాపార వ్యవస్థ దానికి అసలు మానవీయతే లేని మర'గుమ్మ'లుగా మార్చేసిన ఫలితం మనం ఇప్పుడు చూస్తున్నాం.. ఆడవాళ్లు ఆకర్షనీయంగా వుంటేనే అస్తిత్వం అన్న దుర్భ్రమ వ్యాపింపచేయబడుతుంది. లేకపోతే ఇన్ని అమానుషాలను పట్టించుకోనట్టుగా ఒక్క మొటిమకే అమ్మాయి హడలిపోయినట్టు చూపించే యాడ్లను ఏమనుకోవాలి? ఒక క్రీము రాసుకుంటేనే ఒక పేస్టుతో పళ్లు తోముకుంటేనే అమ్మాయిలు తండాలుగా వచ్చేస్తారన్నట్టు చెప్పే యాడ్ల ప్రభావం ఎలా వుంటుంది? పుట్టినప్పటి నుంచి వాటినే చూసి చూసి నిజమేననుకుంటే అలా జరగనప్పుడు కలిగే ఆశాభంగం ఎలాంటి అమానుషత్వానికి ప్రాతిపదిక అవుతుంది? విచ్ఛిన్నమై పోతున్న కుటుంబాలలో తమకు తామే అస్తవ్యస్త స్థితిలో వుండే చాలా మంది తల్లిదండ్రులు పిల్లల పరిణామ క్రమాన్ని అందులో ప్రమాదాలను గమనిస్తారని ఆశించగలమా? సమాజంలో శాంతి భద్రతలు దెబ్బతిని సంఘ వ్యతిరేకులతో పోలీసుల సంబంధాలు విమర్శలకు గురవుతున్న నేపథ్యంలో అమ్మాయిలు ఫిర్యాదు చేసినంత మాత్రాన పోలీసులు కాపాడతారని నమ్మడం సాధ్యమా? సకాలంలో చర్యలు తీసుకోకుండా ఆ పైన ప్రచారం కోసం ఎన్‌కౌంటర్లు చేసినప్పటికీ తర్వాత మరిన్ని ఘోరాలు జరుగుతుండటం కూడా నిజమే కాదా?

మొదటే చెప్పినట్టు నిజంగా ఘోరాలు పెరుగుతున్నాయా అని అడిగేవాళ్లు కొందరైతే అమ్మాయిలదీ తప్పుంటుందని వ్యాఖ్యానించేవారు మరికొందరైనా కనిపిస్తుంటారు. రాజమండ్రి ఘటన తర్వాత కొన్ని ఛానళ్లు అభిప్రాయ సేకరణ చేసినపుడు ఒక బస్సులో అమ్మాయిలు కూడా చాలా మంది ఇలానే అనడం ఆశ్చర్యం కలిగించింది. అమ్మాయిల వేష ధారణ బాగుండడం లేదని, మరీ అతి చేస్తున్నారని, మొదట్లో వారే చనువిచ్చి వుంటారని దుర్భరమైన మాటలు వినిపిస్తుంటాయి. వారి ఆత్మ రక్షణ పూర్తిగా వారిదే నన్నట్టు లేక వారిలో ఏదైనా పొరబాటుంటే ఫలితం అనుభవించవలసిందేనన్నట్టు మాట్లాడటం క్షమించరాని విషయం. విష సంస్కృతి ప్రభావం అందరినీ సోకుతుంది. దాన్నుంచి అప్రమత్తంగా వుండమని చెప్పడం వేరు, అమానుషాలకు అదే కారణమైనట్టు మాట్లాడ్డం వేరు. రాజమండ్రిలో కుటుంబమే బలై పోయిన తర్వాతనైనా ఇలా మాట్లాడే వారు నోరు మూసుకుంటారని భావించాలి. ఏమంటే అక్కడ కుటుంబం స్పందించింది. పోలీసులకు ఫిర్యాదు కూడా అందింది. అయినా వూహించని రాక్షసం జరిగింది. కేవలం స్త్రీలనే బలితీసుకుంటున్న ఈ పైశాచికాలను అరికట్టడం మాత్రం సమాజమంతటి బాధ్యత. సినిమాలు, మీడియా, విద్యా సంస్థలు ఇందుకు సంబంధించిన చైతన్యం పెంచడంలో ముందుండాలి. సహజంగానే మహిళా యువజన విద్యార్థి ఉపాధ్యాయ సంఘాలు ఇతర స్వచ్ఛంద సంస్థలు ఈ విషయంలో సమైక్య కృషి చేసి సమాజ దృశ్యాన్ని చక్కదిద్దాలి. రాజకీయ పక్షాలూ తమ బలాన్ని మహిళలకు తోడు చేయాలి. అంతిమంగా ప్రభుత్వం పోలీసు యంత్రాంగం అలసత్వాన్ని వీడి అత్యవసరంగానూ అన్ని విధాలుగానూ చర్యలు తీసుకోవాలి. ఆత్మగౌరవాన్ని కాపాడుకునేందుకు వీలుగా అమ్మాయిలకు ఆత్మరక్షణ నైపుణ్యం నేర్పించాలి. అందులో ఏది జరగాలన్నా సాంస్కృతికంగా అమ్మాయిలను చిత్రిస్తున్న తీరు సమూలంగా మారాలి. ■

నివేదిక

# గురజాడ అడుగుజాడ

అల




సాహితీస్రవంతి ఆధ్వర్యంలో జరిగిన గురజాడ జయంతి సభలో పాట పాడుతున్న గాయకుడు ప్రకాశరావు. చిత్రంలో చీకటి దివాకర్, డా॥ రామసూరి, చిత్ర ఉన్నారు.

విజయనగరం పట్టణంలోని గురజాడ కేంద్ర గ్రంథాలయంలో సెప్టెంబర్ 21న సాహితీస్రవంతి ఆధ్వర్యంలో గురజాడ జయంతి సభ జరిగింది. ఈ సభకు సాహితీస్రవంతి విజయనగరం జిల్లా కన్వీనర్ చీకటి దివాకర్ అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ వెయ్యేళ్ళ తెలుగు సాహిత్యంలో రెండే రెండు సంఘటనలు పెను సంచలనాన్ని సృష్టించాయన్నారు. మొదటిది సంస్కృతం నుండి తెలుగు విడివడడానికి నన్నయ్య చేసిన ప్రయత్నం కాగా, రెండవది తెలుగు భాషా సాహిత్యం ప్రజాపరం కావడానికి గురజాడ చేసిన ప్రయత్నం అని ఆయన అన్నారు. 'గురజాడ ఆకులందున అణగి మణిగిన కవిత కోకిల పలకవలెనోయ్' అంటూ 'ఆ పలుకులు విన్నవారిలో దేశాభిమానము మొలకెత్తాలని భావించారన్నారు. గురజాడకు ముందు తెలుగు కవిత్వం ఎంత భ్రష్టు పట్టాలో అంతా భ్రష్టు పట్టిందని సాహిత్యంలో మార్పుతేవాలని గురజాడ ఆకాంక్షించారని అన్నారు. జర్మనీలో వచ్చిన మత సంస్కరణ ఉద్యమం, ఇంగ్లండులోని పారిశ్రామిక విప్లవం, స్వేచ్ఛా, సమానత్వం, సౌభ్రాతృత్వం ఆకాంక్షించిన ఫ్రెంచి విప్లవం వంటి మార్పులు భారతదేశంలో రాలేదని, ఆ పని కొంత బ్రిటిషర్స్ చేశారని, అంతకు ముందు మూఢనమ్మకాలు, అవిద్య మొదలగు సంఘసంస్కరణోద్యమాలు, గిడుగు వంటి వారిపై పడి వ్యవహారిక భాషా ఉద్యమం వూపందుకున్నదని ఈ నేపథ్యం గురజాడలో మార్పుకు దోహదం చేశాయని అభిప్రాయపడ్డారు.



విజయనగరం పట్టణంలోని గురజాడ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సాహితీస్రవంతి జిల్లా కన్వీనర్ చీకటి దివాకర్, కవి అల, గ్రంథాలయ ఛైర్మన్ ఆర్. పోతన్న

గురజాడ కవిత్వం గురించి మహారాజు స్వయంప్రతిపత్తి కళాశాల విశ్రాంత ఉపన్యాసకులు డా॥ రామసూరి మాట్లాడుతూ సాహిత్యం ఎలా ఉండాలి, ఎలా ఉంటే అది ప్రయోజనకారి అవుతుంది, తద్వారా సామాజిక మార్పుకు, నూతన సాహితీసృజనకు దోహద పడుతుందో గురజాడ నిరంతరం ఆలోచించారని అన్నారు. గురజాడ కవిత్వ రచన ఒక ప్రణాళికాబద్ధంగా జరిగిందని అన్నారు. అప్పటివరకు ఎందరో కవులు దేశభక్తి గీతాలు రాసారని అయితే అవి అన్యదేశమాత సౌష్టవాన్ని కీర్తించేవిగానే మిగిలిపోతాయని గురజాడ అందుకు భిన్నంగా జాతిని ఉత్తేజపరిచే విధంగా రచన సాగించారని తెలిపారు. దేశమంటే ఏమిటో తెలుపుతూ దేశప్రజలు ఎలా ఉండాలి, ఏమిటి సృష్టించుకోవాలి. అంతర్జాతీయంగా ప్రజల పాత్ర ఏమిటి అన్న అంశాలతో పాటు జాతి అభివృద్ధి చెందడానికి కావలసిన సూచనలన్ని దేశభక్తి గీతంలో చోటుచేసుకున్నాయని తెలిపారు. అందుకే గురజడా దేశభక్తి గీతానికి ఎల్లలు లేవని, ఏ జాతి ప్రజలకైనా, ఏ కాలానికైనా ఆ గీతం వర్తిస్తుందని తెలిపారు. లవణరాజు కలలో గురజాడ అభిప్రాయాలు ఆయనలోని విశాల దృక్పధానికి తార్కాణమన్నారు. సమకాలీన సమాజంలో జరిగిన సంఘటనల్ని ఆయన కరుణ రసభరితంగా మనకందించిన గీతాలే కన్యక, పుత్తడిబొమ్మ పూర్ణమ్మలని తెలిపారు. ముత్యాల సరాలు గేయంలో విశ్వకాలీన అభిప్రాయాలతో ఆయన వెలిబుచ్చిన అభిప్రాయాలు ఆధునిక సాహిత్యంలోనే అరుదుగా కన్పిస్తాయన్నారు. ఆ తరువాత ప్రముఖ కథకుడు, విమర్శకుడు చిత్ర, గురజాడ కథాసాహిత్యం గురించి ప్రసంగించారు. గురజడా కథల్లోని సంస్కర్త హృదయం గొప్ప కథగా పేర్కొంటూ ఆ కథను అర్థం చేసుకునే స్థితి నేటికీ చాలామందికి లేదన్నారు. ఇక మిగిలిన నాలుగు కథల్లో దిద్దుబాటు, మెటిల్డా స్త్రీలకు చెందిన కథలు కాగా, 'మనుషులు చేసిన దేవుల్లారా, దేవుడు చేసిన మనుషుల్లారా మీ పేరేమిటి?' మతము విమతము కథలు మతపరమైన అంశాలకు చెందినవని అన్నారు. ఆనాటి సమాజంలో స్త్రీలను పురుషులు పనిముట్లుగానే భావించేవారని సహేతుకంగా వివరిస్తూ తన అభిప్రాయాల్ని కథల ద్వారా గురజాడ ఎలా వివరించారో తెలిపారు. మతం, దేవుడు పేరిట నాటి భూస్వామ్య వర్గం ఎంతటి హేయంగా ప్రజల్ని చూసిందో తెలుపుతూ ఆయన మిగిలిన రెండు కథల రచనల్ని సహేతుకంగా వివరించారు. సభకు కృష్ణారావు ఆహ్వానం పలికారు. గురజాడ దేశభక్తి గేయాన్ని చంద్రిక, రోహిణీ, మీన, ప్రకాషరావు శ్రావ్యంగా ఆలపించారు. అంతకు ముందు కేంద్ర గ్రంథాలయంలోని గురజాడ విగ్రహానికి దివాకర్, అల, చంద్రిక, సాహితీస్రవంతి ఇతర కార్యకర్తలు, గ్రంథాలయ ఛైర్మన్ రొంగలి పోతన్న, గ్రంథాలయ సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. ■



October 2009_30_09_2009_4.pmd 38 10/1/2002, 8:42 PM

## తెలుగు కథానికకు జేజేలు



హైదరాబాద్‌లోని ఎ.ఎస్.రావు నగర్‌లో సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రాంగణంలో సెప్టెంబర్ 20న 'తెలుగు కథానికకు వంద జేజేలు' పేరున సభ జరిగింది. స్త్రీవాదం అంటే పురుష ద్వేషం కాదని, స్త్రీ అస్తిత్వాన్ని బలపరుస్తూ సంఘటిత శక్తిని పెంచడం ద్వారా అణచివేత, దోపిడీ నుంచి స్త్రీని రక్షించేదే స్త్రీవాదమని ఈ సభలో ప్రసంగించిన రచయిత్రి ఓల్గా అన్నారు. పూర్వపు కథకులు స్త్రీ పక్షపాతంతో తమ రచనలను సాగించారని, మంచి భర్త దొరికితే ఆమె సమస్యలు నివృతమవుతాయని రాయగా, అసలైన స్త్రీవాద స్పృహ 1980 దశకం తర్వాత రచయిత్రులలో పెరిగిందని, అణచివేత, దోపిడీల నుండి విముక్తం కావడమే స్త్రీల సమస్యలకు పరిష్కారమని ఆ అవగాహనతో రచనలు సాగించడం మొదలైందని ఆమె వివరించారు. కోకిలమ్ సాహితీ సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో ఈ సభలో ఓల్గా స్త్రీవాద సాహిత్యాన్ని సహేతుకంగా విశ్లేషించారు. తెలుగు సాహిత్యంలో ఉన్నంత బలంగా స్త్రీవాద ధోరణి ఇతర భారతీయ భాషల్లో లేదని ఆమె అన్నారు. 'తెలుగు కథానిక పురోగతి' 'భవిష్యత్తు' అంశంపై ప్రముఖ సాహిత్య విమర్శకులు ఆర్వీఆర్ మాట్లాడుతూ అన్ని సమస్యలకు మూలం ఆస్తి పంపకాలు, ఆస్తి హక్కులలో ఉందని రచయితలు తెలుసుకోవాలని, ఈ వాస్తవాన్ని గ్రహించని వాదాలు వ్యర్థమని అభిప్రాయపడ్డారు. బ్రిటీష్ పాలన దేశాన్ని దోచుకున్నా భాషాపరమైన అగడ్తను పూడ్చిందని, ఆ క్రమంలో జరిగిన మంచే ఆధునిక కథానిక ఆవిర్భావమని ఆయన పేర్కొన్నారు. తెలుగులో కథానికకు ఆద్యులు బండారు అచ్చమాంబ అన్నా వాదాన్ని ఆయన త్రోసిపుచ్చుతూ భావజాలంలో ఆధునికత గల గురజాడే తెలుగు కథానికకు ఆద్యులని ఆర్వీయార్ సోదాహరణంగా వివరించారు. కోకిలమ్ ప్రథమ ప్రచురణ 'కృష్ణార్జునులు–ఇతర కథలు' కథానిక సంపుటిని రచయిత గుడిపాటి విశ్లేషిస్తూ ఈ పుస్తక రచయిత పులిగడ్డ విశ్వనాథరావు వ్యంగ్య రచనా ధోరణిని పదునైన ఆయుధంతో పోల్చారు. సీనియర్ రచయిత మునిపల్లె రాజు మాట్లాడుతూ పురాణం, వాకాటి వంటి ప్రముఖుల సహచర్యంతో పదును తేలిన రచయిత పులిగడ్డ అని ప్రశంసించారు. నూతక్కి రాఘవేంద్రరావు సభలో చదివిన కవిత సభికులను ఆకట్టుకుంది. 'కథానికకు వంద జేజేలు' పేరిట అక్టోబర్ 4న రెండవ సభ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. కోకిలమ్ సహకన్వీనర్ ఎం. రంగాచార్యులు సభకు స్వాగతం పలుకగా, మరో సహకన్వీనర్ పురాణం శ్రీనివాసశాస్త్రి వందన సమర్పణతో సభ ముగిసింది.



**సాహితీస్రవంతి, సుందరయ్య విజ్ఞానకేంద్రం, జనవిజ్ఞాన వేదిక సంయుక్త ఆధ్వర్యంలో సెప్టెంబర్ 19న గచ్చిబౌలిలో నూతనంగా నిర్మించబడుతున్న సుందరయ్య విజ్ఞానకేంద్రం ప్రాంగణంలో నిర్వహించబడిన శ్రీశ్రీ శతజయంతి సభ. ఈ సభలో ప్రముఖ విద్యావేత్త చుక్కారామయ్య, సాహితీస్రవంతి రాష్ట్ర కన్వీనర్ తెలకపల్లి రవి, ఎఐఐఇఎ జాతీయ ప్రధాన కార్యదర్శి కె. వేణుగోపాల్, సెంట్రల్ యూనివర్శిటీ ప్రొఫెసర్ అట్లూరి మురళి పాల్గొన్నారు.**



**సెప్టెంబర్ 20న విజయవాడలోని ప్రెస్‌క్లబ్‌లో మెరుగు రాధాకృష్ణ రచించిన 'మెఱుగు పూలు' పుస్తక ఆవిష్కరణ సభ. చిత్రంలో ఎడమ నుండి కవి చలపాక ప్రకాశ్, కె. బాపిరాజు, నందూరి రాజగోపాల్, గుమ్మా సాంబశివరావు, రావి రంగారావు, వి. హజరతయ్య గుప్త, గోకరాజు నాగరాజు, గ్రంథ రచయిత మెఱుగు రాధాకృష్ణ, డా॥ ద్వానా శాస్త్రి, పెనుమత్స అప్పలరాజు, శ్రీమతి పి. దుర్గాభవాని.**

## ఆదివాసీ కథలకు ఆహ్వానం

ప్రతిభా ప్రచురణలు ఈ సంవత్సరం నుండి ప్రతి ఏటా విస్మృత సమూహాలపై కథా సంకలనాలు వెలువరించాలని నిశ్చయించింది. ఆదివాసీ, సంచార జాతుల జీవితం, సాంస్కృతిక మూలాలు, వాటి పరిరక్షణ కోసం జరిగే సంఘర్షణ ఇతివృత్తాలుగా ఈ సంవత్సరం నవంబరులో కథా సంకలనం వెలువడుతుంది. ఆయా సమూహాల పట్ల సహానుభూతీ, ఆర్తీ వున్న రచయితల నుండి కథలను ఆహ్వానిస్తున్నాం. కథలు ఈ క్రింది చిరునామాకు 15 అక్టోబరు, 2009 నాటికల్లా పంపించి సహకరించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం.

జీవన్, ప్రతిభా ప్రచురణలు, 4-1-19, రోటరీ నగర్, ఖమ్మం–507 002, మొబైల్: 9948908230& 9963570174



October 2009_30_09_2009_4.pmd 39 10/1/2002, 8:42 PM

## శ్రామిక వర్గ కవి శ్రీశ్రీ

సాహితీస్రవంతి (చాంద్రాయణగుట్ట శాఖ) ఆధ్వర్యంలో ఆగస్టు 28న మిధాని ఎంప్లాయిస్ యూనియన్ ఆఫీసు(ల్యాబ్ క్వార్టర్స్) వద్ద శ్రీశ్రీ శతజయంతి సభ జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ కవి శివారెడ్డి మాట్లాడుతూ కష్టజీవుల పక్షాన కడదాకా నిలిచిన సామ్యవాద స్వాప్నికుడు శ్రీశ్రీ అన్నారు. తన సాహిత్యం ద్వారా శ్రమజీవుల్ని కథానాయకుల్ని చేశారన్నారు. ఈ సభకు సాహితీస్రవంతి నగర కన్వీనర్ సత్యభాస్కర్ అధ్యక్షత వహించారు. సభా కార్యక్రమానికి ముందు తంగిరాల చక్రవర్తి కవి గాయక సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వూసల రజనీగంగాధర్, జి. యాదగిరి రావు, సి. హెచ్. లీలావతి, జి. విజయశ్రీ, జి. అప్పారావు, జి.ఎస్. రామకృష్ణ, గజవెల్లి తదితరులు పాల్గొన్నారు. మిధాని, బిడిఎల్, డిఫెన్స్, డి.ఆర్.డి.ఎల్ సంస్థలకు చెందిన ఉద్యోగులు, కార్మికులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## గురజాడ జయంతి, శ్రీశ్రీ శతజయంతి సభ

తెలుగు భాషా వైభవ పరిరక్షణ వేదిక, సాహితీస్రవంతి, త్యాగరాయ గానసభ సంయుక్త ఆధ్వర్యంలో సెప్టెంబర్ 21న గురజాడ 148వ జయంతి, శ్రీశ్రీ శతజయంతి సభ జరిగింది. ఈ సభకు రవితేజమ్ పత్రిక సంపాదకులు భూపతి రవీంద్రనాథ్ అధ్యక్షత వహించారు. నాటి కాలంలోని ఆచారవ్యవహారాలపై నాటకంలో, కథలో, నవలలో రచయితలు ధ్వజమెత్తారని వక్తలు అన్నారు. కన్యాశుల్కం, కొండుభట్టీయం, బిల్హణీయం వంటి కావ్యాలలో గురజాడ నాటి సామాజిక పరిస్థితుల్ని అభ్యుదయ దృక్పథంతో రికార్డు చేశారని సీనియర్ సుధామ అన్నారు. శ్రీశ్రీ కవిత్వం నేటి ప్రపంచీకరణ పరిస్థితులకు అన్వయించుకోవాల్సిన స్థితి ఉందని ప్రముఖ కవి అద్దేపల్లి రామమోహనరావు అన్నారు. గురజాడ రాసిన పూర్ణమ్మ కావ్యంలోని ముత్యాలసరాల గీతాల్ని డా॥ పింగళి జగన్నాథరావు పాడి సభికులను అలరించారు. సహకార సారధి సంపాదకులు పి.వి. బ్రహ్మం, సాహితీస్రవంతి నగర కన్వీనర్ ఎ.సత్యభాస్కర్ సభలో ప్రసంగించారు. శ్రీశ్రీ గీతాల ఆలాపన పోటీలో పాల్గొన్న విజేతలకు, గాయకులకు బహుమతులు అందజేశారు. సినీగీతాల పోటీకి వూసల రజనీగంగాధర్ న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. కవి గాయక సమ్మేళనంలో ఆచార్య నరేంద్ర, లంకా సుబ్రహ్మణ్యం, జి.ఎస్.రామకృష్ణ, సూర్యనారాయణశర్మ, పొత్తూరి సుబ్బారావు, సుతారపు వెంకటరమణ, భాస్కర్, టి.సాయిసుందర్, గురజాడ విజయశ్రీ, చిమ్మపూడి శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు. గురజాడ అప్పారావు సభకు స్వాగతం పలుకగా, తంగిరాల చక్రవర్తి వందన సమర్పణతో సభ ముగిసింది.

## కవిత్వం సమస్యలకు పరిష్కారం చూపాలి




కవిత్వం సమాజంలోని అనేక సమస్యలకు పరిష్కార మార్గాలు చూపేలా ఉండాలని ప్రముఖ కవి కె. శివారెడ్డి అన్నారు. సెప్టెంబరు 20న అనంతపురంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో జరిగిన ఉమ్మడిశెట్టి సాహితీ అవార్డు ప్రధానోత్సవ సభలో ఆయన మాట్లాడారు. అవార్డు వ్యవస్థాపకులు డాక్టర్ రాధేయ కవితా సంపుటి 'అవిశ్రాంతం'ను ఆయన ఆవిష్కరించారు. జీవితాన్ని అధ్యయనం చేయడానికి సాహితీ ప్రసంగాలు ఎంతో దోహదపడతాయని ఆయన అన్నారు. విద్యార్థుల్లో సాహిత్య జిజ్ఞాసను కల్గించడానికి కళాశాలల్లో సభలు ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. సభకు అధ్యక్షత వహించిన జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రాజారాం మాట్లాడుతూ ప్రజల జీవన సారాంశం నుంచి వచ్చిన కవితలకే పాఠకుల ఆదరణ లభిస్తుందన్నారు. ఉమ్మడిశెట్టి సాహితీ అవార్డు వ్యవస్థాపకులు డాక్టర్ రాధేయ మాట్లాడుతూ కవిత్వాన్ని బతికించడానికి 1988లో అవార్డును స్థాపించినట్లు తెలిపారు. ప్రతియేటా క్రమం తప్పకుండా అవార్డు ప్రధానం చేస్తున్నామన్నారు. 21వ అవార్డు కోసం రాష్ట్రవ్యాప్తంగా 97 కవితా సంపుటాలు వచ్చాయని, నల్గొండ జిల్లా వాసి డాక్టర్ పెన్నా శివరామకృష్ణ రచించిన 'దీపఖడ్గం' ఎంపికైందని తెలిపారు. సభలో అవార్డు గ్రహీత శివరామకృష్ణ, అదృష్టదీపక్, నందిని సిధారెడ్డి మాట్లాడారు. అనంతరం శివరామకృష్ణకు అవార్డును ప్రధానం చేశారు. కార్యక్రమ అనుసంధానకర్తగా చంద్రశేఖర్‌శాస్త్రి వ్యవహరించారు. కవులు ఏలూరి ఎంగన్న, సింగమనేని నారాయణ, శాంతినారాయణ, నాగేంద్ర, మల్లెల నరసింహమూర్తి, డాక్టర్ జూపల్లి ప్రేమ్‌చంద్, జయచంద్ర, చిలుకూరి దేవపుత్ర తదితరులు పాల్గొన్నారు.



పెన్నా శివరామకృష్ణను ఉమ్మడిశెట్టి అవార్డుతో సత్కరిస్తున్న దృశ్యం

# డైరీ

## "అమ్మంటే" కవితా సంపుటి ఆవిష్కరణ




ధర్మకేతనం సాహిత్య కళాపీఠమ్, మానస ఆర్ట్ థియేటర్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఆగస్టు 30న సుందరయ్య విజ్ఞాన భవన్, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్‌లో ఎన్.రఘువీర్ ప్రతాప్ రచించిన "అమ్మంటే" కవితా సంపుటిని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ వైస్ ఛాన్సలర్ ఆచార్య డా॥ కొలకలూరి ఇనాక్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ అమ్మ హృదయాన్ని ఆవిష్కరించిన పుస్తక రచయిత మాతృత్వాన్ని మనసునిండా, ఊహనిండా, ఊసులనిండా నింపుకుని అద్భుతంగా రాశాడన్నారు. సభకు అధ్యక్షత వహించిన నాగపూర్ యూనివర్శిటీ ప్రొఫెసర్ డా॥ఎన్.ఎన్. మూర్తి, అంతర్జాతీయ పర్యావరణ వేత్త సౌందర్యం, అక్షరసౌభాగ్యం ఉందని, ఆయనలో ఆలోచనావేదాగ్ని శిఖరాలు జాజ్జ్వలమానంగా రేగుతున్నాయని అన్నారు. రచయిత్రి శ్రీమతి శ్రీపాద స్వాతి మాట్లాడుతూ ప్రకృతి పచ్చదనంతో నిండిన నులి వెచ్చని కవిత్వాన్ని అచ్చంగా అమ్మేతానై రచయిత ప్రతి కవితలోను గుండెలోతుల్ని తాకేలా రాశాడని పుస్తక సమీక్షను చేశారు. ఈ కార్యక్రమంలో రఘుశ్రీ, జానకిరాములు, దార్ల విశ్వనాథ్, వై.దేవదానం, పొత్తూరి సుబ్బారావు, సాహితీ ప్రియులు, కవులు, పాల్గొన్నారు. రచయిత ప్రతిస్పందన అనంతరం స్వయంగా ఆహూతలందరికి అమ్మంటే పుస్తకాలను పంపిణీ చేశారు.

## తెలుగు భాషను కాపాడుకుందాం !

ఋగ్వేదంలో తెలుగువారి ప్రస్తావన కనిపిస్తుందని, అనేక ప్రాచీన శిలాశాసనాలలో తెలుగు పదాలు కనిపిస్తాయని, అటువంటి



ప్రాచీన భాషను కేంద్రం గుర్తించినందుకు తెలుగువారు దీనిని గుర్తించి కాపాడుకోవాలని" బి.ఎస్.ఎన్.ఎల్. విశ్రాంత డిప్యూటీ జనరల్ మేనేజర్ వి.విజయ మోహన్ సూచించారు. ఆగస్టు 30న చెన్నైలో 'జనని' సాంఘిక, సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో చలపాక ప్రకాష్ సంపాదకత్వంలో ప్రచురించబడిన "తెలుగు భాషకు ప్రాచీన హోదా-తక్షణ కర్తవ్యం" వ్యాస సంకలనాన్ని ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ఆవిష్కరించారు. అనంతరం విశిష్ట అతిథిగా పాల్గొన్న ప్రముఖ రచయిత ఎం.ఆర్.వి.సత్యనారాయణమూర్తి తెలుగుభాషలో పద్యానికి ఉన్న విశిష్టతను వివరించి, చక్కని పద్యాన్ని సభలో ఆలపించి దానిలో గొప్పదనాన్ని చవిచూపించారు. పుస్తక సంపాదకులు చలపాక ప్రకాష్ ప్రసంగిస్తూ వాడుక భాషలో ఆంగ్ల పదాల్ని తగ్గించి భవిష్యత్ తరాలకు తెలుగు భాషను అందించేందుకు ప్రతి వ్యక్తీ కృషి సల్పాలని సూచించారు. ప్రముఖ రచయిత షణ్ముఖశ్రీ అధ్యక్షతన జరిగిన ఈ సభలో 'జనని' సంస్థ ప్రధాన కార్యదర్శి గుడిమెట్ల చెన్నయ్య మాట్లాడుతూ "ఎందరో త్యాగధనులైన తెలుగువారి కృషి వల్ల సాధించుకున్నప్రాచీన హోదాను నిలుపుకునేందుకు ప్రతి ఒక్క తెలుగువాడూ పాటుపడాలన్నారు. సంస్థ సంయుక్త కార్యదర్శి ఉప్పలధడియం వెంకటేశ్వర సభకు స్వాగతం పలుకగా షేక్ అన్వర్‌బాబు వందన సమర్పణ చేశారు.

## శ్రీశ్రీ కవితల పోటీ ఫలితాలు

శ్రీశ్రీ శతజయంతి సందర్భంగా పాలమూరు సాహితి ఆధ్వర్యంలో శ్రీశ్రీ కవితల పోటీ ఫలితాలను పాలమూరు సాహితి అధ్యక్షులు భీంపల్లి శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కవితల పోటీకి రాష్ట్రం నుంచేకాక, రాష్ట్రేతర కవులు కూడా తమ కవితలను పంపించారని, మొత్తం 135 కవితలు వచ్చాయని తెలిపారు. ఈ కవితల పోటీకి న్యాయనిర్ణేతలుగా ప్రముఖ కవులు కె.శివారెడ్డి, అద్దేపల్లి రామ్మోహనరావు, వల్లభాపురం జనార్ధన్‌లు వ్యవహరించారు. ప్రథమ బహుమతి అమీబా-ర్యాలీ ప్రసాద్, ద్వితీయ బహుమతి అతడు మనిషి-బండి సత్యనారాయణ, తృతీయ బహుమతి ధ్వంసరచన-డా॥కె.జి.వేణు గెలుపొందారు. పది మంచి కవితలుగా సిందూరం-మౌన శ్రీమల్లిక్, పాలమూరు-మహేశ్ లింగాకారి, కాస్ట్రేషన్ చేయండి-జ్వలిత, నగ్న సత్యం-ఎస్వీ కృష్ణ జయంతి, మట్టి మనిషి శాపం - పిట్ట సాంబయ్య, పిడికిలి ఎత్తాల్సిందే-బద్ది నాగేశ్వరరావు, నాముఖం-డా॥ బాలరాజు తక్కల్ల, గుండె పెట్టి వినండి-కిలపర్తి దాలినాయుడు, కరకట్ట- డా॥చిల్లర భవానీదేవి, మరో ప్రస్థానం-ఆనంద్ కుమార్ సాగర్ ఎంపికయ్యాయి. ముందే పేర్కొన్నట్టుగా ప్రథమ బహుమతిగా మూడు వేలు, ద్వితీయ బహుమతిగా రెండు వేలు, తృతీయ బహుమతిగా వెయ్యి రూపాయలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. పాలమూరుపట్టణంలో జరిగే ఒక కార్యక్రమంలో విజేతలకు బహుమతులు అందజేయడం జరుగుతుందని ఎంపికైన కవితలతో పుస్తకం కూడా విడుదలవుతుందని ఆ ప్రకటనలో తెలియజేశారు.



October 2009_30_09_2009_4.pmd 41 10/1/2002, 8:42 PM

## 'రంగుల చీకటి' ఆవిష్కరణ



"రంగుల చీకటి అనడంలోనే కవితాత్మకత ఉంది. సాముదాయికంగా అడిగోపుల వెంకటరత్నంది ప్రతీకాత్మక కవిత్వం. అనువాదానికి ఒదిగే సార మూలికలు ఇందులో వున్నాయి. అపూర్వమైన ఈ భావచిత్రాలతో సర్వాంగీనంగా ప్రతీకాత్మకలు పరుచుకుని ఉన్న ఈ కవిత్వంలో అడిగోపుల వెంకట రత్నం అగ్రకవుల సరసన నిలుస్తారు" అని ఆచార్య సి.నారాయణరెడ్డి అన్నారు. సెప్టెంబర్ 1 న శ్రీ త్యాగరాయ గానసభలో మానస ఆర్ట్ థియేటర్స్, కవనవేదికల సంయుక్తాధ్వర్యంలో ఏర్పాటైన అడిగోపుల వెంకటరత్నం 16వ కావ్యం 'రంగుల చీకటి'ని ఆయన ఆవిష్కరించారు. సభకు అధ్యక్షత వహించిన ఆచార్య ఎన్.గోపి తన ప్రసంగంలో "వృత్తి రీత్యా ఇంజనీరైన అడిగోపుల పరమభావుకుడు, ఏది పలికినా సమయస్ఫూర్తితో పలికారన్నారు. పుస్తకాన్ని పరిచయం చేస్తూ డా॥జె.బాపురెడ్డి 'సందేశాత్మక కవిత్వం, అనుభూతి కవిత్వం' అంటూ విశ్లేషించారు. మరో వక్త డా॥ శిలాలోలిత తన ప్రసంగంలో "ఈ కావ్యంలో ప్రతి కవిత సరళ సుందరం, అర్థవంతం. సమసమాజ స్థాపన, పేదరికం నిర్మూలన, స్త్రీ శక్తి విస్మరణ, అంటరాని వ్యాధుల గురించి ఎంతో విపులంగా రాశారు" అని కొనియాడారు. రఘుశ్రీ స్వాగతం పలుకగా, కవనవేదిక చీకోలు సుందరయ్య వందన సమర్పణ చేశారు. అడిగోపుల అతిథులను జ్ఞాపికలతో సత్కరించారు. కళా సుబ్బారావు వేదిక పక్షాన దీక్షితులు అభినందించారు.



**లేఖిని సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాదులోని త్యాగరాయ గానసభలో జరిగిన సభలో పొత్తూరి విజయలక్ష్మి రచించిన 'చంద్రహారం', 'మా ఇంటి రామాయణం' కథా సంపుటాలను ఆవిష్కరిస్తున్న డా॥ వాసా ప్రభావతి. చిత్రంలో తమిరిశ జానకి, డా॥ కవనశర్మ, కళావేంకట దీక్షితులు, డా॥ పోరంకి దక్షిణామూర్తి, శ్రీరమణ, రచయిత్రి పొత్తూరి విజయలక్ష్మి ఉన్నారు.**

## హృద్యం వెయ్యేళ్ల తెలుగు పద్యం



వెయ్యేళ్ల తెలుగు పద్యం హృద్యమై, సహృదయ నైవేద్యమై, అమృతతుల్యమై, అజరామరంగా సాగిపోతుందని పలువురు వక్తలు, సాహితీవేత్తలు, వక్తలు కొనియాడారు. ఆగస్టు 21న నెల్లూరు పురమందిరంలో నాగభైరవ అవార్డు కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ప్రముఖ కవి, సాహితీవేత్త డాక్టర్ నాగభైరవ కోటేశ్వరరావు ప్రథమ వర్ధంతి సందర్భంగా నాగభైరవ స్మారక పురస్కార ప్రదానోత్సవ సభ జరిగింది. ప్రఖ్యాత కవి, సినీ నిర్మాత డాక్టర్ మల్లెమాల అవార్డును స్వీకరించారు. మల్లెమాల రచించిన "వృషభ పురాణం" పద్యకావ్యం అవార్డుకు ఎంపిక కావడం పద్య కవిత్వానికి సంక్రాంతి పండుగ వంటి సన్నివేశమని అవార్డు ప్రధాత డాక్టర్ ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం అభివర్ణించారు. అవార్డు గ్రహీత డాక్టర్ మల్లెమాల ప్రసంగిస్తూ "పద్యం తన ప్రాణమన్నారు. పద్యం తనను కవిగా నిలిపి, అవార్డుకు అర్హుణ్ని చేసిందన్నారు. తనకు అత్యంత ఆప్తులైన నాగభైరవ పేరుతో నెలకొల్పిన అవార్డు ప్రప్రథమంగా తనకు లభించడం నెల్లూరు వాసిగా తన అదృష్టమని మల్లెమాల అన్నారు. ప్రముఖ సాహితీ పోషకులు మాదాల తిమ్మయ్య 50 వేల రూపాయల నగదును అవార్డు నిమిత్తం అందచేశారు. సభకు తొలుత సినీ కవి వెన్నెలకంటి స్వాగతం పలుకగా ప్రముఖ ఆడిటర్ కవి చిన్ని నారాయణరావు సభను నిర్వహించారు. సభలో ఆకాశవాణి డైరెక్టర్ ఎం.ఆదిత్యప్రసాద్, ప్రరసం అధ్యక్షులు బి.హనుమారెడ్డి, డాక్టర్ తూమాటి సంజీవరావు, డాక్టర్ భీరం సుందర్‌రావు, గొట్టిపాటి నరసింహస్వామి, తంగా, డాక్టర్ సుధాకర్, మాదాల తిమ్మయ్య, స్థానిక సాహితీ వేత్తలు, కవులు, నాగభైరవ శిష్యులు, అభిమానులు, నాగభైరవ అవార్డు కమిటీ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

### సవరణ

ఆగస్టు సంచికలో ప్రచురించ బడిన **'ఓ వసుధా, ఆగు!'** కవిత పాబ్లో నెరుడా రాసిన కవితగా గమనించగలరు. నిఖిలేశ్వర్ దానిని ఆంగ్లం నుండి అనువాదం చేశారు.

### గమనిక

డైరీ శీర్షికకు సమాచారం పంపేవారు కార్యక్రమాల తేదీలు, సమావేశం జరిపిన స్థలం వివరాలు తప్పనిసరిగా రాయగలరు. కార్యక్రమాల తేదీ, తదితర వివరాలు లేకుండా ఫొటోలు ప్రచురించబడవని గమనించగలరు. **-ఎడిటర్**



October 2009_30_09_2009_4.pmd 42 10/1/2002, 8:42 PM

## డైరీ

## సమాజ హితవు కోరేదే సాహిత్యం



సమాజ హితవు కోరేదే సాహిత్యమని కవులు, రచయితలు సమాజాన్నిప్రభావితం చేసే ఎన్నో రచనలు చేశారని ఆకాశవాణి విజయవాడ కేంద్రం స్టేషన్ డైరెక్టర్ మంగళగిరి ఆదిత్యప్రసాద్ అన్నారు. చిలకలూరిపేట పట్టణంలోని రిజిస్ట్రార్ కార్యాలయం వద్దగల నూతన గ్రంథాలయ భవనంలో ఆగస్టు 15న తోటకూర వెంకటనారాయణ రచించిన 'స్వాతంత్ర్యం కోసం' పుస్తకావిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన గరిమెళ్ల సత్యనారాయణ వంటి పాత తరం కవులు రాసిన గీతాలు చదివి వినిపించారు. ప్రస్తుతం ఎటువంటి సాహిత్యం వస్తుందో వివరిస్తూ నారాయణ రచించిన స్వాతంత్ర్యం కోసం పుస్తకాన్ని సమీక్షించారు. అనంతరం శాసనమండలి సభ్యులు కెఎస్. లక్ష్మణరావు 'స్వాతంత్ర్యం కోసం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ పుస్తకాన్ని ఆవిష్కరించడం గొప్ప విషయమని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ స్థాపించక ముందే స్వాతంత్ర్యం కోసం పోరాటం ప్రారంభమైందని అన్నారు. గుంటూరు జిల్లాకు చెందిన దుగ్గిరాల గోపాలకృష్ణ, పర్వతనేని వీరయ్యచౌదరి వంటి మహానుభావులు కూడా స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసిన వారిలో వున్నారని తెలిపారు. స్వాతంత్రోద్యమాన్ని గురించి వేరు వేరు కోణాలలో ఇలాంటి గ్రంథాలు రావాల్సిన అవసరం ఉందన్నారు. స్వాతంత్ర్యం కోసం పుస్తకాన్ని నారాయణ మామగారైన దివంగత జరుగుల వెంకటరామయ్యకు అంకితమిచ్చారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన గుంటూరు జిల్లా డిప్యూటీ కలెక్టర్, కవి సోమేపల్లి వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ ఆదినుండి అంతం వరకూ ఆద్యంతం ఈ పుస్తకం చదివించే విధంగా ఉందని, ఇందులోని అంశాలు విద్యార్థులో దేశభక్తిని రగిలిస్తాయని అన్నారు. కార్యక్రమంలో తోటకూర ప్రభాకరరావు, చిలకలూరిపేట విద్యా సంఘం అధ్యక్షులు తేళ్ల సుబ్బారావు, జిల్లా రచయితల సంఘం కోశాధికారి సయ్యద్ జానీభాషా, విశ్రాంత ప్రిన్సిపాల్ తోటకూర వెంకటరాములు, కోటిరెడ్డి, డాక్టర్ పివి.సుబ్బారావు, విజయకుమార్, సూర్యకుమార్, అడ్వకేట్ ఉపేంద్రరావు, ఉమామహేశ్వరరెడ్డి, అధ్యాపకులు, కవులు పాల్గొన్నారు.

## అలరించిన అష్టావధానం




గుంటూరు ప్రభుత్వ మహిళా కళాశాలలో సాహితీ సమాఖ్య ఆధ్వర్యంలో ఆగస్టు 18న న అష్టావధానం రసవత్తరంగా సాగింది. డాక్టర్ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ అవధానిగా పాల్గొన్నారు. తొలుత కళాశాల అధ్యక్షురాలు డాక్టర్ ఎన్.గీతాంజలి అవధాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అవధాన సభలో పాల్గొన్న విద్యార్థుల, అధ్యాపకుల, పృచ్ఛకుల మనోభావాలను, అవధాన సభను వర్ణించమని ప్రిన్సిపాల్ డా.ఎన్.గీతాంజలి కోరగా చమత్కారమైన సమాధానంతో అలరించారు. అవధానంలోని నిషిద్ధాక్షరిని డా॥జి సాయివర ప్రసాదరావు (తెలుగు రీడర్), పురాణ శ్రవణను డా॥ వి.నాగరాజ్యలక్ష్మి (రీడర్), సాంస్కృతిక శాఖ, దత్తపదిని శ్రీమతి ఎన్.మంజులవాణి, (తెలుగు లెక్చరర్) సమస్యా పూరణను డా॥ఆర్.నాగిరెడ్డి (రీడర్ ఇన్ కామర్స్) ఆశు కవిత్వాంశాన్ని డా॥ జి.వెంకటేశ్వర్లు (తెలుగు లెక్చరర్), వర్ణనను డా॥జె. సుహాసినీ పాండే (తెలుగు లెక్చరర్), చిత్రాక్షరిని కుమారి లలిత (ఎం.ఏ.తెలుగు విద్యార్థి) నిర్వహించారు. ఈ అవధానంలో అప్రస్తుత ప్రసంగ కార్యక్రమానికి ఎ.సత్యనారాయణ (రసాయన శాస్త్రం విభాగాధిపతి) ప్రత్యేక వేషధారణలో విచ్చేసి తమ చమత్కారాలతో సభ్యులను హాస్యపు జల్లులలో ముంచెత్తారు. ఆద్యంతం ఆహ్లాదభరితంగా సాగిన ఈ అష్టావధానం తెలుగు భాష యొక్క ప్రాముఖ్యాన్ని, విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి అవధానం తోడ్పడుతుందనే అంశాన్ని నిరూపించింది. సాహితీ సమాఖ్య సభ్యులు డాక్టర్ జి.సాయివరప్రసాదరావు, డాక్టర్ వి.నాగరాజ్యలక్ష్మి, డాక్టర్ బి.వెంకటేశ్వర్లు, ఎ.చిన్నబ్బాయి, వి.యస్.యస్.వి.ప్రసాద్, ఎస్.కె.సుభాని కార్యక్రమాన్ని నిర్వహించారు.



**విశాఖపట్టణంలోని పౌరగ్రంథాలయంలో ఆగస్టు 16న జరిగిన సభలో 'మంజరి' రాసిన 'నివాళి' కథాసంపుటి ఆవిష్కరణ దృశ్యం. చిత్రంలో రచయిత మంజరి.సూర్యనారాయణరాజు, ఎల్.ఆర్.స్వామి, ఆవిష్కర్త ఎం.వి.వి. సత్యనారాయణ, కళ్యాణరామారావు, కొంపెల్ల కామేశ్వరరావు తదితరులు ఉన్నారు.**



October 2009_30_09_2009_4.pmd 43 10/1/2002, 8:42 PM

# డైరీ



ఎన్. అరుణ రచించిన 'సూది నా జీవన సూత్రం' కవితా సంపుటిని హైదరాబాద్ శ్రీ త్యాగరాయ గానసభలో డా॥ సి. నారాయణరెడ్డి ఆవిష్కరిస్తున్న దృశ్యం. చిత్రంలో ప్రముఖ మరాఠీ కవయిత్రి అనుపమ ఉజ్‌గరే, గానసభ అధ్యక్షులు కళావేంకట దీక్షితులు, ప్రముఖ రంగస్థల నటులు దుగ్గిరాల సోమేశ్వరరావు, సాంస్కృతిక శాఖ సంచాలకులు డా॥ రాళ్ళబండి కవితాప్రసాద్, కవయిత్రి అరుణ, డా॥ వాసాప్రభావతి, డా॥ చిల్లర భవానీదేవి, కిన్నెర ఆర్ట్స్ థియేటర్స్ కార్యదర్శి మద్దాలి రఘురాం ఉన్నారు.




కొండెపోగు బి. డేవిడ్ లివింగ్‌స్టన్ రచించిన 'దగ్ధ దృశ్యం' పుస్తకాన్ని ఆగస్టు 31న ఒంగోలు పట్టణంలోని కాపు కళ్యాణ మండపంలో ద్రావిడ విశ్వవిద్యాలయం ప్రొ॥ డి.వి. శ్రవణ్ కుమార్ ఆవిష్కరించిన దృశ్యం.



ఢిల్లీలో ఢిల్లీ తెలుగు అకాడమీ వారి 'విశాల భారతి గౌరవ పురస్కారా'న్ని డా॥ ద్వానా శాస్త్రికి అందజేస్తున్న ఒరిస్సా గవర్నర్ ఎం. సి. భండారె. చిత్రంలో కార్పోరేట్ వ్యవహారాల శాఖ కేంద్ర మంత్రి సల్మాన్ కుర్షీద్ ఉన్నారు.



ప్రజాసాహితి వేదిక-విజయవాడ సభలో సెప్టెంబర్ 20 న కె. ఆంజనేయకుమార్ కవితా సంపుటి 'మీకు దగ్గర్లోనే...' ఆవిష్కరిస్తున్న డా॥ నందిని సిధారెడ్డి. చిత్రంలో ఎడమ నుంచి వరుసగా కె. ఆంజనేయకుమార్, ప్రజాసాహితి ఎడిటర్ కొత్తపల్లి రవిబాబు ఉన్నారు.



డా॥ ద్వానా శాస్త్రి సంకలనం చేసిన 'సినారె కవిత్వంలో ఉక్తులు-సూక్తులు' గ్రంథాన్ని ఆచార్య యార్లగడ్డ బాలగంగాధరరావుకి అంకితమిస్తున్న దృశ్యం. చిత్రంలో గుత్తికొండ సుబ్బారావు, కృష్ణా విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు ఆచార్య దుర్గాప్రసాద్, డా॥ వోలేటి పార్వతీశం, డా॥ గుమ్మా సాంబశివరావులు ఉన్నారు.

## రచయితలకు సూచనలు

సాహిత్యప్రస్థానం పత్రికకు కథలు, కవితలు, వ్యాసాలు పంపిస్తున్న రచయిత/రచయిత్రులకు ధన్యవాదాలు. నాణ్యతలో తేడాలున్నా కవితలు విరివిగా వస్తూనే ఉన్నాయి. కథల విషయం అలా లేదు. వచ్చిన కొన్ని కథలు కొత్తదనం లేకుండానూ, పేలవంగానూ ఉంటున్నాయి. మంచి కథలు పంపించడానికి ఆయా కథకులు మరింతగా కృషిచేయాలి. మంచి వ్యాసాలు ఎక్కువ సంఖ్యలో వస్తున్నప్పటికీ సుదీర్ఘంగా ఉండటం ఒక సమస్యగా ఉంది. మరీ పెద్ద వ్యాసాలను పత్రిక పేజీల సంఖ్యరీత్యా ప్రచురించడం ఇబ్బందే. వ్యాసరచయితలు సాధ్యమైనంత వరకు ముద్రణలో మూడు పేజీలకు మించకుండా (చేతిరాతలో సుమారుగా ఆరు పేజీలు) రాయడానికి ప్రయత్నించగలరు. ప్రసిద్ధులైన గురజాడ, శ్రీశ్రీ, జాషువా వంటివారిపై ఎక్కువగా వస్తున్నాయి. వీరితోపాటు విభిన్న సాహిత్యకారుల సాహిత్యం గురించి కూడా వ్యాసాలు రాయడానికి వ్యాసరచయితలు ప్రయత్నించాలి. పత్రికకు రచనలు పంపించడంతో పాటు సంవత్సర చందా కట్టి ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేస్తున్నాం. మీ మిత్రులు, శ్రేయోభిలాషులకు సాహిత్యప్రస్థానం పత్రికను పరిచయం చేయగలరు. మీ సహాయ సహకారాలతో పత్రికను మరింత వినూత్నంగా, ప్రయోజనకరంగా తీసుకురావడానికి మా వంతు ప్రయత్నం ఎప్పుడూ ఉంటుంది.

– సంపాదకుడు



October 2009_30_09_2009_4.pmd 44 10/1/2002, 8:42 PM

# కొత్త పుస్తకాలు

## కథావలోకనం

**కె.పి. అశోక్‌కుమార్**

**లభ్యత: palapittabooks@gmail.com**




**వెల: రూ. 50/- పేజీలు: 140**

అశోక్ కుమార్ వ్యాసాల్లో శైలి అతను మిత్రుల మధ్య సాహిత్యాది విషయాలను చర్చించేటప్పుడు మాట్లాడుతున్న పద్ధతిలో ఉంటుంది. చదువుతుంటే అతనే ఎదురుగా కూర్చుని చెప్తున్నట్లుగా ఉంటుంది. కథలలోని కథలను సంగ్రహించి చెప్పడం మనకు కథ వినిపిస్తున్నట్టుగా ఉంటుంది. విమర్శ మూల్యాంకన పద్ధతిలో ఉంటుంది. కొన్ని చోట్ల అభిప్రాయ ప్రకటనలతో, వ్యాఖ్యలతో నిండి ఉంటుంది. కొన్ని చోట్ల నిర్ధారణలు చేయడం కనిపిస్తుంది. కథా రచనలలో లోపాలు తెలియజేయడం, అవసరమైన సూచనలు చేయడం కూడా కనిపిస్తుంది. వీటన్నింటినీ అభివ్యక్తం చేసే శైలి ఒకరకంగా మౌఖికశైలి అని చెప్పవచ్చు.

**-కె.కె.రంగనాథాచార్యులు**

## ప్రేమ మరికొన్ని సంగతులు

**పెన్నా శివరామకృష్ణ**

**వెల : రూ.50/-పేజీలు132**

**లభ్యత : 9848787284**




ప్రేమ ఒక ఉద్వేగమే కాదు. మన జీవితాన్ని నడిపించే మానసిక అవసరమన్న ఎరుక వల్లనే ప్రేమ గురించి అధ్యయనానికి ఉపక్రమించారు. అనేకానేక పుస్తకాలు, పత్రికలు చదివారు. ఇంటర్‌నెట్‌లో ప్రేమ గురించిన వెబ్‌సైట్లని శోధించారు. తను సేకరించిన వందలాది ప్రముఖుల మాటల్లోంచి ఆసక్తికరమైన వాటిని ఏరికూర్చారు. ప్రతి మనిషిలో వుండే ప్రేమోద్వేగానికి, అలజడికి సంబంధించిన ఆణిముత్యాలెన్నో ఈ పుస్తకంలో తారసపడతాయి.

**-పాలపిట్ట బుక్స్**

## దేశ దేశాల హైకు

**వెల : 30.00 పేజీలు : 98**

**పెన్నా శివ రామకృష్ణ**

**లభ్యత: 9848787284**




నాకు ఇష్టమైన కవితా ప్రక్రియలో హైకూ ఒకటి. హైకూతత్త్వాన్ని గూర్చి అధ్యయనం చేసే క్రమంలో ప్రపంచ వ్యాప్తంగా వివిధ స్థలకాలాలకు, వివిధ భావజాలాలకు చెందిన కవులను హైకూ ప్రభావితం చేసిందని తెలుసుకుని ఆశ్చర్యపోయాను. వివిధ దేశాలలో, వివిధ భాషలలో రాయబడిన హైకూలు చదివి ఆనందించాను. నాకు బాగా ఆనందం కలిగించిన, ఆలోచనాత్మకమైన, గంభీరమైన కొన్ని హైకూలను కవిత్వాభిమానులకు పరిచయం చేయాలన్న కోరికే ఈ పుస్తక ప్రచురణకు మూలం.

**-పెన్నా శివ రామకృష్ణ**

## మా ఇంటి రామాయణం (హాస్య కథల సంపుటి)

**పొత్తూరి విజయలక్ష్మి**

**వెల: రూ.80/-పేజీలు: 117**




సోమరాజు సుశీల, విజయలక్ష్మిగార్లది ఎక్కువగా ముళ్లపూడి తరహా హాస్యమే. కానీ ఈ సంపుటిలోని కొన్ని కథల్లో మాత్రం విజయలక్ష్మిలోని అధిక్షేప దృష్టి చక్కగా ఆవిష్కృతమైంది. అలాంటి కథలే ఎక్కువ బాగున్నాయి. ఆధునిక జీవితంలోని ఎన్నో విషయాలను ఆమె సునిశితంగా విశ్లేషించారు. వీటన్నింటిని ప్రధానంగా భార్యాభర్తల సంబంధాల నేపథ్యంలో హాస్య గుళికల్లా తీర్చిదిద్దడం ఆమె ఎంచుకున్న శిల్పం. నిజానికి కథల్లోని వస్తువులు అసాధారణమైనవి కావు. కానీ, మనం నిత్యం చూసే వాటిని, నిత్యం అనుభవించే ఇబ్బందులను కాస్తంత సెన్సాఫ్ హ్యూమర్‌తో చూడగలిగితే జీవితాన్ని భరించడం ఇంకా సులువవుతుందని ఈ కథలు చెప్తాయి.

**- మృణాళిని**

## మనసులోని మాట (అనువాద కవితలు)

**డా॥ అనంత్ కాబ్‌రా**

**వెల: రూ.150/- పేజీలు: 248**

**లభ్యత: 9848787284**




'మనసులోని మాట' భాష ఏదైతేనేం, భావపరంపరలు-ధ్వనులకు 'ప్రతిధ్వనులు', చర్యలు ప్రతిస్పందనలు - ఎక్కడైనా ఒకటే. అన్న శీర్షికతో డా॥ అనంత్ కాబ్‌రాగారి కవితల్ని చదివితే మనకు ఈ విషయం స్పష్టంగా బోధపడుతుంది. సమకాలీన సమాజంలో ఎందరికో వినబడని, కనబడని ధ్వనులు దృశ్యాలు వీరి రచనల్లో ప్రతిధ్వనించాయ్, ప్రతిబింబించాయ్.

**-డాక్టర్ ఎమ్. రంగయ్య**

## గంధకుటి

**కవిత్వం-దేవిప్రియ**

**వెల: రూ. 75.00 పేజీలు: 51**




గంధకుటిలో పచార్లు చేశాక
అంతవరకూ ఎరగని ఒక కొత్తరోజు మనల్ని తొడుక్కుని
వేటినో కోల్పోయి వేటినో పొంది
సముద్రగర్భం దాచుకున్న ఉక్కు ఓడలు, మట్టి స్మృతులు,
ఆయుధాలు ఇంకా భూమికేసి ఆకలిగా చాచే సముద్రనాలుక,
మెరుపు ఊడలు తుపానులా చుట్టుముట్టి
కతలు, వెతలు, సంక్లిష్టతలు, ప్రేమలు, చరిత్రలు,
వీరగాధలు, వైరాగ్యాలు అతుక్కుని అరికాళ్లు బరువెక్కి అలా
రికామీగా చాలాసేపే కూచోవాలనిపిస్తే-
మరచిపోయిన చెట్లు వరసగా నడిచొస్తాయి.
నిద్ర మింగేసిన క్షణాలు బొమ్మల కొలువు తీరతాయి.
అనుమతి అవసరంలేని ఓ అపరిచిత నగరం మొలుస్తుంది
గంధకుటి నేల వైయక్తిక పలవరింతల్లోంచి.
సాదాసీదా పదాలే రంగురంగుల పూలై రెక్కలు విప్పి
చుట్టూ ఎగురుతాయి కవిత్వపరిమళంలో మనం తడిసేదాకా

**- రమణజీవి**



October 2009_30_09_2009_4.pmd 45 10/1/2002, 8:42 PM

# కొత్త పుస్తకాలు

## సినారె కవిత్వంలో ఉక్తులూ సూక్తులూ

**డా.ద్వా.నా.శాస్త్రి**

**వెల : రూ.80/- పేజీలు : 80**

**లభ్యత : 9849293376**




ఈ ఉక్తుల్నీ సూక్తుల్నీ ఎన్నిక చేయటం చాలా కష్టమనిపిస్తుంది. అన్ని ఉక్తులూ సూక్తులూ ఉన్నాయన్నమాట. చాలా నిబ్బరంగా, కొండొకచో నిశ్చయంగా గుండెను పదిలం చేసుకుని – పుస్తక పరిమితినీ– ప్రచురణ భారపరిమితినీ దృష్టిలో ఉంచుకుని ముత్యాలలో ఆణిముత్యాల వంటివి ఎన్నిక చేశాను. ఇపుడు తృప్తిగా ఉంది. ఈ పుస్తకం సినారె గారి ఉక్తి చతురతకి, సూక్తి నిపుణతకీ నిలువుటద్దం.

**- డా.ద్వా.నా.శాస్త్రి**

## ఇన్‌షా అల్లాహ్

## ఆధునిక శతకందాలు

**దేవిప్రియ**

**వెల : 20/- పేజీలు : 32**

**లభ్యత : 9490634849**




దేవిప్రియ కవితల్లో అతి ప్రధానంగా మన సామాజిక వ్యవస్థలోని అపస్వరాలు దర్శనమిచ్చి ఆలోచింపజేస్తాయి. అక్కడ ఆయన జీవన సత్యాలను కుండబ్రద్దలు కొట్టి మరీ చూపిస్తాడు లోపలి లోపాలు. మతఛాందసులు కొందరు సాగించే మారణహోమాన్ని మన నాట కొనసాగనివ్వరాదని అందరూ కోరుకుంటారు. అయితే దేవిప్రియ ఈ నివారణకు ప్రేరణకాగల కారణాన్ని ముందు పెడతాడు.

**- మలిక్**

## చంద్రహారం (కథల సంపుటి)

**పొత్తూరి విజయలక్ష్మి**

**వెల : రూ.120/- పేజీలు : 200**

**లభ్యత : 040 -27637729**




రచయిత్రుల్లో పొత్తూరి విజయలక్ష్మి గారిని గురించి విశేషంగా చెప్పవలసింది ఏమంటే, హాయిగా చదివించే ప్రసన్నమయిన శైలికి తోడుగా సున్నితమైన హాస్యాన్ని జోడించి కథలో మనం లీనమయ్యేటట్లు చేయడంలో దిట్టకావడం. ఆ కారణంగా ఆమె మీద హాస్యరచయితగా ముద్రపడిందంటారు. అదేదో మచ్చపడినట్లు అనుకోనక్కరలేదు. ఆ ప్రజ్ఞ అందరికీ రాదు. ఆ పేరూ రాదు. వచ్చినందుకు సంతోషించాలి, పైగా ఆరోగ్యంగా ఉన్నవాళ్లందరూ హాస్యమంటే ఇష్టపడతారు కనక, తప్పకుండా చదువుతారు.

**-పోరంకి దక్షిణామూర్తి**

## అమ్మ మాగ్జింగోర్కి ప్రఖ్యాత నవలకు నాటక రూపం

**వడ్లమూడి నాగేశ్వరరావు**

**వెల : రు. 20/- పేజీలు : 73**

**లభ్యత : 27608107**




ప్రపంచ ప్రసిద్ధమైన మాగ్జింగోర్కి మహత్తర నవల 'అమ్మ' నూరేళ్ల పండుగను సాహితీ లోకం ఘనంగా నిర్వహించింది. ఆ సందర్భంలో తలపెట్టిన ఈ ప్రచురణ ఆలస్యంగా మీ చేతుల్లోకి వస్తోంది. అమ్మ నవలను నాటకీకరించి ప్రదర్శించింది ప్రజా నాట్యమండలి. అది కూడా ఇందిరాగాంధీ ఎమర్జన్సీ పాలన జోరు మీదున్నప్పుడు విజయవాడలో జరిగిన ఈ నాటక ప్రదర్శన ఒక విధంగా ప్రజానాట్యమండలి పునరుద్ధరణకు నాంది పలికింది. ప్రజాకవిగా సుపరిచితుడైన వడ్లమూడి నాగేశ్వరరావు దీని రూపశిల్పి. అయితే నాటి ప్రజానాట్యమండలి బాధ్యులందరి పాత్ర దీంట్లో ఉంది.

**-సాహితీ స్రవంతి**

## సంవిధానం

## గుడిపాటి

**వెల : 50 /- పేజీలు : 162**




లిఖిత కథ అచ్చులోకి వచ్చి 110 సంవత్సరాలవుతున్న సందర్భమిది. ఈ నేపథ్యంలో కథాసాహిత్యంలోని పలు అంశాల్ని చర్చకు పెట్టిన వ్యాసాలివి. ఇవాల్టి కథలోని మేలిమినీ, బలిమినీ చెప్పిన ఈ వ్యాసాలు కథావిమర్శ విస్తృతికి ఉపకరిస్తాయి. కథలోని వస్తుశిల్పాలే కాకుండా తాత్వికకోణాల్ని వివరించిన ఈ వ్యాసాలు సాహిత్య పాఠకులకు, కథా సాహిత్యాన్ని సీరియస్‌గా అధ్యయనం చేస్తున్న వారికి ఉపయోగపడతాయని ఆశిస్తున్నాం.

**-పాలపిట్ట బుక్స్**

## విద్యార్థుల కోసం శ్రీశ్రీ

**వెల : లేదు, పేజీలు : 36**




ఆయన కథ రాసినా, నాటిక రాసినా, ఆత్మకథ రాసినా, కవిత్వం రాసినా అన్నింటా బడుగుజీవికి పట్టం కట్టబట్టే ప్రజాకవి అయ్యాడు. మహాకవి అయ్యాడు. ఆయన కవితల్ని మీలాంటి పిల్లలకు పరిచయం చేద్దామన్న సంకల్పం కొద్దీ ఈ చిన్న పుస్తకం కూర్చాం. సెప్టెంబర్ 11 ప్రపంచ పుస్తక పఠన దినోత్సవం సందర్భంగా పాఠశాలలు, కళాశాలలు– వంద విద్యా సంస్థల్లో ఈ పుస్తకాన్ని మీచేత చదివిస్తున్నాం.

**-శ్రీశ్రీ శత జయంతి వేదిక**

**చిత్తూరు జిల్లా**




October 2009_30_09_2009_4.pmd 46 10/1/2002, 8:42 PM

# కొత్త పుస్తకాలు

## అవిశ్రాంతం(కవిత్వం)

**రాధేయ**

**వెల:రూ. 60/- పేజీలు:82**

**లభ్యత:998517141**



రక్తమూ, కన్నీళ్ళు, అగ్ని కలిసి ప్రవహించే కవిత్వం అవిశ్రాంతం – కవిగా రాధేయ ఎదుగుదల నన్నాశ్చర్యపర్చలేదు – ఆయన్ని గత రెండు దశాబ్దాలుగా ఫాలో అవుతూనే వున్నా, సంవత్సరం గుర్తులేదు. ఆశారాజుకి ఉమ్మడిశెట్టి అవార్డు వచ్చినప్పుడు మొదటిసారిగా కలిశాననుకుంటా –అక్కడ నుంచి బాగా దగ్గరిగా రావటం మొదలయిందనుకుంటా– అది ఎలాంటి వేదనయినా సరే తలొగ్గనితనం అలవర్చుకునే తత్వం రూపొందించుకున్నారు.

**-శివారెడ్డి**

## మీకు దగ్గర్లోనే..

**కె. ఆంజనేయకుమార్**

**వెల : రూ.50/-పేజీలు176**

**లభ్యత : 9490597282**




మానవత్వం మీద మార్కెట్ శక్తులూ, స్వదేశీ సంస్కృతి మీద విదేశీ దుష్ప్రభావమూ, నాయకుల స్వార్థం వల్ల, విజయం సాధిస్తుండడమే ఈ నాటి గొప్ప విషాదనేపథ్యం. ఈ నేపథ్యాన్ని గ్రహించిన వారే సమకాలీనత గల కవులుగా చెప్పుకోదగినవారు. ఈ తరానికి చెందిన అలాంటి కవులలో మొదటి వరసలో ఉంటాడు ఆంజనేయకుమార్. 'మీకు దగ్గర్లోనే' అతని మొదటి కవితా సంపుటిగా వస్తోంది. తానికపై కొనసాగించబోయే ప్రస్థానానికి ఇది నాందిగా నిలుస్తోంది. ఆంజనేయకుమార్‌లో సమకాలీన వైరుధ్యాల పట్ల ఆవేదనతో పాటు ఆగ్రహం ఉంది. ప్రపంచీకరణ దుష్ఫలితాల పట్ల అసహ్యంతో పాటు, కసి ఉంది. సామ్యవాద సమాజం పట్ల ఆశతోపాటు అవగాహన ఉంది. వస్తువు పట్ల అభిమానంతో పాటు అభివ్యక్తి పట్ల గౌరవం ఉంది. కావలసిన సామాగ్రి ఉంది. కాబట్టి ఉత్తమ కవిగా ఎదగ గలడని ఆశిస్తాను.

**-అద్దెపల్లి రామమోహన్‌రావు**

## "లండన్ కోటు"(కథల సంపుటి)

**వెల :150/- పేజీలు :247**

**సగ్గురాజయ్య**

**లభ్యత:9949672183**



ఇవి తెలంగాణ జనజీవన సంఘర్షణలు... సంక్షిప్తంగా ఉన్న తెలంగాణ జీవితానికి అద్దంపట్టిన మంచి కథలు... ఇది ఈ రచయిత మొదటి కథల సంపుటే అయినా ఎంతో అనుభవంతో రాసినట్టనిపిస్తాయి. హాయిగా చదివిస్తాయి. మనకెన్నో విషయాలను తెలియజేస్తాయి. ఇవి అతని అనుభవసారాలు. తాను నివసించిన హైదరాబాద్ జీవితం, సమస్యలు, లాలాపేట ప్రాంత జీవితం, పరిసరాలు మనకీ కథల్లో కనిపిస్తాయి.

**-డా॥ కాలువ మల్లయ్య**

## విదేహ (ప్రేమలేఖలు)

**వంశీకృష్ణ**

**వెల:రూ.60/-పేజీలు:114**

**లభ్యత:9491959062**




కవి, రచయిత అయిన వంశీకృష్ణ ఈ లేఖన ప్రక్రియని ఎంచుకోవడం ఒక గొప్ప తిరుగుబాటు. మనుషుల మీద విరుచుకుపడుతున్న సాంకేతిక రాక్షసికి ప్రతిఘటన. ఆచార్య ఎన్.గోపి కొన్నాళ్ళ కిందట 'చచ్చిపోతున్న ఉత్తరం' అనే కవిత ఎంతో ఆర్ద్రంగా రాశారు. ఆయనే కాదు ఉత్తరం మటుమాయవుతున్న దృశ్యాన్ని చెప్పిన కవులు, రచయితలు మరికొందరు వున్నారు. అయితే వాపోవడం కాదు ప్రతిఘటించడం అవసరం. ఈ కర్తవ్యాన్ని తెలియకనే నెరవేర్చాడు వంశీ.

**- గుడిపాటి**

## నా సీమ నాటికలు

**(వై. శ్రీరాములు)**

**వెల:రూ.100/- పేజీలు:193**

**లభ్యత: 9247817167**



ప్రకృతి పర్యావరణంలోని భాగంగానే ఒక్కొక్క స్థల కాలాల్లో ఒక్కొక్క భాష పుట్టి ఒక్కో ప్రాంతంలో ఆయా ప్రాంతపు మనస్తత్వాలకు అనుగుణంగా కళా రూపాలు ఆవిర్భవించాయి. ఒక ప్రాంత సాంఘీక జీవన ప్రక్రియలో ఆ ప్రాంత మానసిక శారీరక ప్రతిక్రియను ప్రతిబింబిస్తూ ప్రదర్శితమయ్యే సామాజిక జీవన అనుసరణే నాటకం.

**-వై. శ్రీరాములు**

## విస్ఫోటనం నుండి విధ్వంసం దాకా... (దీర్ఘకవిత)

**-వై. శ్రీరాములు**

**వెల:రూ. 100/- పేజీలు:156**

**లభ్యత: 9247817167**



గ్లోబలైజేషన్ ఊబిలో కూరుకుపోతున్న పాపాయి డాలరు

ప్రపంచంపై భారంగా కదులుతున్న రోడ్డురోలరు

ప్రస్తుతం మనసుకంటే వేగంగా పరుగులెత్తేది ప్రపంచీకరణ అన్నప్పుడు ప్రపంచీకరణ కంటే ముందుగా పరుగులెత్తేవి, ప్రపంచమంతా స్పష్టంగా అవుపించేవి పేదరికం, నిరుద్యోగం, హెచ్చుతగ్గులు, మానసిక రుగ్మతలు, ఆర్థికమాంద్యం...

ప్రపంచీకరణపై కార్పొరేటు వ్యాపారం వేటు పడినందునే, కార్పొరేటు వ్యాపారుల కనుసన్నలలో ప్రపంచం కదలికలు, జరుగుతున్నందునే ప్రతి దేశ పరిస్థితి అగమ్యగోచరంగా వుంది...

**- వై శ్రీరాములు**



October 2009_30_09_2009_4.pmd 47 10/1/2002, 8:42 PM

# కొత్త పుస్తకాలు

## బాల నిఘంటువు

**దేవినేని మధు సూదనరావు**

**వెల : రూ.40/- పేజీలు : 91**

**లభ్యత : 9246994466**




ప్రపంచంలో అత్యధిక సంఖ్యాకులు మాట్లాడే భాషల్లో తెలుగుకు ఆరోస్థానం. ఇంత చరిత్ర, వైభవం, ప్రాముఖ్యత కలిగిన తెలుగు భాష నేడు నిరాదరణకు గురికావడం శోచనీయం. తెలుగు భాష కనుమరుగైతే తెలుగుజాతే అంతరించిపోతుంది. అమ్మ భాష ఆచంద్రతారార్కం నిలిచి వుండాలనే ఆశ మనందరికీనూ, చంద్రునికో నూలుపోగులా రూపొందించిన బాల నిఘంటువు ఇది.

**-సాకం నాగరాజు**

## అశ్రుజల

**కె.వి.రమణారెడ్డి**

**వెల : 30/- పేజీలు : 88**

**లభ్యత : 9885620875**




ఈ కవితా సంపుటిలో తాత్కాలిక సంఘటనలూ ఉన్నై. కొనసాగుతున్న సంఘటనలు ఉన్నై. పసివాళ్లు చేసే ప్రమాదకరమైన సర్కస్‌లు, వన్యప్రాణుల విధ్వంసాలు, జోగినుల వ్యవస్థపై 'ఆజమ్మ' తిరుగుబాటు, ప్రకాశం జిల్లాలోని అనేక గ్రామాల్లో విష రసాయన కలుషిత జలాల వల్ల అనేక మంది మరణించిన క్యాన్సర్ వ్యాధి, ఫ్లోరిన్ ప్రమాదం, బాణామతి వల్ల జీవితాలకు ముగింపు కలగడం, సింగరేణి కార్మికుల ప్రాణాంతక శ్రమ, మాయమౌతున్న అమ్మతనం, దిక్కులేని రైతన్న జీవితం ఇంకా ఎన్నో ఎన్నో సమకాలీన సంఘటనాత్మక కవితలు, కవిని 'అశ్రుజల'గా చేసిన దృశ్యాలు విస్తరించిఉనై

**- డా|| అద్దేపల్లి రామమోహనరావు**

## త్వక్కం కవిత్వం

**శిఖామణి**

**వెల : రూ.75/- పేజీలు : 106**

**లభ్యత : 9848202526**



మానవీయత ఒక పక్షమైతే తాత్త్వికత మరోప్రక్క చోటుచేసుకుంటుంది శిఖామణి కవిత్వంలో. సమాజంలోని రుగ్మతకు, అసమానతలకు ఆయనలో క్రోధం పెల్లుబికినా రుసరుసలాడక, వానిని కవిత్వపు మిసమిసలుగా ప్రదర్శిస్తాడు. కవిత్వం జీవితాన్ని శిథిలం కాకుండా కాపాడే ఓజోను పొర. శిఖామణి ఈ ఓజోను పొరను సురక్షితమొనరిస్తూ, జీవితం ఛిన్నాభిన్నం కాకుండా కాపాడాలి.

**-డా|| వడలి మందేశ్వరరావు**

## తెలుగు భాషకు ప్రాచీన హోదా తక్షణ కర్తవ్యం

**చలపాక ప్రకాష్**

**వెల : రు. 25/- పేజీలు : 64**

**లభ్యత : 25541572**




"ప్రాచీన భాషా హోదా - మన తక్షణ కర్తవ్యం" అనే అంశంపై రమ్యభారతి నిర్వహణలో "జనని" వ్యాస రచన పోటీలు నిర్వహించడం, వాటి బహుమతి ప్రదానోత్సవం 22-3-2009న విజయవాడలో ప్రముఖ సాహితీవేత్తల సమక్షములో నిర్వహించడం జరిగినది.

ఆనాడే విజేతలైన వారి వ్యాసాలతో ఒక సంకలనాన్ని తీసుకురావాలని "జనని" నిర్ణయించినది. అలా తీసుకువచ్చిన వ్యాస సంకలనమే ప్రస్తుతం మీ ముందున్నది.

**-గుడిమెట్ల చెన్నయ్య**

## బుడ్డా వెంగళరెడ్డి

**యస్.డి.వి. అజీజ్**

**వెల : 50/- పేజీలు : 100**

**లభ్యత : 9701371256**




జీవిత చరిత్రలు కథలుగా నవలారూపంలో వ్రాసే ప్రక్రియ అజీజ్‌గారు స్వంతం చేసుకున్నారు. మన సమాజంలో వెంగళరెడ్డి వంటి వారి జీవితాల గురించి ఈ ప్రక్రియలో మరిన్ని రచనలు అజీజ్‌గారు తీసుకురావాలని కోరుతున్నాను. పాఠకులను ఆసక్తిగా ఈ పుస్తకం చదివిస్తుంది. మనస్సు ఆకట్టుకుంటుంది. విద్యార్థులకు ఇటువంటి పుస్తకాలను ఉపవాచకాలుగా పెడితే బాగుంటుంది.

**- లవణం**

## దింపుడు కళ్ళం

**రంగనాథ రామచంద్రరావు**

**వెల : 60/- పేజీలు : 120**

**లభ్యత : 9290050229**




ఈ అన్ని కథల్లోనూ ఒక రచయిత పాఠకుడిని తన వెంట నడిపిస్తాడు. ఈ కథల్లోని పాత్రలన్నీ జీవితంలో ఎక్కడో ఒకచోట మనకు తారసపడేవే. అందువల్ల కథల్లోని జీవితంతో మనం కూడా ఎంతో కొంత భాగం పంచుకుంటాము. రచయిత ఏ కథల్లోనూ పాఠకుడి నెత్తిమీద బలవంతంగా జీవిత సత్యాలను రుద్దడు. కథల్లో ఆవిష్కృతమయ్యే జీవితమే, పాఠకుడికి జీవిత సత్యాలను బోధిస్తుంది!

**- సింగమనేని నారాయణ**


Printed, Published and owned by **V. Krishnaiah** 1-1-298/4, Street No-1, Ashoknagar, Hyderabad-20,
Printed at Prajashakti Daily Printing Press, 1-1-60/2, M.B. Bhavan, Musheerabad, Hyderabad,
Published at **Shaitya Prasthanam** 1-1-60/2, M.B. Bhavan, Musheerabad, Hyderabad-20. **Editor. T. Ravi**



October 2009_30_09_2009_4.pmd 48 10/1/2002, 8:42 PM

# అవగాహన ఏర్పరచుకుందాం!
# స్వైన్ ఫ్లూను నివారిద్దాం!!

ఒకరి నుంచి మరొకరికి సోకే ఇన్‌ఫ్లూయెంజా-ఎ (హెచ్1 ఎన్1) (స్వైన్ ఫ్లూ)ను ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ప్రత్యేక చర్యలను కేంద్ర ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమశాఖ ప్రశంసించింది. రాష్ట్ర ప్రజలు ఎటువంటి భయాందోళనలకు గురికాకుండా అవగాహనతో తగిన ముందు జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు, ఈ వైరస్ లక్షణాలు కనిపించిన పక్షంలో సరైన వైద్యసహాయం పొందడం ద్వారా స్వైన్ ఫ్లూ వ్యాప్తిని అరికట్టవచ్చు.

## ఈ వ్యాధి నివారణకు పాటించవలసిన జాగ్రత్తలు:

- దగ్గినప్పుడు లేదా తుమ్మినప్పుడు జేబురుమాలు లేదా టిష్యూతో మీ నోరు మరియు ముక్కును కవర్ చేసుకోండి
- మీరు జ్వరము, దగ్గు, జలుబు వంటి లక్షణాలు కలిగి ఉన్నట్లయితే వీలైనంత వరకు ఇతరులను కలవకుండా ఇంటివద్దనే విశ్రాంతి తీసుకోండి
- మీ ముక్కు, కళ్ళు లేదా నోటిని తాకడానికి ముందు మరియు తరువాత సబ్బుతో మీ చేతులను బాగా శుభ్రపరచుకోండి
- నీళ్ళు బాగా త్రాగండి మరియు బలమైన పోషకాహారాన్ని తీసుకోండి
- మీరు ఫ్లూ వంటి ఏదేని లక్షణాలు కలిగి ఉన్నట్లయితే జేబురుమాలు లేదా మాస్కును మీ ముఖానికి కట్టుకుని వైద్యుని సంప్రదించండి

## ఈ వైరస్ గురించి ముఖ్యంగా తెలుసుకోవలసిన విషయాలు:

- ప్రతిఒక్కరు మాస్కులు ధరించనవసరంలేదు.
- వ్యాధి తీవ్రంగా ఉన్నప్పుడు మాత్రమే సంబంధిత వైద్యుని సూచనల మేరకు సరైన మోతాదులో యాంటీ వైరల్ మందులు వాడాలి
- ఫ్లూ లక్షణాలున్న వ్యాధిగ్రస్తులను చికిత్సాపరంగా ఎ, బి, సి వర్గాలుగా విభజించారు

## హెచ్1 ఎన్ 1 వైరస్ వ్యాధి నివారణకు, చికిత్సకు ప్రభుత్వ ఏర్పాట్లు:

- స్వైన్ ఫ్లూను గుర్తించడానికి హైదరాబాద్‌లోని ఎర్రగడ్డ ప్రభుత్వ ఛాతి వైద్యశాలతో పాటు వనస్థలిపురం, కొండాపూర్, కింగ్‌కోఠి ప్రాంతాలలో ఉన్న ఏరియా ఆసుపత్రులలోను, ఇ.ఎస్.ఐ., గాంధీ మరియు ఉస్మానియా ఆసుపత్రులలోను, నార్కెట్‌పల్లి, ఆర్టీసి, లాలాగూడలోని రైల్వే ఆసుపత్రులలో స్క్రీనింగ్ సెంటర్లను మన రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసింది
- రోజుకు 40 మందికి పైగా వ్యాధిగ్రస్తులకు నిర్ధారణ పరీక్షలు జరిపేందుకు వీలుగా హైదరాబాద్‌లోని నారాయణగూడలో ఉన్న ఐ.పి.యం. కేంద్రాన్ని సంసిద్ధం చేశారు
- వ్యాధి తీవ్రంగా ఉన్న రోగుల కోసం హైదరాబాద్‌లోని ఎర్రగడ్డ ప్రభుత్వ ఛాతి వైద్యశాలలో ప్రత్యేక వార్డులను ఏర్పాటు చేశారు
- హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఆసుపత్రులైన అపోలో, కిమ్స్, కేర్, గ్లోబల్, యశోద ఆసుపత్రులతోపాటు రాష్ట్రవ్యాప్తంగా మరికొన్ని ఎంపిక చేసిన నర్సింగ్ హోంలలో దాదాపు 150 ప్రత్యేక పడకలను కేటాయించి స్వైన్ ఫ్లూ వ్యాధి చికిత్సకు ఏర్పాట్లు చేసింది ప్రభుత్వం
- వ్యాధి బాధితులకు చికిత్స నిమిత్తం అన్ని జిల్లా కేంద్రాలలోని ప్రభుత్వ ఆసుపత్రులలో పదేసి ప్రత్యేక పడకలను ఏర్పాటు చేసి, ఆయా ఆసుపత్రులలోని సిబ్బందికి స్వైన్ ఫ్లూ చికిత్సపై ప్రత్యేక శిక్షణను ప్రభుత్వం అందించింది
- ముందుజాగ్రత్త చర్యగా రోగుల అవసరార్థం తగినన్ని మందులను ప్రభుత్వం సిద్ధం చేసింది

**స్వైన్‌ఫ్లూ హెల్ప్‌లైన్ నెంబర్లు**

| | |
|---|---|
| బి.ఎస్.ఎన్.ఎల్. టోల్ ఫ్రీ నెం. | ప్రభుత్వ ఛాతి వ్యాధుల వైద్యశాల, హైదరాబాద్ |
| **12506 లేదా 104** | **040 - 23814939** |

(లేదా) H1N1 HYD అని టైప్‌చేసి 55352 నెంబరుకు ఎస్.ఎం.ఎస్. చేయవచ్చు

జారీ చేసినవారు: సమాచార, పౌరసంబంధాల శాఖ

SAHITYA PRASATHANAM RNI N0.APTEL/ 2004/18396 Postal Regd. No.H/SD/415/07-09


## ఉపాధ్యాయులు, తల్లితండ్రులు చదువవలసిన పుస్తకాల జాబితా

| క్ర.స | పుస్తకం పేరు | వెల | క్ర.స | పుస్తకం పేరు | వెల |
|---|---|---|---|---|---|
| 1. | పిల్లలు నేర్చుకోవడంలో ఎలా వెనకబడతారు? | 60.00 | 13. | పిల్లలిల్లు వెనుక | 25.00 |
| 2. | పిల్లలు ఎలా నేర్చుకుంటారు | 60.00 | 14. | చదువు సంధ్యలు | 25.00 |
| 3. | టీచర్ | 40.00 | 15. | మహోజ్వల స్మృతులు | 35.00 |
| 4. | విముక్తి-విద్య | 40.00 | 16. | మనిషి కథ | 40.00 |
| 5. | టీచర్లకు ఉత్తరం | 40.00 | 17. | డార్విన్ | 25.00 |
| 6. | మాస్టారూ...! | 10.00 | 18. | పరిణామక్రమంలో విద్యా వ్యవస్థ 1833-2003 | 15.00 |
| 7. | మా బడిలో | 10.00 | 19. | వేదభూమి | 10.00 |
| 8. | కథలే పాఠాలు | 25.00 | 20. | సమాజం-సైన్స్- సంప్రదాయం | 15.00 |
| 9. | బోధన-శోధన | 30.00 | 21. | సైన్సు చరిత్రలో సామాజికాంశాలు | 10.00 |
| 10. | విభిన్న విద్యా సంస్థలు | 25.00 | 22. | పిల్లల అలవాట్లు | 25.00 |
| 11. | భాష-భావం | 20.00 | 23. | భారతదేశ చరిత్ర | 25.00 |
| 12. | మీరు - మీ పిల్లలు | 15.00 | 24 | పిల్లల భాష - ఉపాధ్యాయుడు | 25.00 |

## పిల్లలు చదివే పుస్తకాల జాబితా

| క్ర.స | పుస్తకం పేరు | వెల | క్ర.స | పుస్తకం పేరు | వెల | క్ర.స | పుస్తకం పేరు | వెల |
|---|---|---|---|---|---|---|---|---|
| 1. | మహావిశ్వం మన భూమి | 20.00 | 34. | మాయా కథలు | 10.00 | 67. | యమున వడ్డారు | 10.00 |
| 2. | అద్భుతాలయం | 25.00 | 35. | పక్షుల స్వర్గం-బంగారువెన్నెలలు | 15.00 | 68. | బంగారు తంత | 15.00 |
| 3. | విలియం షేక్స్పియర్ | 15.00 | 36. | అమ్మతోడు-నేను | 10.00 | 69. | మాయా పిడుగులు | 15.00 |
| 4. | హైడీ | 20.00 | 37. | వేషా | 10.00 | 70. | పోలీస్ చెప్పిన పాఠం | 15.00 |
| 5. | విశ్వవిఖ్యాత శాస్త్రజ్ఞులు | 15.00 | 38. | బద్ధకం వదిలింది | 15.00 | 71. | ఫ్లోర-తాబేలు | 10.00 |
| 6. | విదేశీ కథలు | 15.00 | 39. | బుడిబుడికథలు | 40.00 | 72. | పింకి-పిల్లి | 10.00 |
| 7. | విజ్ఞాన శిఖరాలు | 15.00 | 40. | పిల్లల ప్రశ్న-సైన్స్ జవాబు | 15.00 | 73. | సైన్సాధ్యయన సర్వస్వం | 15.00 |
| 8. | చైనా నీతి కథలు | 15.00 | 41. | మేమెవరం | 20.00 | 74. | కోడి-ఎవరు | 10.00 |
| 9. | భారతీయ శాస్త్రవేత్తలు | 15.00 | 42. | విశ్వం-జీవపరిణామం | 30.00 | 75. | నాకెవ్వరున్నారు? | 15.00 |
| 10. | అందాల పొద్దు | 15.00 | 43. | సంతానసంపాద శిల్పులు | 30.00 | 76. | సంతోషంగా-నేర్చుకుందాం | 10.00 |
| 11. | పిల్లల గణితం | 15.00 | 44. | విశ్వం-విజ్ఞానం | 25.00 | 77. | పంచతంత్ర కథలు | 10.00 |
| 12. | పిల్లలు-పిడుగులు | 20.00 | 45. | ప్రకృతిలో అద్భుతాలు-విజ్ఞానశాస్త్రాలు | 45.00 | 78. | బడిముద్దులు నేను | 10.00 |
| 13. | సరదా సరదా చదువులు | 15.00 | 46. | కాలిక్యులేటర్ గేమ్స్ | 20.00 | 79. | అడవిలో సింహం | 15.00 |
| 14. | తరగతిలో తమాషాలు | 15.00 | 47. | అబ్రహాంలింకన్ ప్రాణాంచెలే | 10.00 | 80. | సముద్ర దేశాలు | 15.00 |
| 15. | వానచుక్క - సరాసరిదరి | 25.00 | 48. | వేలిన్న పెదనాన్న-చిట్టిటంగ కృతజ్ఞత | 15.00 | 81. | దయ్యం | 15.00 |
| 16. | వర్షంలో మ్యాజిక్కు | 25.00 | 49. | మంచిగా పుంజాం | 30.00 | 82. | కథలంటే మాకిష్టం-1 | 25.00 |
| 17. | పొడవా ఓ కొలువుకొవా | 15.00 | 50. | భలేలుపులు | 10.00 | 83. | కథలంటే మాకిష్టం-2 | 25.00 |
| 18. | పిల్లల సంక్షేమం | 25.00 | 51. | పోటకేసిన పోటీలు | 15.00 | 84. | రామకృష్ణకృష్ణాసా | 45.00 |
| 19. | అద్భుతాలతో ఆటలు | 30.00 | 52. | బబ్బు వెలిగించి | 20.00 | 85. | సత్యగుణం | 25.00 |
| 20. | నేర్చుకోవడం మాకిష్టం | 20.00 | 53. | రవీంద్రనాథ్ ఠాగూర్ | 15.00 | 86. | పెన్సిల్ బాక్స్ | 15.00 |
| 21. | కథలంటే మాకిష్టం | 40.00 | 54. | విజయింటేనే పిడుగు | 25.00 | 87. | మంచి అమ్మ | 15.00 |
| 22. | ఆటలంటే మాకిష్టం | 30.00 | 55. | ఇంటి నుండి పాఠశాలకు | 20.00 | 88. | కోతి ఫ్లాట్ | 25.00 |
| 23. | పాటలంటే మాకిష్టం | 20.00 | 56. | చెట్టు | 15.00 | 89. | కథ కాని కథ | 15.00 |
| 24. | పాపకోసం | 25.00 | 57. | చిటపట చినుకులు | 20.00 | 90. | లోకంమెక్కిన పిడుగు | 40.00 |
| 25. | తేటతెలుగు-1 | 30.00 | 58. | చిట్టిరాముడు-చందమామ | 10.00 | 91. | దుడుం ఆట | 10.00 |
| 26. | తేటతెలుగు-2 | 30.00 | 59. | గుడ్డు నుండి పిల్ల | 20.00 | 92. | పెద్దల మాటలు-పిల్లలకొమ్ముం | 20.00 |
| 27. | కొత్తిమీర్ | 10.00 | 60. | కుంది భూమం కథ | 20.00 | 93. | సెలవంటే | 25.00 |
| 28. | ఛోటినేనకేక్లా | 10.00 | 61. | మన కథ | 20.00 | 94. | సోమరిపోతు కోతులు | 20.00 |
| 29. | పాపమ్మకథలు-పిల్లసిపుల్లు | 15.00 | 62. | వడివేటి వానకథ | 20.00 | 95. | పిల్లలు ఎందుకు విఫలమవుతారు? | 15.00 |
| 30. | సెర్వాంటిస్ డాన్ క్విక్సోట్ | 25.00 | 63. | రహస్యం | 10.00 | 96. | బడి-బ్రతుకు | 25.00 |
| 31. | గణితసాహిత్యమేనిక | 20.00 | 64. | ఎమ్మా | 20.00 | 97. | హిరోషిమా అనుభవాలు | 25.00 |
| 32. | జంతువుల వింతలు | 10.00 | 65. | మనిషిమా రోబోలా? | 10.00 | 98. | సెంకాలు | 20.00 |
| 33. | జంతువుల వింతరూపులు | 10.00 | 66. | బుద్ధిమాన్-తెలివైనాడు | 15.00 | 99. | అక్షరంతో ఆటలు | 15.00 |

# ప్రజాశక్తి బుక్‌హౌస్

1-1-187/1/2, చిక్కడపల్లి, హైదరాబాద్-20. ఫోన్ : 27660013

గమనిక : పై పుస్తకాలు స్కూలు గ్రాంటు నుండి కాని, టీచర్ గ్రాంటు నుండి కానీ మీ స్కూలుకు కొనుగోలు చేసుకోవచ్చును. ప్రజాశక్తి బుక్‌హౌస్, హైదరాబాద్ పేరిట డి.డి./ఎం.ఓ. తీసి పంపవలెను.


**If Un delivered please return to :**


Prasthanam
C/o M.H.Bhavan, Plot No. 21/1, Azamabad
Near RTC Kalyanamandapam, Hyderabad - 500 020 (A.P)
Ph: 040-27660013, Cell: 9490099059